RNI NO.APTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 21.03.2024 | సంపుటి : 10 సంచిక : 251 | పేజీలు : 12 వెల: రూ. 4/- | Follow :

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్










# నూతన గవర్నర్‌గా రాధాకృష్ణన్ బాధ్యతలు

## ప్రమాణం చేయించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే

## హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, అధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రస్తుతం ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్ అదనంగా తెలంగాణ బాధ్యతలు స్వీకరించారు. రాధాకీష్ణన్ తెలంగాణకు ఇప్పుడు మూడో గవర్నర్ కావడం విశేషం. ఇప్టపి వరకు బాధ్యతలు చేపట్టిన ముగ్గురు కూడా తమిళనాడు వారే కావడం మరో విశేషం. తమిళిసై రాజీనామా నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆయన్ను నియమించిన విషయం తెలిసిందే.

మిగతా 2లో..



# పంటనష్టానికి పరిహారం

## నివేదికలు అందగానే రూ.10వేలు సాయమందిస్తాం

- రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది:తుమ్మల
- ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేయడం తగదని హితవు

> అకాల వర్ష బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.పంట నష్టాన్ని అంచనా వే యాలని అధికారులను సీఎం ఆదేశించారు. నివేదికరాగానే రూ.10వేలు సాయమందిస్తాం. రైతుల కోసమే పనిచేస్తున్న ప్రభుత్వంపై కొందరు అనవసర విమర్శలు చేయడం తగదు
>
> – మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్(జనంసాక్షి):** అకాల వర్షాల కార ణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల పూర్తి చిత్తశుద్ధితో ఉందని ఓ ప్రకటనలో వివరించారు. పదేళ్లపాటు అస్తవ్యస్త విధానాలతో రైతులను అగమ్యగోచరంగా చేశారని.. ఇప్పుడు రైతుల కోసమే పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై కొందరు అనవసర విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.పదేళ్లలో ఏనాడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వని వాళ్లు ఇవాళ విడ్డూరంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. కేవలం ఎన్నికలకు ముందు రూ.150 కోట్లు మాత్రమే పరిహారంగా ఇచ్చారని.. రెండో మారు జీవో మాత్రమే ఇచ్చి చేతులు దులుపేసుకున్నారని ఆరోపించారు. మూడోసారి కనీసం పంట నష్టాన్ని కూడా అంచనా వేయలేదని దుయ్యబట్టారు. గత మే నెల వరకు కూడా రైతు బంధు నిధులు జమ చేసిన నేతలు.. ఇవాళ తమను తప్పుబట్టే ప్రయత్నం చేస్తున్నా రని మంత్రి తుమ్మల అభ్యంతరం వ్యక్తం చేశారు.

## వైద్యారోగ్యశాఖలో

# కొలువుల జాతర

## 5348 పోస్టుల భర్తీకి రాష్ట్ర సర్కారు పచ్చజెండా

## ఈనెల 16నే ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి జీవో విడుదల



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖలోని 5,348 పోస్టుల భర్తీకి సర్కారు పచ్చజెండా ఊపింది. ఈమేరకు ఈనెల 16నే ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి జీవో విడుదల చేశారు.ప్రజారోగ్యం, ఆయుష్, డీసీఏ, ఐపీఎం, డీఎంఈ, వైద్య విధాన పరిషత్, ఎంఎన్ జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతులు జారీ చేశారు. వైద్యారోగ్య సర్వీసుల నియామక బోర్డు ద్వారా నేరుగా ఉద్యోగాల భర్తీ చేపట్టాలని సూచించారు. ఇందు కోసం స్థానికత ఆధారంగా ఉన్న ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, అర్హతకు

మిగతా 2లో..

# తొలివిడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- ఎప్రిల్ 19న జరిగే ఎలక్షన్లకు నామినేషన్లు షురూ
- 17 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలు
- మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు ఎన్నికల నిర్వహణ




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఏప్రిల్ 19న పోలింగ్ జరగనున్న లోక్‌సభ తొలి విడత ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ జారీతో బుధవారం నుంచే నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. బీహార్ మినహా తొలి విడత లోక్‌సభ ఎన్నికలు జరిగే మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నామినేషన్ దాఖలుకు ఈ నెల 27 వరకు అవకాశం ఇచ్చారు. బీహార్‌లో మాత్రం మార్చి 28 వరకు నామినేషన్‌ల దాఖలుకు అవకాశం కల్పించారు. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 28న నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. బీహార్‌లో మార్చి 30న నామినేషన్‌ల స్క్రూటినీ జరగనుంది. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 30 నామినేషన్‌ల ఉపసంహరణకు తుదిగడువు. బీహార్‌లో నామినేషన్‌ల ఉపసంహరణకు ఏప్రిల్ 2 వరకు అవకాశం ఇచ్చారు. జూన్ 6తో సాధారణ ఎన్నికల ప్రక్రియ సంపూర్ణంగా ముగియనుంది. తొలి విడతలో 17 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అందులో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు, రాజస్థాన్‌లోని 12 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 8 స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని 6 స్థానాలు, ఉత్తరాఖండ్, అసోం, మహారాష్ట్ర ల్లోని ఐదేసి స్థానాలు, బీహార్‌లోని

మిగతా 2లో..

# తెలంగాణలో మరోసారి ఏన్డీఎస్ఏ కమిటీ పర్యటన

## ఇంజినీర్లతో ఛైర్మన్ అయ్యర్ భేటీ

## మూడు రోజుల పాటు కొనసాగునున్న పర్యటన

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ రాష్ట్రంలో మరో దఫా పర్యటిస్తోంది.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకుంది. మూడు ఆనకట్టల బాధ్యతలు నిర్వహించిన ఇంజినీర్లతో ఎర్రమంజిల్‌లోని జలసౌధలో సమావేశమైంది.గత పర్యటనలో క్షేత్రస్థాయిలో ఆనకట్టలను పరిశీలించిన కమిటీ.. కొంత మంది ఇంజినీర్లతోనూ సమావేశమైంది. ఆనకట్టల డిజైన్స్,

మిగతా 2లో..



# నిందితులను ఎక్కువ కాలం జైళ్లోనే ఉంచాలని చూస్తున్నారా?

## ఈడీ తీరుపై సుప్రీం అసహనం




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** మనీ లాండరింగ్ కేసుల్లో విచారణకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనుసరిస్తోన్న తీరుపై భారత సర్వోన్నత న్యాయస్థానం విచారం వ్యక్తం చేసింది.నిందితులకు డీఫాల్ట్ బెయిల్ నిరాకరించేందుకు వరుసగా అనుబంధ ఛార్జ్‌షీట్లు దాఖలు చేయడాన్ని ప్రశ్నించింది. విచారణ లేకుండా నిందితులను నిరవధికంగా జైల్లోనే ఉంచే ఈ పద్ధతి న్యాయస్థానాన్ని ఇబ్బందికి గురిచేస్తోందని పేర్కొంది."విచారణ పూర్తయ్యేంతవరకు నిందితులను అరెస్టు చేయకూడదనేది డీఫాల్ట్ బెయిల్ ముఖ్య ఉద్దేశం. దర్యాప్తు పూర్తయ్యేవరకు విచారణ చేయొద్దని మీరు చెప్పలేరు. అరెస్టు కూడా చేయడానికి వీలులేదు. అనుబంధ ఛార్జిషీట్లు దాఖలు చేస్తూ.. విచారణ లేకుండా నిందితులను నిరవధికంగా జైల్లోనే ఉంచలేరు" అని ఈడీ తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజుకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం సూచించింది.ఈ కేసులో ఓ వ్యక్తి 18 నెలలపాటు జైల్లోనే ఉన్నాడని, ఇది తమనెంతో ఇబ్బందికి గురిచేస్తోందని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిందితుడిని అరెస్టు చేసినప్పుడే విచారణ మొదలు కావాలని స్పష్టం చేసింది. అయితే, సుప్రీంకోర్టు ఇలాంటి అభిప్రాయాన్ని గతంలోనూ వ్యక్తంచేసింది. దర్యాప్తు పూర్తిచేయకుండా, నిందితుడికి డీఫాల్ట్ బెయిల్ నిరాకరించే ఉద్దేశంతో వరుస ఛార్జిషీట్‌లు దాఖలు చేయడాన్ని తప్పుపట్టింది. ఇదిలా ఉంటే, సీఆర్‌పీసీ ప్రకారం, నిర్దేశించిన గడవులోగా అధికారులు దర్యాప్తు పూర్తి చేయకపోయినా, లేదా తుది ఛార్జిషీటు దాఖలు చేయని పక్షంలో అరెస్టైన వ్యక్తి డీఫాల్ట్ బెయిల్ పొందేందుకు అర్హుడు.



# నా ఫోన్‌కాల్ రికార్డు చేశారు

## దానిని ప్రతిపక్ష ఎమ్మెల్యేకు పంపారు

## హనుమకొండ ఆర్డీవోపై చర్యలు తీసుకోండి

## సీఎస్‌కు మంత్రి పొన్నం ఫిర్యాదు

**హైదరాబాద్(జనంసాక్షి):** హనుమకొండ ఆర్డీవోపై సీఎస్ శాంతికుమారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. తన ఫోన్‌కాల్ రికార్డు చేసి ప్రతిపక్ష ఎమ్మెల్యేకు పంపించారని అందులో పేర్కొన్నారు.వెంటనే ఆర్డీ

మిగతా 2లో..

## పకోడీలమ్ముడుకాదా!..

# మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మనదే:మోదీ



**దిల్లీ(జనంసాక్షి):** దేశాభివృద్ధిలో అంకుర సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. మూడో విడత అధికారంలోకి వచ్చాక భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.దిల్లీలోని భారత మండపంలో 'స్టార్టప్ మహాకుంభ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు."1.25 లక్షల స్టార్టప్‌లు, 110 యూనికార్న్‌లతో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించింది. సరైన సమయంలో కచ్చితమైన నిర్ణయాలతో

మిగతా 2లో..

## వచ్చే ఐదేళ్ల లక్ష్యాలపై దృష్టిసారించండి

వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ కల్పన, కార్మిక రంగంపై మరింత శ్రద్ధ వహించండి

మంత్రిత్వశాఖలను సూచించిన ప్రధాని మోదీ

2లో

# ఎన్నికలవేళ 'ఉచితాల'పై విచారణకు సుప్రీం ఒకే



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సార్వత్రిక ఎన్నికలకు తొలి నోటిఫికేషన్ విడుదలైన రోజే కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ఇస్తున్న తీరుపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించేందుకు భారత సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. త్వరలోనే దీన్ని లిస్ట్ చేస్తామని పేర్కొంది. ఉచిత హామీలు ప్రకటించే పార్టీల గుర్తులు, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసేందుకు ఎన్నికల సంఘం తన అధికారాలను ఉపయోగించేలా ఆదేశించాలని పిటిషనర్ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చే వాగ్దానాలపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పరిశీలించింది. లోక్‌సభ ఎన్నికల కంటే ముందే దీనిపై విచారణ జరపాలని పిటిషనర్ తరఫున హాజరైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా చేసిన

మిగతా 7లో..

# సొంతగూటికి తమిళిసై..

## తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి

## మళ్లీ భాజపాలో చేరిన మాజీ గవర్నర్



**చెన్నై(జనంసాక్షి):**తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. గవర్నర్ పదవితో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన ఆమె..భారతీయ జనతా పార్టీలో చేరారు. చెన్నైలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ తమిళనాడు రాష్ట్ర

మిగతా 7లో..

# రైతులంటే ఎందుకంత చిన్నచూపు?:కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**రైతులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత చిన్నచూపు అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. పంటలు ఎండుతున్నా పట్టించుకోలేదని.. వడగళ్లు ముంచెత్తినా కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. దిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు తప్ప.. గల్లీలో రైతుల కన్నీళ్లు కనిపించవా? వాళ్ల ఆర్తనాదాలు వినిపించవా? ఎన్నికల గోల తప్ప.. ఎన్నో కష్టాలు పడుతున్న శ్రామికులపై కనికరం లేదా? సీట్లు, ఓట్ల పంచాయితీ తప్ప.. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా అంటూ విమర్శలు సంధించారు. ప్రజాపాలన అంటే 24/7 ఫక్తు రాజకీయమేనా? పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి.. పంటనష్టంపై లేదెందుకు? దెబ్బతిన్న పంటలను పరిశీలించే

మిగతా 2లో..



# చైనా విషయంలో నాటి మెతకవైఖరి వల్లే..

## ప్రస్తుత పరిస్థితులు: జైశంకర్



**దిల్లీ(జనంసాక్షి):** భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చైనాపై ఉదాసీన వైఖరితో వ్యవహరించే వారని కేంద్ర మంత్రి జైశంకర్ అన్నారు. చైనా విషయంలో నెహ్రూను పలుమార్లు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ హెచ్చరించారని తెలిపారు.బుధవారం ఒక జాతీయ వార్తా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైనా, అమెరికాలతో సంబంధాలు, భారత్ విదేశాంగ వైఖరిపై మాట్లాడారు."చైనా విషయంలో మాజీ ప్రధాని నెహ్రూ అవలంభించిన విదేశాంగ విధానం బుడగతో సమానం. ఆయనకు అమెరికా అంటే కోపం. అందుకే భారత్‌కు చైనా గొప్ప మిత్ర దేశమన్నారు. అప్పట్లో అందరూ దాన్నే నమ్మారు. ఇప్పటికీ కొంతమంది అదే మాట చెబుతున్నారు. కానీ, చైనా స్నేహాన్ని ఉదాసీన వైఖరితో చూడొద్దని నెహ్రూను పటేల్ ఎన్నోసార్లు హెచ్చరించారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాకిస్థాన్, చైనా వ్యవహారాలపై అప్పటి మంత్రులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పటేల్‌లు ఆందోళన వ్యక్తంచేసినా నెహ్రూ సరైన దృష్టి సారించలేదు. హిమాలయాల మీదుగా ఆక్రమణకు ప్రయత్నిస్తారని అనుకోవడం లేదని చెప్పారు. కానీ, 1962లో చైనా ఆ దుశ్చర్యకు పాల్పడింది. 1950లో అమెరికాకు భారత్ దూరం కావడానికి చైనానే కారణం. దీనిపై నెహ్రూని అప్పటి న్యాయశాఖ మంత్రి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రశ్నించారు. ఈ విషయాలేవీ ఇప్పటితరం వారికి తెలియవు. నెహ్రూ విదేశాంగ విధానాలనే తర్వాత వచ్చిన పాలకులు అనుసరించారు. ఒకవేళ దానికి భిన్నంగా వ్యవహరిస్తే దాన్ని పెద్ద తప్పుగా ప్రచారం చేస్తున్నారు. కంపెనీల్లో ఆడిట్ వ్యవస్థ ఉన్నట్లే దేశాలు అనుసరిస్తున్న విధానాలకు ఆడిట్ ఉండాలి" అని జైశంకర్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం

## నోటిఫికేషన్ విడుదలతో హడావిడి మొదలు

## ఆయా ప్రాంతాల్లో అధికారుల విస్తృత ఏర్పాట్లు

**చెన్నై,మార్చి20(జనంసాక్షి):**రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ఈనెల 20న బుధవారం ప్రారంభం అయ్యింది. 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో నామినేషన్ల స్వీకరణకు ఆయా ప్రాంతాల్లో అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఇదిలావుంటే ఉత్తర చెన్నై నియోజకవర్గంలో పోటీ చేయదలచిన అభ్యర్థులు ఓల్డ్ వాషర్‌మెన్‌పేట, నెం.62 బేసిన్ బ్రిడ్జి రోడ్డులోని ఎన్నికల అధికారి కట్టా రవితేజ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాలి. సౌత్ చెన్నై అభ్యర్థులు అడయారు, నెం 115 డాక్టర్ ముత్తులక్ష్మి రోడ్డులోని ఎన్నికల అధికారి ఎంబీ అమిత్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలి. అదే విధంగా సెంట్రల్ చెన్నై అభ్యర్థులు షెనాయ్‌నగర్ నెం.36బీ పుల్లా అవెన్యూలోని ఎన్నికల అధికారి కేజె ప్రవీణ్‌కుమార్ కార్యాలయంలో నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్, కార్యాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాలలో ఎన్నికల అధికారులు నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈనెల 27వ తేదీ వరకు రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్లు స్వీకరించే అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకే అభ్యర్థి, ఆయన మద్దతుదారులు ప్రయాణించే వాహనాలను అనుమతిస్తారు. ఎన్నికల అధికారి కార్యాలయం లోపలకు అభ్యర్థి సహా ఐదుగురిని మాత్రమే అనుమతిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఎన్నికల అధికారి కార్యాలయాల్లోకి సిబ్బందిని తప్ప ఇతరులెవరినీ అనుమతించరు. అభ్యర్థులు తమ నామినేషన్లతోపాటు రూ.25 వేలను డిపాజిట్‌గా చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 చెల్లించాలి. ఎస్సీఎస్టీ అభ్యర్థులు వారి కులధ్రువీకరణ పత్రాలను నామినేషన్‌తోపాటే సమర్పించాలి. అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకోసం నామినేషన్ దాఖలు చేయడానికి రెండు రోజులకు ముందే బ్యాంక్ ఖాతాను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి అభ్యర్థికి ఆయా నియోజకవర్గాలకు చెందిన పది మంది ఓటర్లు ప్రతిపాదన చేస్తూ సంతకాలు చేయాలి. అభ్యర్థులు ఇతర నియోజకవర్గాలకు చెందినవారైతే వారి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి నుంచి ధృవీకరణ పత్రాన్ని తీసుకురావాలి. గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పార్టీ గుర్తులు పొందటానికి అనువుగా పార్టీ అధిష్ఠానం నుంచి ఏ, బి ఫారాలు సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు నామినేషన్లతోపాటు తమ ఆస్తుల వివరాలను కూడా జత చేయాల్సి ఉంటుంది. ఇదిలావుంటే లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం అదనంగా 176 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు పేర్కొన్నారు. ఒక్కో జిల్లాలో ఆహార పదార్థాల ధరలు సమానంగా లేని కారణంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం నిర్ణయించిన ధర పట్టికను మళ్లీ పరిశీలించాల్సిందిగా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి 25వ తేది వరకు 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించేలా ఫారాలు అందిస్తామని తెలిపారు. ఎండీఎంకే, నామ్ తమిళర్ పార్టీలకు ఎన్నికల గుర్తు కేటాయించడంపై కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. బుధవారం నుంచి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఈవీఎం, వీవీపాట్ ఇతర ఎన్నికల సామగ్రి విభజన పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగుల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు సుమారు 4 లక్షల మంది పాల్గొంటారని సత్యప్రదసాహు తెలిపారు.

# కొనసాగిన ప్రణీత్ రావు విచారణ

## పలు విషయాల్లో కూపీ లాగిన దర్యాప్తు బృందం

**హైదరాబాద్,మార్చి20(జనంసాక్షి):**మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నాలుగో రోజు బుధవారం కూడా విచారణ కొనసాగింది. విచారణలో భాగంగా ప్రణీత్ రావు నుంచి దర్యాప్తు బృందం కీలక విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది ఈ క్రమంలో ప్రణీత్ రావు మరికొందరు అధికారుల పేర్లను వెల్లడించి నట్లు తెలుస్తోంది. దీంతో.. ఆ అధికారులకు నోటీసులు ఇచ్చి, వారిని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇక విచారణలో ప్రణీత్ రావు..ఫోన్ ట్యాపింగ్ కోసం విదేశాల నుంచి ప్రత్యేక సాఫ్ట్ వేర్, పరికరాలు తీసుకువచ్చి వాడినట్టు ఒప్పుకన్నారు. అయితే టెలిఫోన్ సర్వీసులకు సంబంధం లేకుండా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డట్టు గుర్తించారు. అందుకోసం విదేశాల నుంచి ప్రత్యేక సాఫ్ట్ వేర్ తెప్పించింది ఎవరు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కానీ ప్రణీత్ రావు మాత్రం విచారణ ఈ ఫోన్ ట్యాపింగ్ అధికారుల ఆదేశాల మేరకు చేశానని చెబుతుండటం గమనార్హం. దీంతో ఈ కేసులో మరొకందరిక నోటీసులు, కీలక అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ట్యాపింగ్ కేసు నిందితుడు ప్రణీత్‌రావు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ విచారణ జరగనుంది. కస్టడీ విషయంలో సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ పాటించడం లేదని.. కస్టడీ ముగిసిన వెంటనే జైలుకు తరలించేలా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు.



# నూతన గవర్నర్‌గా రాధాకృష్ణన్ బాధ్యతలు

ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. 1957 మే 4న జన్మించిన సీపీ రాధాకృష్ణన్.. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు సార్లు భాజపా తరుపున ఎంపీగా ఎన్నికయ్యారు. తమిళనాడు భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగానూ పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డ్ ఛైర్మన్‌గా సేవలందించారు. తమిళనాడు భాజపా సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి ఝార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు చోట్లా పూర్తిస్థాయి గవర్నర్లను నియమించేంత వరకూ సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు నిర్వర్తిస్తారని రాష్ట్రపతి కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకు తెలంగాణ గవర్నర్లుగా పనిచేసిన ఈఎస్ఎల్ నరసింహన్, తమిళిసై సౌందరరాజన్‌తోపాటు ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన సీపీ రాధాకృష్ణన్.. ముగ్గురూ తమిళనాడు వారే కావడం గమనార్హం.

# కేజ్రీవాల్ పిటిషన్‌పై విచారణ ఎప్రిల్ 22కు వాయిదా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లను సవాల్ చేస్తూ.. ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలంటూ రెండు వారాల గడువును ఈడీకి ఇచ్చింది. తదుపరి విచారణ ఏప్రిల్ 22వ తేదీన ఉంటుందని తెలిపింది. లిక్కర్ కేసులో తొలి నుంచి ఈడీ సమన్లను కేజ్రీవాల్ పట్టించుకోవడం లేదు. ఈలోపు ఈడీ కోర్టును ఆశ్రయించగా.. ఆయన బెయిల్ తెచ్చుకున్నారు. ఈలోపు మార్చి 21న తమ ముందు హాజరుకావాలంటూ ఈడీ నోటీసులు ఇచ్చింది. దీంతో ఈడీ నుంచి తొమ్మిదిసార్లు కేజ్రీవాల్‌కు సమన్లు జారీ అయిన్లటైంది. అయితే.. ఈ సమన్లపై ఢిల్లీ సీఎం హైకోర్టును ఆశ్రయించారు. ఈడీ సమన్లు ??చట్టవిరుద్ధమైనవని, రాజ్యాంగ విరుద్ధమని, నిబంధనలను ఉల్లంఘిస్తూ జారీ చేశారని కేజ్రీవాల్తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కేజ్రీవాల్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు జస్టిస్ సురేశ్ కైత్, మనోజ్ జైన్‌లతో కూడిన ధర్మాసనం.. చివరకు ఈడీని వివరణ కోరుతూ విచారణ వాయిదా వేసింది. అంతకుముందు లిక్కర్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ ఈడీ సమన్లు జారీ చేయగా.. విచారణకు హాజరు కాకపోవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఢిల్లీ రోస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అరవింద్ కేజ్రీవాల్ కోర్టుకు హాజరయ్యేలా చూడాలని కోరాంు. దీంతో రౌస్ అవెన్యూ కోర్టుకు హాజరైన కేజ్రీవాల్ బెయిల్ పొందారు. రూ.15వే వ్యక్తిగత బాండ్‌తో పాటు రూ.లక్ష సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అయినప్పటికీ ఈడీ మరోసారి సమన్లు జారీ చేయడం గమనార్హం.

# వచ్చే ఐదేళ్ల లక్ష్యాలపై దృష్టిసారించండి

## వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ కల్పన, కార్మిక రంగంపై మరింత శ్రద్ధవహించండి.. మంత్రిత్వశాఖలను సూచించిన ప్రధాని మోదీ

**(జనంసాక్షి):**రానున్న ఐదేళ్లలో ఏటా వారి శాఖల్లో సాధించాలనుకొన్న లక్ష్యాలు ఏమిటో తెలియజేయాలని ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రులను కోరినట్లు తెలుస్తోంది.దీనికి సంబంధించిన ప్రభుత్వ పత్రం ఒకటి ఆంగ్ల వార్తా సంస్థ చేతికి అందింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ప్రభుత్వంలోని కీలక అధికారులకు ప్రధాని సూచనలు చేస్తూ దీనిని పంపారు.భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి అనుగుణంగా రానున్న ఐదేళ్ల కార్యాచరణను తెలియజేయాలని అన్ని ప్రభుత్వ శాఖలను కోరుతూ మార్చి 11న ప్రధాని కార్యాలయం ఓ పత్రాన్ని పంపింది. వారిచ్చే సమాచారం ఆధారంగా కొత్త ప్రభుత్వం తదుపరి 100 రోజుల ప్రణాళిక ఉంటుందని అందులో పేర్కొన్నారు. వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ కల్పన, కార్మిక రంగంపై మరింత దృష్టిపెట్టాలని అందులో సూచించారు. ముఖ్యంగా ఎన్నికల షెడ్యూల్ విడుదలై కొత్త ప్రభుత్వం ఏర్పడేలోపు కాలాన్ని సద్వినియోగం చేసుకొని ఈ ప్లాన్లు సిద్ధం చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది. అంతేకాదు ఇందుకు అవసరమైన వివిధ పారిశ్రామిక వర్గాలను కూడా కలుసుకోవాలని సూచించారు. నూరుశాతం పిల్లలు పాఠశాలలకు వెళ్లడం, టీకాలు వేయించుకోవడం వంటి అంశాలను కూడా అందులో ప్రస్తావించారు.గత అక్టోబర్‌లో అధికారులకు వెళ్లిన పత్రంలో కూడా పలు అంశాలను ప్రస్తావించారు. గ్రామీణప్రాంతాల్లో ఆర్థిక వృద్ధి కోసం కోల్డ్ చైన్ లాజిస్టిక్ వ్యవస్థలు, ఆర్గానిక్ వ్యవసాయానికి అవసరమైన వసతుల కల్పన, 2030 నాటికి సమష్టి వ్యవసాయం పెంచడంపై ప్రణాళికలు సిద్ధం చేసిందని సదరు ఆంగ్లవార్తా సంస్థ పేర్కొంది.

# వైద్యఆరోగ్యశాఖలో కొలువుల జాతర

సంబంధించిన వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి తీసుకోవాలని చెప్పారు. ఆయా వివరాల ఆధారంగా నోటిఫికేషన్ ఇచ్చి నేరుగా ఖాళీలను భర్తీ చేయాలని తెలిపారు.

# తెలంగాణలో మరోసారి ఏన్డీఎస్‌ఏ కమిటీ పర్యటన

ప్లానింగ్, నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ తదితర వివరాలు తీసుకొంది. గత పర్యటనకు కొనసాగింపుగా ఇవాళ్టి నుంచి మూడు రోజుల పాటు పర్యటించనుంది. ఈఎన్సీ జనరల్, హైడ్రాలజీ, సెంట్రల్ డిజైన్స్ విభాగాలతో సమావేశం కానుంది. ఇంజినీర్లతో విడివిడిగా భేటీ కానున్న కమిటీ.. పదవీ విరమణ చేసిన, బదిలీ అయిన వారినీ హాజరు కావాలని పేర్కొంది.

# రైతులంటే ఎందుకంత చిన్నచూపు?

తీరిక లేదా? హైకమాండ్ చుట్టూ చక్కర్లు కొడుతున్న మీకు.. రైతుల సమస్యలు వినే ఓపిక లేదా? ఇంతకాలం పచ్చని పైర్లు ఎండుతున్నా.. సాగునీరు ఇవ్వడం చేతకాలేదు. ఇప్పుడు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలన్న మనసు రావడం లేదా? అన్నదాతలకు జరుగుతున్న అన్యాయంపై భారాస పోరాడుతూనే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# తొలివిడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

నాలుగు స్థానాలు, పశ్చిమబెంగాల్‌లోని మూడు స్థానాలు, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయల్లోని రెండేసి స్థానాలు, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్ దీవులు, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లోని ఒక్కో స్థానం ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్, జూన్ 1న తుది విడత పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి.




# ఓంటరిగానే బరిలోకి సీపీఎం

## - భువనగిరి ఎంపీ అభ్యర్థి ప్రకటన

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేయాలని సీపీఎం పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు భువనగిరి ఎంపీ అభ్యర్థిగా జహంగీర్ పేరును ఆ పార్టీ ప్రకటించింది. మిగిలిన 16 స్థానాలకు త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తామని ఆ పార్టీ తెలిపింది. దీంతో ఆశావహులు టికెట్ల కోసం పార్టీ పెద్దలను ఆశ్రయిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ సిపిఎం ఒంటరిగానే పోటీ చేసింది. ఖమ్మంలో పోటీ చేసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిపాజిట్ కోల్పోయారు. సిపిఐ మాత్రం కొత్తగూడెంలో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా నిలబడి గెల్చింది. తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలకు మే 13న ఎన్నికలను నిర్వహించనున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను వెల్లడించనున్నారు. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు.

# పాలిసెట్ వాయిదా

## - మే24కు రీషెడ్యూల్



**హైదరాబాద్(జనంసాక్షి):**సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ను వాయిదా వేస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ పేర్కొంది. షెడ్యూల్ ప్రకారం మే 17న పాలిసెట్ నిర్వహించాల్సి ఉన్నది. ఎంట్రెన్స్ టెస్ట్‌ను మే 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, శిక్షణ మండలి కార్యదర్శి ఏ పుల్లయ్య తెలిపారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో నిర్వహించనున్న విషయం తెలిసిందే. తెలంగాణలో నాలుగో విడుతలో ఎన్నికలు జరుగనున్నాయి. నాలుగో విడుతలో మే 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా.. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగనున్నది. 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చింది.

# నా ఫోన్‌కాల్ రికార్డు చేశారు

వోపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌తో కరవు వచ్చిందంటూ ప్రతిపక్ష నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. పంట నష్టంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు.

# ఎన్నికల కమిషనర్ల నియామకం సబబే..

## సమర్థించుకున్న కేంద్రం

## కావాలనే వివాదం సృష్టిస్తున్నారని ధ్వజం





**దిల్లీ(జనంసాక్షి):**పదవీ విరమణ చేసిన మాజీ ఉన్నతాధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధు కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా ఎంపికయిన సంగతి తెలిసిందే. వీరి నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంది. ఈ అంశంపై పిటీషనర్లు కావాలనే వివాదం సృష్టిస్తున్నారని విమర్శించింది. ఈమేరకు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ ఇద్దరు మాజీ ఐఏఎస్‌ల పేర్లకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. దీనికి ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్‌చౌధరి సభ్యులుగా ఉన్న కమిటీ సమావేశమైంది. అనంతరం ఇద్దరు కొత్త కమిషనర్ల నియామకంపై కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ ఈనెల 8న రాజీనామా చేయడం, మరో కమిషనర్ అనూప్‌చంద్ర పాండే కాలపరిమితి ఫిబ్రవరి 14న ముగియడంతో ఎన్నికల సంఘంలో ఏర్పడిన రెండు ఖాళీలను కేంద్ర ప్రభుత్వం వీరిద్దరితో భర్తీ చేసింది.ఎన్నికల సంఘం(ఈసీ)లో ఖాళీ అయిన రెండు కమిషనర్ పోస్టుల భర్తీ ఎంపిక కమిటీలో సీజేఐను మినహాయించడాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పిటీషన్లు దాఖలయ్యాయి. కొత్త కమిషనర్ల నియామకాన్ని 'ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం-2023' ప్రకారం చేపట్టకుండా కేంద్రాన్ని అడ్డుకోవాలని పిటీషనర్లు కోరారు. అయితే వారి నియామకాన్ని తాత్కాలికంగా నిలిపేసేందుకు ఇటీవల సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈక్రమంలోనే పిటీషనర్లను ఉద్దేశించి కేంద్రం స్పందించింది. ఆ ఇద్దరు కమిషనర్ల యోగ్యత, అర్హతపై ఎలాంటి అభ్యంతరం వ్యక్తం కాలేదని ఈసందర్భంగా ప్రస్తావించింది. ఎలాంటి ఆధారాలు లేని ప్రకటనల ద్వారా వివాదం సృష్టించాలని చూస్తున్నారని విమర్శించింది. తమ అభ్యంతరాలను సమర్పించడంలో వారు విఫలమయ్యారని వెల్లడించింది. దీని ఆధారంగా వాటిని కొట్టివేయాలని కోర్టును కోరింది. ఈ అంశంపై గురువారం(మార్చి 21)న విచారణ జరగనుంది.

# మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మనదే

అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు రోడ్‌మ్యాప్ రూపొందించాం. దేశ యువత స్టార్టప్‌ల ద్వారా వినూత్న ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలు చేపట్టి పెట్టుబడులను ఆకర్షించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగారు. దేశంలో 45 శాతం స్టార్టప్‌లను నడిపిస్తున్నది మహిళలే. మధ్యంతర బడ్జెట్‌లో పరిశోధనలు, ఆవిష్కరణల కోసం రూ.లక్ష కోటి బడ్జెట్ కేటాయించడం స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని ప్రధాని తెలిపారు.ఈ సందర్భంగా ప్రధాని రాజకీయాల్లో స్టార్టప్‌లపై ఛలోక్తులు విసిరారు. "చాలా మంది స్టార్టప్‌లను ప్రారంభిస్తారు. రాజకీయాల్లో ఇవి ఎక్కువ. ప్రతిసారీ కొత్త స్టార్టప్‌లు ప్రారంభించాల్సిందే. కానీ, మీ స్టార్టప్‌లకు రాజకీయాల్లో వాటికి చాలా వ్యత్యాసం ఉంది. మీరు ప్రయోగాత్మకంగా వ్యవహరిస్తారు. ఒక ఆలోచన కార్యరూపం దాల్చకుంటే మరో ఐడియాతో ముందుకు సాగుతారు" అని మోదీ పేర్కొన్నారు.

# చీలికలకు మేం కారణం కాదు:అమిత్ షా



**దిల్లీ(జనంసాక్షి):** శివసేన, ఎన్సీపీ పార్టీల్లో చీలికలకు తాము కారణం కాదని భాజపా అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రైజింగ్ భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'పార్టీలను చీలుస్తున్నారని మాపై ఆరోపణలు చేసేవారు ఒక విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఉద్ధవ్ ఠాక్రే కు ఉన్న 'పుత్ర ప్రేమ్'(కుమారుడిపై ప్రేమ).. శివసేన రెండు వర్గాలుగా విడిపోవడానికి కారణమైంది. ఏక్‌నాథ్ శిండే అర్హతకు తగ్గట్టుగా బాధ్యతలు ఇచ్చి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేదే కాదు. ఇక ఎన్సీపీ విషయానికి వస్తే.. శరద్ పవార్'పుత్రి ప్రేమ్'(కూతురిపై ప్రేమ) దానిని చీల్చింది. అజిత్ పవార్‌కు సముచిత గౌరవం దక్కితే.. ఆయన బయటకు వచ్చేవారే కాదు' అని అమిత్ షా విశ్లేషించారు.2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో కలిసి శివసేన, ఎన్సీపీ (ఎంవీఏ) మహారాష్ట్రలో అధికారంలోకి వచ్చాయి. ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి అయ్యారు. అయితే 2022లో ఏక్‌నాథ్ శిండే మెజార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో బయటకు వెళ్లి, భాజపాతో చేతులు కలిపారు. దాంతో సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయింది. భాజపా, శివసేన(శిండే వర్గం) ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి. గత ఏడాది అజిత్ పవార్ కూడా ఎన్సీపీని చీల్చి.. తన మద్దతుదారులతో కలిసి భాజపా ప్రభుత్వంతో చేతులు కలిపారు. ఇదిలాఉంటే.. తమ కూటమి మహారాష్ట్రలో 40కు పైగా లోక్‌సభ స్థానాలను గెలుచుకుంటుందని సీట్ల సర్దుబాటు సందర్భంగా అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు.

# లిక్కర్ స్కామ్‌లో బోయినపల్లి అభిషేక్‌కు ఊరట

## మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా ఉన్న బోయినపల్లి అభిషేక్ రావుకు స్వల్ప ఊరట లభించింది. సుప్రీం కోర్టు బుధవారం అభిషేక్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అభిషేక్ భార్య అనారోగ్యంతో ఉందన్న కారణంగా ఐదు వారాల బెయిల్‌ను మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చింది. అభిషేక్‌ను హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతించిన సుప్రీం కోర్టు.. పాస్‌పోర్టును సరెండర్ చేయాలని.. ఆయన ఫోన్ నెంబర్ ఈడీ అధికారులకు ఇవ్వాలని, అలాగే ఆయన భార్యకు హైదరాబాద్‌లోనే చికిత్స అందించాలని షరతులు విధించింది. అలాగే మిగిలిన బెయిల్ నిబంధనలను ట్రయల్ కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంటుందని తెలిపింది. ఈ సందర్భంగా.. ట్రయల్ కోర్టు విచారణపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈడీ కేసుల్లో ట్రయల్స్ జాప్యంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్రయల్స్ జాప్యం జరిగితే నిందితులు నెలల తరబడి జైల్లోనే ఉండాల్సి వస్తుంది కదా? అని ప్రశ్నించింది. అనంతరం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది. లిక్కర్ స్కామ్‌లో 2022 అక్టోబర్‌లో అభిషేక్‌ను సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# మరో రెండురోజులు చల్లటి వాతావరణం

**హైదరాబాద్,మార్చి20(జనంసాక్షి):**మండుతున్న ఎండలకు జనం అల్లాడుతున్న తరుణంలో చల్లగాలులు, చిరుజల్లులు తెలుగు రాష్ట్రాల ప్రజలను పులకరించేలా చేశాయి. ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులకు ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందారు. మూడురోజులుగా వాతావరణం మొత్తం చల్లబడగా... మరోరెండురోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణశాఖ తెలిపింది. జార్ఖండ్ నుంచి కోస్తా ఒడిస్సా మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు సైతం కురవనున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని..ఉరుములతో కూడిన వర్షం పడేపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కులీలు, పశు-గొర్రెల కాపరులు చెట్ల క్రింద , బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని..సురక్షితమైన ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించింది. జార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు ఉన్న ద్రోణి బలహీన పడింది.

# ప్రాజెక్టు గేట్లు ఎత్తండి

## రాజకీయ గేట్లు కాదు

- రైతులు నష్టపోతుంటే వలసలను ప్రోత్సహిస్తారా?
- రేవంత్ సర్కారుది మోసం, వంచన
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) : ప్రాజెక్టుల గేట్లు ఎత్తి రైతుల పంటలను కాపాడాలని తాము అడుగుతుంటే రాజకీయ గేట్లు ఎత్తి వలసలను ప్రోత్సహిస్తారా? అంటూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు.

వడగండ్లవాన, అకాల వర్షాలతో పంటలు పోయి రైతులు బాధలో ఉంటే ఒక్క మంత్రి వారికి భరోసా ఇవ్వడం లేదన్నారు. గత ఏడాది అకాల వర్షాల నేపథ్యంలో పంటలు దెబ్బతింటే వికారాబాద్, వరంగల్ జిల్లాలో పంటలు దెబ్బతింటే తాను, కేసీఆర్ పర్యటించి ధైర్యం కల్పించామని, ఇప్పుడు కాంగ్రెస్ నిర్లక్ష్యంతో పంటలు ఎండిన రైతులు, అకాల వర్షాలు, వడగండ్ల వానలతో పంట నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రైతులకు ప్రతి ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే జీఓను విడుదల చేయాలన్నారు. అదిలాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలలో వేలాది ఎకరాల్లో పంటలు అకాల వర్షాలకు దెబ్బతిన్నాయని తెలిపారు. వంద రోజుల్లో వ్యవసాయాన్ని అతలాకుతలం చేశారన్నారు. జలాశయాల్లో ఉన్న నీళ్లను అంచనా వేసి రైతుల పంటల సాగుకు సూచన చేయమంటే ఒక్కనాడు ప్రభుత్వం సమీక్ష చేయలేదన్నారు. రైతులకు నీళ్లు ఇచ్చి గతంలో ఏమన్నా తప్పులు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోండని సూచించారు. జిల్లాలలో గంగమ్మ కోసం రైతుల గోస, పంట కాపాడుకునేందుకు రైతుల గోస, పంటను పశువులకు వదిలేసిన రైతులు అన్న వార్తలు వస్తున్నాయని, వారిని ఆదుకోవాలని కోరారు. నిరుద్యోగులకు అరచేతిలో స్వర్గం చూపి ఇప్పుడు మొండి చేయి చూయిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ సర్కారు ఇచ్చిన 30 వేల ఉద్యోగాలను ఒక్క నోటిఫికేషన్ వేయకుండా తామిచ్చామని చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, డీఎఓ, ఎస్ డబ్లూఓ , డీఎస్సీలో 5 వేల ఉద్యోగాల నోటిఫికేషన్లు గత ప్రభుత్వంలో శ్రీకారం చుట్టినవేనన్నారు. గత ఏడాది 5 వేల టీచర్ పోస్టులు ప్రకటిస్తే 21 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ అన్నారని, మరి 11 వేల ఉద్యోగాలనే ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు. అబద్దాలతో యువతను మోసం చేశా రని, నిజం చెప్పడానికి ధైర్యం ఉండాలని అన్నారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో యువతను మళ్లీ మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, రెండు లక్షల ఉద్యోగాలలో కేసీఆర్ ప్రభుత్వం లక్ష 60 వేల ఉద్యోగాలు ఇచ్చింది .. మిగిలిన 40 వేలు వివిధ స్థాయిల్లో ఉన్నాయని తెలిపారు. అందులో ఉన్నవి 30 వేల ఉద్యోగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నియామకాలు ఇచ్చింది యువత దీనిని గుర్తించాలని తెలిపారు.

## జహీరుద్దీన్ అలీఖాన్ స్మారక పురస్కారాలు

# జర్నలిస్టులకు స్ఫూర్తి

- తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం నేతల చొరవ భేష్
- పోస్టర్ ఆవిష్కరించిన ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి





హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) : జర్నలిస్టులను ప్రోత్సహించేందుకు ప్రముఖ పాత్రికేయుడు జహీరుద్దీన్ అలీఖాన్ స్మారక పురస్కారాలు అందించడం అభినందనీయమని ప్రభుత్వ ప్రధాన సలహాదారులు (సీఎం ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం (టీయూజేఎస్) ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన జహీరుద్దీన్ అలీఖాన్ స్మారక రాష్ట్రస్థాయి పురస్కారం 2023-24 పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవీయ కథనాలకు బహుమతులు అందించాలనే ఆలోచన చాలా గొప్పదని, దీనివల్ల జర్నలిస్టుల సృజనాత్మకత కూడా వెలుగులోకి వస్తుందని చెప్పారు. మొదటి, రెండవ, మూడో బహుమతులకు భారీ నగదు ప్రోత్సాహకం ప్రకటించడం ఇతర జర్నలిస్టులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఓ మహనీయుడి పేరిట రాష్ట్రస్థాయి పురస్కారం ఇవ్వడం ప్రతి ఒక్కరూ స్వాగతించదగ్గ పరిణామమన్నారు. టీయూజేఎస్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు మేలు చేసే ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో టీయూజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎం రహమాన్, ప్రధాన కార్యదర్శి టి.రమేష్ బాబు, ఉపాధ్యక్షుడు పసునూరి రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ అబీద్ హుస్సేన్ (అబ్బాస్), జర్నలిస్ట్ ఆర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజుకు రాజ్యసభ ఛైర్మన్ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ, మార్చి 20 (జనంసాక్షి) :** రాజ్యసభకు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రకు ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధనఖర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ్యులు మీ సేవల పట్ల మరింత నమ్మకం కలిగి, విశ్వాసం వ్యక్తం చేస్తూ రాజ్యసభకు తిరిగి ఎన్నుకున్నారని తన సందేశంలో ఛైర్మన్ పేర్కొన్నారు. రాజ్యసభకు తిరిగి ఎన్నికైన తర్వాత ఎంపీ రవిచంద్ర ఛైర్మన్ ధనఖర్ ను బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవిచంద్రతో ఛైర్మన్ మాట్లాడుతూ "ఈ ప్రజాస్వామ్య దేవాలయం(పార్లమెంట్)లో అర్థవంతమైన, ఆరోగ్యకరమైన చర్చలు జరిపేందుకు నీ అనుభవం చాలా అవసరం" అని పేర్కొన్నారు. "నీ సమయస్ఫూర్తి, విషయ పరిజ్ఞానం, సమర్థత, వ్యక్తీకరణ పార్లమెంట్ ఔన్నత్యాన్ని మరింత పెంచగలవు" అంటూ నీతో కలిసి పని చేయడానికి తాను ఎదురుచూస్తున్నానని వద్దిరాజుతో ఛైర్మన్ ధనఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర తనకు శుభాకాంక్షలు తెలిపిన ఛైర్మన్ జగదీప్ ధనఖర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు, ధన్యవాదాలు చెప్పారు.

# 300 కోట్ల నిధులు తెచ్చా

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావ్

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)



మంచిర్యాల శాసనసభ సభ్యునిగా ఎన్నికైన వంద రోజుల్లోనే నియోజకవర్గం అభివృద్ధి కోసం సుమారు మూడు వందల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు వెల్లడించారు. బుధవారం తన నివాస గృహంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కేవలం వంద రోజుల్లోనే భారీగా నిధులు మంజూరు చేయించానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో మిగతా నిధులు నిలిచిపోయాయని అన్నారు. మంచిర్యాల నియోజకవర్గములో సాగునీరు, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాటశాలలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశం సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని చెప్పారు. పాటశాలల్లో తాగునీరు, మరిగుదొడ్ల నిర్మాణం ప్రహరిగొడ నిర్మాణం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు పెద్ద మొత్తంలో నిధులు తీసుకువచ్చానని తెలిపారు. అలాగే పాటశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు మహిళా సంఘాలకు పాటశాల యాజమాన్య బాధ్యతలు అప్పగించడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మంచిర్యాలలో అదనంగా రెండు రైలువే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గోదావరి పై వంతెన నిర్మాణం ఖచ్చితంగా జరుగుతుందని అయితే అది ముల్కల్ల ప్రాంతంలో నిర్మించే యోచనలో ఉన్నట్లు చెప్పారు. కాలేజ్ రోడ్ నుంచి అంతర్గాము వరకు బ్రిడ్జి నిర్మాణం కేవలం మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు కోసమేనని నేను స్వార్థంతో కాకుండా ప్రజల సుదీర్ఘ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. మంచిర్యాల లో తాగునీరు సమస్య భవిష్యత్తులో ఉండబోదని ఆయన ధీమా వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఓర్వలేని దివాకర్ రావు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టడం శోచనీయమన్నారు. ఆటో డ్రైవర్లకు తాను సొంతంగా జీవిత భీమా చేయించానని గుర్తు చేశారు. కాళేశ్వరం వల్ల మంచిర్యాల వరద ముంపుకు గురైతే కనీస సాయంగా పదివేలు కూడా ఇప్పించలేదని దివాకర్ రావుపై విమర్శలు చేసారు. తాను ఎమ్మెల్యే కాగానే కరకట్ట నిర్మాణంకు 270 కోట్లు మంజూరు చేయించానని వెల్లడించారు. అలాగే ఐబీ స్థలంలో ఎన్నికల కోడ్ ముగియగానే మాతా, శిశు ఆసుపత్రి నిర్మాణం పనులు ఆరంభమవుతాయని అన్నారు. దశాబ్దాలు గా పట్టిపీడిస్తున్న డంప్ యార్డు సమస్య పరిష్కారం చూపానని సింగరేణి స్థలంలో డంప్ యార్డు ఏర్పాటు చేశామని తెలిపారు. సింగరేణి కార్మికులకు గత ప్రభుత్వం జారీ చేసిన ఇండ్ల పట్టాలను రద్దు చేసి స్థలంపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇస్తానని స్పష్టం చేశారు. తపాలపూర్ నుంచి లక్షెట్టిపేట చౌరస్తా వరకు నాలుగు లయిండ్ల రోడ్ మంజూరైందన్నారు. తరుగు పేరుతో రైతుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసిన సొమ్ము ఎవరి జేబులోకి వెళ్ళాయో ఎంపీ ఎన్నికల తర్వాత ప్రతి పైసా కక్కిస్తానని అన్నారు. అభివృద్ధి విషయంలో తాను రాజీపడపోనని తేల్చి చెప్పారు. చిత్తశుద్ధి ప్రజలకు మేలు చేయాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యమేనని ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఈసమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ , నాయకులు, నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ దినపత్రిక ప్రారంభోత్సవం

- పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) : ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని సాగర్‌రోడ్డు, తుర్కయంజాల్, రాగన్నగూడ నందు నూతనంగా ఏర్పాటు చేసిన క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ దినపత్రిక నూతన కార్యాలయం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ,ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి , దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలసి ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు,నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్త, యజమాని ఎన్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో 'ఉప్పల'

హైదరాబాద్‌లోని నాగోల్, పాత శివాలయం మమతా నగర్ బసవేశ్వర్ కాలనీలో శ్రీశ్రీశైల మల్లికార్జున సమాజోత్తాన ఫౌండేషన్ ట్రస్ట్-నాగోల్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ భ్రమరాంబా సమేత శ్రీ మల్లికార్జున స్వామి (మరకత లింగం) శ్రీ ఆది జగద్గురు పండితారాధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ట, శ్రీ మహాత్మా బసవేశ్వర అక్క మహాదేవి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామిజీలు ఉజ్జయిని జగద్గురు, శ్రీశైలం జగద్గురు కాశి జగద్గురు లు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు టెట్ అర్హత పరీక్షపై టి-సాట్ ప్రత్యేక లైవ్

- టి-సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి)** : తెలంగాణ ప్రభుత్వం నిర్వహించబోయే టెట్ (టీచర్స్ ఎలిజబిలిటి టెస్ట్) పరీక్షపై అవగాహన కల్పించేందుకు టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఈ నెల 21వ తేదీ గురువారం మధ్యాహ్నం మూడు గంటల నుండి నాలుగు గంటల వరకు టి-సాట్ నిపుణ ఛానల్ లో ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనుభవం కలిగిన ఫ్యాకల్టీచే నిర్వహించే లైవ్ కార్యక్రమాల్లో మొదటి రోజు కెమిస్ట్రీ సబ్జెక్ట్ పై అవగాహన కార్యక్రమం ఉంటుందని సీఈవో స్పష్టం చేశారు. పది రోజుల పాటు పది సబ్జెక్టులపై జరిగే ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాల్లో టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. లైవ్ ప్రసారాలతో పాటు రికార్డింగ్ పాఠ్యాంశాలు టి-సాట్ నిపుణ ఛానళ్లతో పాటు టి-సాట్ యాప్, యూట్యూబ్ లోనూ అందుబాటులో ఉంటాయని గుర్తుచేశారు. అభ్యర్థులు తమ తమ సందేహాలను తీర్చుకుంటూ సమాధానాలు పొందేందుకు 040 23540326,726 టోల్ ఫ్రీ 1800 425 4039 నెంబర్లకు కాల్ చేయాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు



**కరీంనగర్, మార్చి 20 (జనంసాక్షి)** : కరీంనగర్ జిల్లాలోవడగళ్ల వానల వల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున ఇచ్చి వెంటనే ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం( ఏఐకేఎస్ ) జిల్లా సహాయ కార్యదర్శిపైడిపల్లి రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా పైడిపల్లి రాజు మాట్లాడుతూ వేలాది ఎకరాల పంటలు నష్టపోయాయని వడగళ్ల వాన రైతన్నను తీవ్ర ఆందోళన గురి చేసిందని ఆయన అన్నారు. వరి. మామిడి, బత్తాయి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పంట చేతికి వచ్చిన రైతన్నకు వడగండ్ల వాన కడగండ్లు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాన బీభత్సం వల్ల పండ్లు ఎక్కడ పడితే అక్కడ పడి చేతికి వచ్చిన పంట పూర్తిగా నాశనం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. యాసంగిలో సాగుచేసిన జొన్న, మొక్కజొన్న నష్టం జరిగిందని ఇప్పటికే చేతికి వచ్చిన జొన్న, మొక్కజొన్న పంటల మార్పిడికి ఈ వర్షాలు ఇబ్బందికరంగా మారాయని ఆయన వాపోయారు. పంట నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు నష్ట అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించాలని పేర్కొన్నారు. ఈ సీజన్ లో రైతు బీమా పథకం లేకపోవడం వల్ల రైతన్నకు తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కరెంటు తీగలు పడి చాలా చోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడు తుందని విద్యుత్ అధికారులు త్వరిత గతిన పనులు పూర్తి చేయాల న్నారు. నష్టపోయిన ప్రతి ఎకరాకు 25 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించి రైతుల ను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) డిమాండ్ చేస్తుందని పైడిపల్లి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ ప్రతినిధి, మార్చి 20(జనం సాక్షి)** : సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న వేల నమోదైన ప్రతి ఓటరు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. బుధవారం వరంగల్ నగరంలోని ఫాదర్ కొలంబో మెడికల్ కళాశాలలో స్వీప్-2024 (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఓటరు చైతన్యం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఆయుధం అని, ఇప్పటికే ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, జనవరి 1, 2024 లోగా 18 సం.లు నిండిన వారు విధిగా ఎపిక్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు, మే 13వ తేదీన లోక్ సభ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం ఎన్నికల సందర్భంలో అవాం ఛనీయ ఘటనలకు పాల్పడితే సి-విజిల్ ఆప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని, ఎన్నికలు నిష్పక్షపాతంగా పారదర్శకంగా జరగడానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరం అని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యా ర్థుల చేత పెద్దఎత్తున మానవహారం, ఎన్ని కల ప్రతిజ్ఞ నిర్వహింపజేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్య లక్ష్మి, కళాశాల డైరెక్టర్ తరుణ్ రెడ్డి, ప్రిన్సిపల్ డా. సంధ్యారాణి మెడికల్ విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

## మెపా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా దండు చిరంజీవి ముదిరాజ్







**వరంగల్ ప్రతినిధి: మార్చి 20 (జనం సాక్షి) :** హైదరాబాద్ లో జరిగిన మెపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వరంగల్ జిల్లా తరఫున రాష్ట్ర కార్యదర్శిగా దండు చిరంజీవి ముదిరాజ్ ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రకటించారు. బుధవారం రాష్ట్ర అధ్యక్షులు దేవేందర్ ప్రకటించారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామానికి దండు చిరంజీవి ముదిరాజ్‌ను మెపా (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్రం) యూనియన్‌కు రాష్ట్ర కార్యదర్శి గా చిరంజీవి ఎన్నికైనట్లు ప్రకటించారు. గౌరవ అధ్యక్షులు జగన్ మోహన్ ముదిరాజ్ నియామక పత్రాన్ని చిరంజీవికి అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవికి ముదిరాజ్ పెద్దలు, ఆయన అభిమానులు కులాలకు,సంఘాలకు అతీతంగా శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ జాతి అభివృద్ధి ఐక్యత కోసం అందరినీ కలుపుకుని ముందుకు వెళతానని,రిజర్వేషన్ సాధన కోసం కలిసి కట్టుగా ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు కృషి చేస్తానని,అందుకోసం ఐక్య ఉద్యమాలు చేస్తాను అని అన్నారు. నాకు ఈ పదవి అప్పగించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెపా జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# జీవితమే ఓ మధురమైన కవిత్వం

*కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా, రొట్టె ముక్క అరటి తొక్క బల్ల చెక్కా, తలుపు గొళ్ళెం హారతి పళ్ళెం గుర్రపు కళ్ళెం, కాదేది కవిత కనర్హం! ఔనౌను శిల్ప మనర్ఘం. ఉండాలోయ్ కవితావేశం! కానీ వోయ్ రస నిర్దేశం! కళ్ళంటూ ఉంటే చూసి! వాక్కుంటే వ్రాసి! ప్రపంచం మొక పద్మవ్యూహం! కవిత్వమొక్క తీరని దాహం!! అన్నాడు శ్రీశ్రీ. కవిత మానవ భావోద్వేగాలను, ఆలోచనలను వ్యక్తీకరించే ఒక శక్తివంతమైన సాధనం. కవిత ద్వారా సామాజిక అవగాహన పెంపొందించవచ్చు, కవిత భాషా నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. కవిత సృజనాత్మకతను పెంపొందిస్తుంది. మానవ భావాలకు ఒక రూపం కవిత మన ఆలోచనలకు ఒక వ్యక్తి కరణ కవిత మన హృదయాలలోని అనుభూతులకు ఒక స్వర కల్పన కవిత్వం. ఈ అద్భుతమైన కలను జరుపుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మార్చి 21న కవితా దినోత్సవం జరుపుకుంటున్నాం.*




ఈ దినోత్సవం లక్ష్యం ప్రపంచవ్యాప్తంగా కవితా పఠనం, రచన, ప్రచురణలను ప్రోత్సహించడం. 1999 లో యునెస్కో 21వ శతాబ్దానికి ప్రపంచ కవితా దినోత్సవాన్ని ప్రారంభించింది. ఈ దినోత్సవం మొదటి వార్షికోత్సవం 2000 లో జరిగింది. ప్రపంచవ్యాప్తంగా 100కి పైగా దేశాలలో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, లైబ్రరీలు, సాంస్కృతిక కేంద్రాలలో కవితా పఠనం, చర్చలు, సదస్సులు నిర్వహిస్తారు. ప్రముఖ కవులకు అవార్డులు ప్రదానం చేస్తారు. కవితలను అనువదించడం, ప్రచురించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కవిత మానవ భావోద్వేగాలను, ఆలోచనలను వ్యక్తీకరించే ఒక శక్తివంతమైన సాధనం. కవిత ద్వారా సామాజిక అవగాహన పెంచవచ్చు. కవిత భాషా నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. కవిత సృజనాత్మకతను పెంపొందిస్తుంది. ప్రపంచ కవిత దినోత్సవం సందర్భంగా మనం కూడా కవితలు చదవడం, రాయడం ద్వారా ఈ దినోత్సవాన్ని జరుపుకుందాం. శ్రీ రామాయణం - వాల్మీకి. మహాభారతం - వ్యాసుడు. భాగవతం - పోతన. అభిజ్ఞాన శాకుంతలం - కాళిదాసు. గీతగోవిందం - జయదేవుడు. ప్రముఖ తెలుగు కవులు: శ్రీనాథుడు-సీస పద్యాలు, అన్నమయ్య, తాళ్ళపాక కవి-సంకీర్తనలు, చిలకమర్తి లక్ష్మీ నరసింహ -పారిజాత పహరణం, గురజాడ అప్పారావు-కన్యాశుల్కం, విశ్వనాథ సత్యనారాయణ-వేయి పడగలు, శ్రీరంగం శ్రీనివాసరావు-మహాప్రస్థానం, బాలగంగాధర్ తిలక్-అమృతం కురిసిన రాత్రి, గుంటూరు శేషేంద్ర శర్మ-నా దేశం- నా ప్రజలు, అలిశెట్టి ప్రభాకర్-రక్త రేఖ, కాళోజీ నారాయణరావు-నా గొడవ, దాశరది-అగ్ని ధార, సి నారాయణ రెడ్డి-విశ్వంభర. వంటి వారు అనేక సామాజిక సాంస్కృతిక రాజకీయ అంశాల మీద కవితలు రాస్తూ సమాజాన్ని మేలుకొలుపుతూ ఉన్న కవులను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది వారి రచనలు నవ సమాజ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. కవిత్వం ఒక సామాజిక శక్తి అది మనల్ని ఆలోచింపచేస్తుంది. ప్రశ్నించే ఎలా చేస్తుంది. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఒక కొత్త దృక్పథంలో చూపటానికి ప్రేరేపిస్తుంది. మనం కవిత్వాన్ని మరింత ప్రోత్సహించాలి భావితరాలకు ఈ అద్భుతమైన కలను అందించాలి. నాలో కదిలే నవ కవిత్వం కార్మిక లోకపు కళ్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి, సమర్పణంగా అంటారు ప్రతిజ్ఞలో శ్రీ శ్రీ. లక్షల చేతులు పండించే ధాన్యం ఒక లోగిట్లో పరుచుకుంటే, కోట్ల చెమట బొట్లు కురిసే మూల్యం, ఒక్క గుప్పెట్లో అణిగి ఉంటే, అచ్చమైన సౌజన్యం చచ్చు పీనుగుల పడి ఉంటుందా? అనే ప్రశ్నిస్తారు సీనారే. ఇలా పద్యమే పాట, పాటే జీవితం, జీవితమే ఒక మధురమైన కవిత్వం.

(నేడు ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా..)



**పూసపాటి వేదాద్రి**
కవి, సాహితీ విశ్లేషకులు
9912197694

# ఆదివాసీల బతుకుల్లో నిప్పులు!

*ఒక పర్యావరణ విధ్వంసం, మరో వైపు ఆదివాసీల జీవితాల్లో నిప్పులు పోయడమే అభివృద్ధి నమూనా అయిపోయింది. విచ్చలవిడిగా అడవుల నరికి వేత, గుట్టల కూల్చి వేత, ఎందుకోసం? మానవాళిని బక్షించే ఆ సంపద ను, మనుషులే బతికి లేకుంటే ఏం చేసుకుంటారు..దేశంలో ఖనిజ సంపద కోసం మనుషుల జీవితాల్లో నిప్పులు పోస్తున్నారు. అడవి లోని చెట్టు చేమ మీద ఆధారపడి జీవించే ఆదివాసీల కు బతుకు తెరువు లేకుండా చేస్తున్నారు. అడవుల యజమానులుగా అడవిపై హక్కుదారులుగా పిలువబడే అడవి బిడ్డలను ఆగం చేస్తున్నారు.*



దేశం లోని ఆదివాసీ ప్రాంతంలోని సంపదను ఒక వైపు లూటీ చేస్తూ పర్యావరణానికి పెద్ద ఎత్తున విఘాతం కలిగిస్తూ వరదలకు భీ భత్సానికి కారణం అవుతూనే విధ్వంసం సృష్టిస్తునే మరో వైపు రాజకీయంగా లబ్ది పొందుతున్నారు. ఆదివాసీ ప్రాంతాల ఏజెన్సీ ప్రాంతాల ప్రజల ఓట్ల కోసం పార్లమెంట్ అసెంబ్లీ సీట్లను నాయనా భయాన సామ దాన దండోపాయల అబద్ధపు అభివృద్ధి సంక్షేమం హామీలు ఇచ్చి సాధించు కోవడం కోసం పాలకులు బహురూపుల వేషాలు వేస్తూనే ఉన్నారు.

## ఆదివాసీల గుడాల్లో నేతల నాటకాలు!

ఆదివాసీ ప్రాంతాలకు మంత్రులు పీఎం..సీఎం..ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు పెట్టుబడి దారులు ఎవరు వెళ్లిన ఆ కొద్దీ సేపు ఆదివాసీల సంస్కృతి ని గౌరవిస్తున్నట్లు వారి బట్టలు వారి పూర్తి వేష ధారణతో కనిపిస్తారు..ఆదివాసీ డాన్స్ లు కూడా చేస్తారు వారు పెట్టె భోజనం తింటారు. వారి పిల్లల్ని ఎత్తు కుంటారు ముద్దాడుతారు. వృద్ధులను పలకరించి ఆలింగనాలూ చేసుకుంటారు. మంచి ఫోటోలు దిగి పేపర్లకు మీడియా కు ఇస్తారు. రోడ్ల కు ఇతర సంక్షేమ అభివృద్ధి పతకాల కు శంకుస్థాపన లు ప్రారంభోత్సవాలు చేస్తారు...ఈ నాటకాన్ని అప్పుడప్పుడు మనం లైవ్ లో టీవీ లలో చూస్తాం. ఈ డ్రామాలో...నాటకంలో పాల్గొన్న నేత రేంజ్ ను బట్టి పత్రికల్లో బ్యానర్లో లేదా లోపలి పేజీల్లో వార్తలు చూస్తూ ఉంటాం...నిజానికి ఇదంతా డ్రామా కాకుండా నిజం కావాలని ఆదివాసీల బతుకులు బాగు పడాలని పాలకులు ప్రజా ప్రతినిధులు మమేకం కావాలని ఆదివాసీ జీవితాలలో వెలుగు రావాలని అందరూ భావిస్తారు. కానీ ఇదంతా అబద్దం సంపద కోసం ఓటు బ్యాంకు కోసం తద్వారా అధికారం కోసం నేతలు ఆడే నాటకం గా తెలిసినప్పుడు ఆందోళన కలుగుతుంది. కలుషిత మనుషులు రాజకీయాల మీద వెగటు పుడుతుంది. 10 శాతం కూడా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆదివాసీల బతుకులు బాగు పడలేదు.. మారలేదు..మార్చడానికి పాలకులు ప్రయత్నాలు చేయలేదు. ఒక 28 కమిటీలు ఈ దశాబ్దాల కాలం మధ్యన మాత్రం స్టడీ కి వేశారు. కార్యాచరణ లేదు. .నిజానికి దేశంలోని అపారమైన ఖనిజ సంపద ఆదివాసీలు నివసించే అటవీ ప్రాంతంలో నే ఉంది.

## 92 శాతం సంపద అంతా ఆదివాసీల భూమిలోనే!

మన దేశంలోనే 92 శాతం ఖనిజ సంపద ఉంది. ఇప్పటికే కోట్ల చెట్లను లక్షల ఎకరాలలో నరికేసి ఆదివాసీల బతుకుల్లో నిప్పులు పోశారు. నార్త్ ఈస్ట్ ప్రాంతంలో వీరి పరిస్థితి అతి దయనీయంగా ఉంది. ప్రభుత్వ రేషన్ వీరికి అందడానికి కనీసం ఒక్క రేషన్ దుకాణం కనిపించదు..కాగితాలమీద ఆ దుకాణం ఉంటుంది. ఆదివాసీల నుంచి తీసుకున్న భూమి బదులు మరో చోట ఇస్తామన్న హామీ నెరవేరలేదు..నిబంధనల ప్రకారం ఆదివాసీ ప్రాంతంలో లభించే సంపదలో వాటా సంగతి అంతే..10 సంవత్సరాల కాలంలో 18 శాతం పేదరికం పెరిగిన భారత్ లో ..హాంగర్ ఇండెక్స్ లోని 116 దేశాల్లో మన స్థానం 101 ఉంది. దేశంలో 10 కోట్ల 44 లక్షలున్న ఆదివాసీల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఆకలి వారిలో ఎక్కువ ఉంది. వారి ఆకలిని పంచుకోడానికి సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప లాంటి వారు లేక చాలా చోట్ల ఆరోగ్యం క్షీణించు తున్నది..లక్షలాది గ్రామాలు ఖాళీ అయ్యాయి. సంపద కోసం ఖాళీ చేయిస్తున్నారు. రోజుకు లక్షమంది ఆదివాసీలు వలస వెళ్లి ఉపాధి కోసం వెతుక్కునే పరిస్థితి ఉంది. పోడు వ్యవసాయానికి అటవీశాఖ అడ్డుగోడ అయింది.

## తరిమి వేయబడుతున్న ఆదివాసీలు!

కోటి ఎకరాలకు పైగా అటవీ భూముల నుంచి ఆదివాసీలు తరిమి వేయబడిన పరిస్థితి ఉంది. వైద్యం విద్య కు దూరంగా ఉన్న పరిస్థితి ఉంది. ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య సౌకర్యం లేక రవాణా లేక వాగులు వంకలు దాటలేక వేలాది మంది ఊపిరి వదులుతున్న దాఖలాలు ఉన్నాయి. అడవి మీద ఆధార పడి జీవిస్తున్న అడవి బిడ్డలు 46 శాతం రక్త హీనతతో బాధపడుతున్నారు..పసి పిల్లలు గర్భిణీలు ఇందులో 66 శాతం ఉన్నారంటే పోషక పౌష్టిక ఆహారం వారికి ఎంత దూరంలో ఉందో తెలుస్తుంది. డీప్ ఫారెస్ట్ ఏరియా లో దేశంలో ఒక అంచనా ప్రకారం రానున్న 20 సంవత్సరాల లో 60 లక్షల కోట్ల రూపాయలు ఖనిజ సంపదను వెలికి తీయడం ద్వారా కార్పొరేట్లు సంపాదించ నున్నారు.

## 60 శాతం ఆదివాసీలు ఆగమాగం!

ఇదంతా మైనింగ్ ద్వారా ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న 60 శాతం ఆదివాసీలు బయటకు పంపి చేయనున్నారు. ప్రణాళికలు రూపొందించు కున్నారు..ప్రభుత్వానికి ఇందులో కొంత పన్నులు ఫీజుల ద్వారా అందుతుంది. ఎలక్షన్ ఫండ్..నజరణాలు..పార్టీ లకు మంత్రులకు ఎమ్మెల్యేలు ఎంపీలకు అందుతాయి...దీని వల్ల ఆదివాసుల జీవితాల గురించి..పర్యావరణ పరిరక్షణ గురించి వారికేమి అవసరం.....ప్రకృతి ఇన్ బ్యాలెన్స్ తో వరదలు తో వారికి పట్టి లేదు. పది రూపాయలు వారి జేబులోకి వస్తున్నాయి అంటే చాలు పర్యావరణం ఆదివాసీల బతుకులు పణంగా పెట్టేస్తారు..ఈ దేశం రాజనీతి అదే మరి...

## లక్షల కోట్ల ఆదాయం!

గడచిన పదేండ్ల లో పలు కంపనిలకు6 లక్షల 50 వేల కోట్లు ప్రయోజనం జరిగింది. బాక్స్వా జంగిల్ లో 2.5 లక్షల చెట్లు నరికేసి వజ్రాల అన్వేషణ మొదలు పెట్టారు. అటు హస్దేవ్ అడవులు బొగ్గు కోసం అదాని అండ్ కో నరికేస్తున్నారు. చెట్ల అమ్మకం బిజినెస్ ద్వారా దేశంలో 10 లక్షల కోట్ల రూపాయలు లాభం చేకూరుతుంది. బొగ్గు..బాక్సైట్ ..ల ద్వారా ఒక లక్ష 50 వేల నుంచి 2 లక్షల కోట్ల రూపాయల సంపాదన ప్రతి ఏడూ సాధిస్తున్నారు. అడవిలో బీడీ ఆకుల సీజన్లో ఒక్కొక్కరు రెండున్నర వేల ఆకులు సేకరిస్తే వారికి లభించేది రూపాయి,75 పైసలే ఇదీ ఆదివాసీల దుస్థితి ఉంది.

## కోల్ ఇండియా లోనూ అన్యాయమే!

కోల్ ఇండియా కూడా తమకు అన్యాయమే చేస్తుందని 70 శాతం బొగ్గు తవ్వకాలు ఉన్న ఆదివాసీల ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు..లక్షల కోట్లు సంపాదించి పెడుతున్న ఆదివాసీల జీవితాల బాగు కోసం గ్రాస్ రూట్ లెవల్ నుంచి కృషి జరగాలి..ఆ ప్రాంతాల్లోని 121 మంది ఎంపీలు 350 మందికి పైగా ఆయా రాష్ట్రాల్లో ఉన్న ఎమ్మెల్యేలు ఇందుకు పాటు పడాలి..కనీసం సాటి మనుషులుగా అయినా ఆదివాసీల పట్ల వారి జీవన పరిస్థితుల పట్ల శ్రద్ధ చూపాలి. వారి జీవితాలు మెరుగు కోసం చిత్త శుద్ధితో ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయాలి. వారి జీవితాల్లో వెలుగు తీసుకుని రావాలి. వారి ప్రాంతంలో లభిస్తున్న సంపదలో వారిని భాగస్వాములను చేయాలి. పర్యావరణ పరిరక్షణకు భంగం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు బుద్ధి జీవులు సిద్ధమై, పాలకుల కాలర్ పట్టే రోజు వస్తున్నది!



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

## రాలినపచ్చలు

రాలిపోయె
ఆకు అనుబంధం
చెట్టుకు మట్టికి
ఆరు ఋతువులకాలం
ఆకుపచ్చదనం పరుస్తుంది
చల్లని నీడనిస్తుంది
వాన నీటికి జాడ పరుస్తుంది
బతికేది కొన్నిమాసాలైన
మనిషి కి కావలసింది యిస్తుంది
ఆనందాల గలగల తో రాలి పోతుంది...
పుట్టుక నుండి
మట్టి లో కలిసె దాక
మనిషి తనకోసం
తనవాళ్ల కోసం
స్వచింతన స్వార్ధ చింతన
ఆకు లా ఆలోచించడు
ప్రకృతి లోని సేవా తత్పరత గ్రహించడు...
రాలిపోయె ఆకులోని మర్మజ్ఞానం
మనిషి చిత్తంలో చిగురిస్తే
విశ్వం సమైక్య విపంచి మీటుతుంది
మట్టి చెట్టు లోని లౌకిక జ్ఞానం
మనిషి మేధకు మేతకావాలి
రాలేకథల్లో పండిన సత్యాల
పచ్చలను దాచు కోవాలి

**రేడియమ్.**
9291527757

# మాకో 'గ్యారెంటీ'పై మాటిస్తరా?

*రూల్స్ అవే. చట్టాలు అవే. ప్రభుత్వాన్ని బట్టే వాటి ప్రభావం ఉంటుంది. పరిపాలకుడి మనసెరిగి ఉన్నతాధికారులు మసలుకుంటారు. తెలంగాణలో ఇప్పుడు అలానే ఉంది. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఏసీబీకి చేతి నిండా పని ఉంటోంది. రాజధాని సహా ఏదో మూలన రాష్ట్రంలో లంచాల ఉనికి నమోదు అవని వారం ఈ నూరు రోజుల్లో లేదు. విత్తు ముందా చెట్టు ముందా అనే వితండ వాదం అటుంచితే అవినీతి అధికారులు, ఉద్యోగులు కటకటాల వెనక్కు పోతున్న దృష్టాంతాలు బోలెడు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యీ అవగానే బెస్ట్ ఆఫీసర్ల కూర్పునకు ఆసక్తి చూపారు. తపన పడ్డారు. ఆపై ఎగ్జిక్యూటివ్ ఫిట్ నెస్ జట్టుతో మెచ్చుకోలు పొందారు. నో డౌట్. పాలన బాగుంటుంది. అనే ఫీల్ గుడ్‌తో నింపేశారు.*

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ కేసులో ఓ సీనియర్ ఐఏఎస్ గురించి కూడా సమాజం మాట్లాడుకుంది. టీ స్టాల్/కంటైనర్, పబ్లిసిటీ బోర్డు పెట్టుకున్నందుకు లంచంగా రూ.1.5 లక్షలు టౌన్ ప్లానింగ్ ఏసీపీ మధ్యవర్తి ద్వారా తీసుకొని నిజాంపేటలో దొరికిపోయాడు. అంతకుముందు హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ లోని ట్రైబల్ వెల్ఫేర్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసులో ఈఈ రూ.84 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. రూ.10 కోట్ల స్థిరచరాస్తులు, కిలోలకొద్దీ బంగారు ఆభరణాలతో చిన్న సైజు జ్యువెలరీ షాపును ఆమె ఇల్లు తలపించిన వైనం ఏసీబీ సోదాల్లో బహిర్గతమైంది. భూమిలో వాటా గుంజి కరీంనగర్ జిల్లాలో ఓ తహశీల్దారు అరెస్టు అయ్యారు. బహురూపుల అవినీతి లో ఇదోటి. స్టేషన్ రైటర్ మొదలు స్టేట్ ఆఫీసర్ వరకు అవినీతి కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నారు. దొరుకుతుంది కొందరే. పాపం పండని వారెందరో. ఆయా మాతృ శాఖలు, విభాగాల సునిశిత, తీక్షణ పర్యవేక్షణ/నిఘా లోపమూ సాధారణ జనానికి శాపంగానే పరిణమించింది. రాష్ట్రంలో లంచగొండులకు చట్టంతో గట్టిగా తొడపాశం పెట్టించడంలో ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ నిమగ్నమయ్యారు. అవినీతి భరతం పడుతున్న ఈ స్పార్క్, ఈ ఒరవడి, ఈ ఫోర్సును ఏమాత్రం నిరుత్సాహ పర్చకుండా, ప్రచ్ఛన్న పగ్గాలు వేయకుండా మరింత ప్రోత్సాహం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. క్షేత్ర అధికార యంత్రాంగంలోనే ప్రభుత్వాన్ని సామాన్య ప్రజలు దర్శిస్తారనే సూక్ష్మాన్ని రేవంత్ రెడ్డి సర్కారు మరింత షార్పుగా గ్రహించాలి.

పథకాలపై గ్యారెంటీలు వినసొంపే. కానీ దైనందిన జీవనంలో ఆమ్యామ్యాల రుబాబు రోగానికి చికిత్సపై కూడా గ్యారెంటీ ఉంటే ప్రజలు కుదుటపడతారు. సర్కారీ స్కీములతో సామాన్యులకు ఒనగూరే ఫాయిదాకన్నా కరెప్షన్ భారం, నష్టాలే అధికం. రాజకీయ అవినీతి మీద జరుగుతున్న చర్చ, నిజ జీవితంలో సగటు పౌరులను దహించి వేస్తున్న అదే అవినీతి మీద కూడా గ్యారెంటీగా జరగాలి. ఇందుకు మాట ఇవ్వాలి. ఫస్టుకు జీతాలపై గ్యారెంటీ ఇచ్చినట్టే..లంచాల పీడ విరగడకు గ్యారెంటీ ఇవ్వాలి. ఇది కూడా ఎన్నికల మేనిఫెస్టోలో మెయిన్ అంశం కావాలి.

## కామా ఫుల్ స్టాప్‌కు అతీతం కామారెడ్డి చైతన్యం

కామారెడ్డి చైతన్యం స్వచ్ఛమైన జీవనది సారూప్యం. అసెంబ్లీలో తన ప్రాతినిధ్యానికి సిటింగ్ సీఎంనే కాదనుకున్నది. కాబోయే సీఎంనూ వద్దనుకున్నది. తాను ఎంతగానో నమ్మిన వ్యక్తినే ఎమ్మెల్యేగా గెలిపించుకున్నది. ఆ విధంగా ప్రలోభాలు, తాయిలాలు, పటాటోపాలకు దూరంగా ఉన్నది. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం ప్రజల తీర్పులోని నమ్మకాన్ని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి నిలబెట్టుకుంటున్నారు. ఆదర్శాలు, నీతులు తాను పాటిస్తున్నారు. అధికార యంత్రాంగం కూడా కచ్చితంగా అనుసరించాలని తేల్చి చెబుతున్నారు. రాష్ట్రంలో అరుదైన శాసనసభ్యుడిగా సమాజానికి సరికొత్త హోప్స్ ఇస్తున్నారు.

కలెక్టరేట్ కు వెళ్ళే దారి 24 ఫీట్ల వెడల్పు కోసం రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న తన ఇంటినే మొదట తొలగించుకోవడం ద్వారా ఇతరుల్లో ప్రేరణ కలిగించారు. అవినీతి, అక్రమాలు, ఉదాసీనత ఉనికికి వ్యతిరేకంగా తన అంతరంగాన్ని కుండబద్దలు కొట్టినట్లు కామారెడ్డిలో మీడియా వద్ద ఇటీవల ప్రస్తావించారు. "అన్న, నేను నాన్ కరెప్షను కరెప్షన్ ఫ్రీ కామారెడ్డిని కోరుకున్న. అది గాకుండ ఎవ్వడు అడ్డం బడినా, ఆని పన్జేస్తా. కరెప్టెడు పీపులు పైసలు ఇచ్చొచ్చిన ...ఏ డిపార్టుమెంటు అయినా సరే. డిప్యూటేషను పెట్టుకున్నోళ్ళు, ఇష్టమున్నట్లు ట్రాన్స్ ఫర్లు పెట్టుకున్నా, ఇవన్నీ కూడ చూస్తున్నం. ప్రతి డిపార్టుమెంటు దాటా ఉండి మాట్లాడుతున్నం. ఇడిశే ప్రసక్తే లేదు. ఇది మాత్రం కరెక్టు. కామారెడ్డిని సెట్ జేశినంకనే నా టర్మ్ అయిపోతది. 5 సంవత్సరాలు సరిపోతది. నెక్స్ట్ 5 సంవత్సరాలకు ఎటువంటి ప్లానింగ్ లేదు. నేను గెలవాలని ఎంత ప్లాన్ జేసుకున్ననో, గెలిస్తే ఏం జేయాల్నో గూడ రెడీ యాక్షన్ ప్లాన్ తో ఉన్న. అంటూ పిన్ పాయింట్సుగా వివరించారు. "..డబ్బుల కలెక్షన్ జేస్తే ఈపులు పగులగొడ్త! వోడైనా సరే. డబ్బు వ్యవహారం దీస్కుంటే నేను ఎంతకైనా తెగించి మాట్లాడుతా. నేను రోడ్ల మీదికచ్చే దాకా జూస్కుంటే మంచిది కాదు. అల్లవోంగ కరెప్టెడ్ ఉన్నోళ్లకు మంచిది కాదు. అధికారులు సిన్సియర్ గ ఉన్నోళ్లకు కాళ్ళు మొక్కే రకం నేను. కరెప్టెడ్ అయితే గల్లా పట్టి.. ఇడిశిపెట్టెటోన్ని గాను. ఇగ ఈడికెళ్ళి 57 నెలలు యుద్ధమే. ధైర్యం ఉన్నోడు, నిజాయితీ ఉన్నోడు కామారెడ్డిల పన్జేయాలే. ధైర్యం లేదు. నిజాయితీ లేదు. మాతోని గాదు. అనుకున్నోళ్ళు సప్పుడు దాక వాలంటీర్ ట్రాన్స్ ఫర్ జేస్కోని పోండ్రి. స్ట్రయిట్ అవే జనానికి ఇదే జెప్తున్న. అధికారులకు ఇదే జెప్తున్న. నేను ఛేంజ్ కోరుతున్న. హానెస్ట్ పొలిటీషియన్ ఉంటే, బ్యూరోక్రాట్ హానెస్ట్ ఉంటరనె నమ్మే వ్యక్తిగా నేను హానెస్ట్ గా ఉండడానికి ప్రయత్నం జేశి, జనం మధ్యల గెల్సొచ్చినం. విత్‌ఔట్ లిక్కర్. విత్‌ఔట్ పర్చేజ్ ఓట్. కానీ ఇయ్యాల్ల అది గాకుంట డబ్బులు పెట్టే ప్రయోగాలు జేస్తున్నరు. దెన్ అగేన్ దూయింగ్ మిస్టేక్..ఏముందిలే ఈడు సిన్మ టైప్ మాట్లాడుతుండు. ఏంబీక్తడు. ఏం కట్టలు గడ్తడు అనుకుంటుండొచ్చు. నేనేం బీకేది లేదు. నేనేం కట్టలు కట్టేది లేదు. లా వుంది. దాన్ని ఎట్ల వాడాల్నో తెలిశినోన్ని. దాన్ని ఎట్ల వాడితే వస్తదో నాకు దెల్సు. లూపోల్ ఎట్ల వాడాల్నో మీకు దెల్సు. లూపోల్సును ఎట్ల రెక్టిఫై జేయాల్నో, రీస్టోర్ జేయాల్నో నాకు దెల్సు. ఏం జేయాల్నో అదే జేశి జూపెడ్తా. ఐదు సంవత్సరాలు టైంల మూడే నెళ్ళయిపోయింది. ఇంక 57 నెల్లుంది. ఇదీ నడుస్తున్నదన్న. లెట్ దెం ఎంజాయ్ ఇగ. రేపట్నుంచి ప్రెస్ కు ఎంతుండాల్నో అంతుంటదిగ. కామారెడ్డి టాపిక్. రైట్!.." అంటూ ముగించిన తన విజన్ గురించి ప్రతి ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యులు, జూన్ 4 నుంచి కాబోయె కొత్త ఎంపీలు వినాలి. రాజకీయ అవినీతి, అధికార యంత్రాంగంలో అవినీతి జీరో లేదా కనిష్టం దిశగా ఎక్కడోచోట అడుగులు పడాలి. అందుకు కామారెడ్డి తొలి అడుగు కావాలి. ఆన్ స్క్రీన్ లోనే కాదు, ఆఫ్ స్క్రీన్ లోనూ, నిజ జీవితంలోనూ పరివర్తన రావాలి.



**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు, హైదరాబాద్
9440850384

# మత్తుతో చిత్తు.. యువత భవిష్యత్తు



భారత దేశానికి యువత గొప్ప మానవ వనరులు. యువతే దేశ భవిత దేశ జనాభాలో యువత 27 శాతం వుంది. ప్రపంచం దేశాల తో పోలిస్తే యువశక్తి భారతదేశంలో అధికంగా ఉంది. డ్రగ్స్ మత్తు పదార్థాల వినియోగం యువతను పట్టిపీడిస్తోంది. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు పెను సవాల్ గా పరిణమించింది. ప్రభుత్వానికి సామాజిక ఆర్థిక సమస్యగా మారింది. పల్లె నుండి పట్టణాలకు డ్రగ్స్ మాదక ద్రవ్యాల సరఫరా పల్లె నుండి పట్టణాలకు డ్రగ్స్ మాదక ద్రవ్యాల సరఫరా వినియోగం రవాణ నిరంతరంగా జరుగుతుంది. డ్రగ్స్ కు బానిసలై తమ శక్తి సామర్థ్యాలు నిర్వీర్యం చేసుకుంటున్న యువత పరిస్థితి పట్ల సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. మాదక ద్రవ్యాల ఉత్పత్తి వినియోగం నిలువ సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది . కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ మాఫియాకు భయపడిడ్రగ్స్ భూతాన్నిఅరికట్టడంలో విఫలమైనాయి. యువత ఉత్పాదక శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మాదక ద్రవ్యాల నియంత్రణ నిషేధం పట్ల సమగ్ర కార్యాచరణ కొరవడింది. దేశ ప్రగతికి అభివృద్ధికి చోదక శక్తిగా ఉపయోగపడే యువత భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలు తీసుకొని డ్రగ్స్ వాడకం సరఫరాను కంట్రోల్ చేయాలని 1986లో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఏర్పాటైంది. ఈ సంస్థకు సిబ్బంది కొరత వెంటాడుతోంది 140 కోట్ల ప్రజలున్న భారత్ లో 1100 మంది సిబ్బందితో ఈ సంస్థ నడుస్తుంది .మద్యపానం వలె డ్రగ్స్ కూడా అన్ని వర్గాల ప్రజలకు చేరువైంది ఇలాంటి పరిస్థితుల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అడ్డుకోవడం ప్రభుత్వానికి తలకు మించిన భారమైంది.

భారతదేశంలో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) కార్యాలయాలను విస్తరించవలసి అవసరమని కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ పార్లమెంట్లో ప్రస్తావించడం గమనార్హం. డ్రగ్స్ వినియోగం సౌత్ ఇండియాలో పెరిగిందని కొత్తగా సిబ్బందిని నియమిస్తామని ప్రకటించడం జరిగింది .సిబ్బందితో దేశంలో మరిన్ని ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సంస్థ దేశంలో ఉండే పోలీసుల సాయంతో డ్రగ్స్ మాదక ద్రవ్యాల వినియోగం సరఫరా నియంత్రణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది .స్థానిక పోలీసులకు అవగాహన లేకపోవడం వల్ల వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మాదక ద్రవ్యాలు సరఫరా చేసేందుకు కొంతమంది కొత్త కొత్త దారులు తొక్కుతున్నారు .ఇటీవల ఈ సంస్థ నగరాలలో జరిపిన దాడుల్లో జరిపిన పరిశోధనలో పలు ఆసక్తి కరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. అదికారులను ఆశ్చర్యానికి గురి చేసింది. అరకొర సిబ్బందితో డ్రగ్స్ ను అరికట్టడం కష్టం. దేశ సరిహద్దుల నుంచి డ్రగ్స్ మాదక ద్రవ్యాలు సరఫరా అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో ఢిల్లీ 'ముంబై " చెన్నై' కలకత్తా హైదరాబాద్ లాంటి నగరాలలో డ్రగ్స్ వాడకం విచ్చలవిడిగా సాగుతుంది. కాలేజీలు యువతే టార్గెట్ గా డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నాయి. ఓవైపు డ్రగ్స్ మాదక ద్రవ్యాల మహమ్మారి పంజా విసురుతుంటే మరో వైపు కట్టడి చెయ్యాల్సిన సంస్థలో సిబ్బంది మౌలిక వసతుల కొరత రాజ్యమేలుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పుడే మేలుకోక పోతే దేశ భవిత యువత భవిష్యత్ ప్రమాదంలో పడుతుంది. ఆర్థిక వ్యవస్థలో పేదరికం 'నిరుద్యోగం 'నిరక్షరాస్యత ఆర్థిక అసమానతలు' లింగ వివక్ష బాలకార్మిక వ్యవస్థ ' ఆకలి చావులు అల్ప పౌష్టికాహారం అనారోగ్యం శ్రమదోపిది మన్నగు సమస్యలు దేషాభి వృధికి నిరోధక శక్తి గా పరిణమించాయి . విలాసాలకు జల్సాలకు అలవాటు పడిన యువతను ఆకర్షించి గంజాయి వ్యాపారులు డ్రగ్స్ యువతకు అలవాటు చేసి మత్తుకు బానిసలుగా మార్చుతున్నారు.

పిల్లలపై తల్లి తండ్రుల పర్యవేక్షణ లేకపోవడం చాలా కుటుంబాలలో దంపతులు ఇద్దరు ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లల పైపర్యవేక్షణ కొరవడింది. ప్రశ్నించే వారు లేక పోవడం. సరదా కోసం ఫ్యాషన్ మోజులో స్నేహితుల ఒత్తిడి వల్ల మత్తుకు బానిస అవుతున్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించి ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ మూడేళ్ల కిందట అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ మండలి వార్షిక నివేదిక కుండ బద్దలు కొట్టింది 2016 ప్రపంచవ్యాప్తంగా పట్టుబడిన గంజాయి లో 6 శాతం ( దాదాపు 300 టన్నులు) ఒక్క ఇండియా నుంచే ఉండగా 2017 నాటికి 20 శాతానికి పెరిగింది . 353 టన్నులు కు పెరిగిందని నివేదిక వెల్లడించింది .డ్రగ్స్ వ్యాపారానికి హైదరాబాద్ కీలక కేంద్రంగా మారింది. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో మూతబడిన మందుల తయారీ కంపెనీలు డ్రగ్స్ కు అడ్డగా మారినాయి. ఇటీవల హైదరాబాద్ విమానాశ్రయం లో121 కోట్ల రూపాయలు హెరాయిన్ పట్టుపడింది. ముంబై పోర్టులో రూ"1800 కోట్ల విలువైన 300 కిలోల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. అస్సాంలో 163 కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలను రాష్ట్ర ప్రభుత్వం ధ్వంసం చేసింది. కేంద్ర సామాజిక మంత్రిత్వ శాఖ అధ్యయనం కేంద్ర సామాజిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోడ్రగ్స్ వినియోగం మాదక ద్రవ్యాలు సరఫరాకు సంబంధించి జరిగిన అధ్యయనంలో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. దేశవ్యాప్తంగా ఒక 186 జిల్లాలో నాలుగు లక్షల మందికి పైగామత్తు మందుల వినియోగదారులపై సర్వేచేశారు .అత్యధిక మంది అలవాటుపడిన మాదకద్రవ్యాలలో గంజాయి' నల్లమందు (ఓపియం) కొకైన్ ఎటిస్ ఎక్కువగా ఉన్నాయి. వీటిలో నల్లముందు వినియోగం ఆందోళనకరంగా ఉంది .దేశ జనాభాలో 3.1 కోట్ల మంది దీని కబంధ హస్తాలలో బంది ఐయినారు .అరుణాచల్ ప్రదేశ్ నాగాలాండ్' మిజోరం రాష్ట్రాలలో 10 శాతం జనాభా నల్ల మందు గుప్పిట్లో బంధి అయినారు. గంజాయికి సైతం చాలా మంది అలవాటు పడ్డారు. ఆయుర్వేద మందు ముసుగులో దీనిని వినియోగంలోకి తీసుకొచ్చారు. గంజాయిని పొడిగా మార్చి విక్రయిస్తున్న వారి సంఖ్య 2.2 కోట్లు ఉంటుందని అంచనా .మరో కోటి మంది అదనంగా దీనిని వినియోగిస్తున్నారని అంచనాలు తెలియజేస్తున్నాయి. షుగర్ రూపంలో ఉపయోగించే వారు మన దేశంలో ఎక్కువగా ఉన్నారు . ఫార్మా పరిశ్రమ నుంచి వచ్చే మందుల రూపంలో వినియోగిస్తున్నారు ఇలాంటి వారు డ్రగ్స్ ను 1.1% వినియోగిస్తున్నారని సర్వేలు వెల్లడిస్తున్నాయి .ఆంధ్ర ప్రదేశ్ పంజాబ్' మహారాష్ట్ర 'గుజరాత్ లో తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. వైద్యపరమైన అవసరాలకు వాడే మందులు ఆరోగ్యానికి చెడు చేస్తున్నాయి. హైదరాబాద్ వంటి నగరాల్లో ప్రముఖుల నుంచి సామాన్యుల వరకు డ్రగ్స్ వాడకం పెరిగింది.

తెలుగు రాష్ట్రాల్లో కళాశాలలు యూనివర్సిటీ ఆవరణలో డ్రగ్స్ వినియోగం విక్రయం పెరిగింది. డ్రగ్స్ మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా జరుగుతుంది .డ్రగ్స్ మాదక ద్రవ్యాల నియంత్రణ పర్యవేక్షించాల్సిన సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఈ మహమ్మారి విస్త్రరిస్తుంది. చలన చిత్ర పరిశ్రమలో నటులు డ్రగ్స్ నుసినిమా విరివిగా వినియోగిస్తారనీ సర్వేలో వెల్లడైంది . డ్రగ్స్ వినియోగం యువత విద్యార్థుల ఆరోగ్యానికి ప్రమాదం కరంగా పరిణమించింది రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏజెన్సీలు గంజాయిని నిరాటంకంగా రవాణా చేయడంవల్ల ఒరిస్సా సరిహద్దు రాష్ట్రాలలో ఆయుర్వేద వైద్యం రూపములో డ్రగ్స్ సప్లై చేయబడుతుంది .యువతకు డ్రగ్స్ సులువుగా లభించే పద్ధతుల ద్వారా పంపిస్తున్నారు .మరో వైపు డ్రగ్స్ తయారీ ప్రాంతాలకు తరలింపు పెద్ద సమస్యగా మారింది. భారత్లో 10 నుండి 75 సంవత్సరాల లోపు వారిలో 16 కోట్ల మంది మద్యం సేవిస్తున్నారు. దీనికి తోడు రోగాలు పెరుగుతూ ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వం పౌరసమాజం స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా సంస్థలు మహిళా సంఘాలు డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ఉద్యమించాలి.



**నేదునూరి కనకయ్య**
తెలంగాణ ఎకనామిక్ ఫోరంఅధ్యక్షులు
కరీంనగర్9440245771

## మార్షబాయి కుంట రక్షణకు చర్యలు

**రాజేంద్రనగర్ మార్చి 20 (జనం సాక్షి)**



కబ్జాకు గురికాకుండా మార్షబాయి కుంట రక్షణకు చర్యలు చేపట్టామని జీహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. రాజేంద్రనగర్ మండలం, కాటేధాన్ గ్రామ పరిధిలోని మార్షబాయి కుంటలో ఎఫ్‌టిఎల్ మరియు బఫర్ జోన్ ప్రాంతంలో కబ్జాదారులు నిర్మాణ శిథిలాలు, వ్యర్థ పదార్థాలను డంప్ చేసినట్లు దృష్టికి రావడంతో రాజేంద్రనగర్ గౌరవ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్, జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ సంబంధిత స్థలాన్ని సందర్శించి శిథిలాలు తొలగించాలని స్థానిక ప్రజలకు సూచించారని, ట్యాంక్ పరిధిలోని ఎఫ్‌టిఎల్ ,బఫర్ జోన్‌లో డంప్ చేసిన నిర్మాణ శిథిలాలు, వ్యర్థ పదార్థాలను తొలగించి ట్యాంక్‌ను ఆక్రమణదారుల నుండి రక్షించడం జరిగిందన్నారు. ట్యాంక్ ఎఫ్‌టిఎల్, బఫర్‌లో తదుపరి ఆక్రమణలు జరగకుండా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించినట్లు తెలిపారు. నిందితులపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేయడానికి మైలార్‌దేవ్‌పల్లి పిఎస్ ఎస్‌హెచ్‌ఓకు సూచించినట్లు పేర్కొన్నారు.

## నగరంలో ఎన్ఫోర్స్ మెంట్ బృందాల విస్తృత తనిఖీలు

- **ఇప్పటివరకు రూ.47,18,300/- నగదు సీజ్**
- **జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్**

**హైదరాబాద్, మార్చి 20 (జనం సాక్షి):**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఏర్పాటైన ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలు నగరంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి ఇప్పటివరకు రూ.47,18,300/- నగదును, రూ.17,49,140/-ల విలువైన ఇతర వస్తువులు, 104.41 లీటర్ల అక్రమ మద్యంను సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల నుండి బుధవారం ఉదయం 6 గంటల వరకు నిర్వహించిన తనిఖీల సందర్భంగా రూ.29,70,000/- నగదుతో పాటు రూ.23,829/-ల విలువగల ఇతర వస్తువులు, 49.74 లీటర్ల అక్రమ లిక్కర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఇప్పటి వరకు రూ. 38 లక్షలు సీజ్ చేయగా, పోలీస్ బృందం రూ. 9,18,300/- ల నగదు తో పాటు రూ.17,49,140/- విలువ గల ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. 15 మంది పై ప్రోహిబిషన్



కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు నగదు, ఇతర వస్తువులపై 26 ఫిర్యాదులు రాగా పరిశీలించి పరిష్కరించారని, 19 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ పేర్కొన్నారు.

# రంజిత్ రెడ్డికి డిపాజిట్ రాకుండా చేస్తాం



- **రంజిత్ రెడ్డి నిజస్వరూపం చేవెళ్ల ప్రజలకు తెలిసింది**
- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్, మార్చి 20 (జనం సాక్షి)**

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపుకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మీడియా ప్రతినిధులు కనిపించకపోవడంతో జిల్లా అధ్యక్షులు అవాక్కయ్యారు. సమావేశానికి పత్రిక విలేకరులకు మీడియా మిత్రులు ఎక్కడ అని అడగడంతో ప్రజాప్రతినిధులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. వెంటనే స్థానిక ప్రజాప్రతినిధి పత్రిక విలేకరులకు మీడియా మిత్రులకు సమాచారం చెరవేయడంతో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమన్వయ లోపంతో జిల్లా పార్టీ కార్యాలయంలో ఎవరికి వారు యమునా తీరన్న చందంగా సమావేశం నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గెలుపుకు పార్లమెంటు పరిధిలోని బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులందరూ కృషిచేయాలని మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోని పార్టీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజారిటీతో ఎంపిగా గెలిపించాలని పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మొదటిసారిగా బిఆర్ఎస్ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించారు. రెండోసారి రాజకీయ అనుభవం లేని వ్యాపారాలు చేసుకునే కొత్త వ్యక్తి రంజిత్ రెడ్డిని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంనికి బిఆర్ఎస్ అభ్యర్థిగా గెలిపించారు. ఎక్కడో ఉన్న వ్యక్తిని తీసుకువచ్చి ఎంపీగా గెలిపించారాని కృతజ్ఞతా భావం కూడా లేకుండా పార్టీని వదిలేసి కాంగ్రెస్ పార్టీలో కలవడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం అన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న లంబాడి తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత మా ప్రభుత్వందే అంటే ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో పట్టణాల్లో రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంచినీటి సమస్యను పూర్తిగా నెరవేర్చమన్నారు. మూడు నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కోతల విపరీతంగా ఉన్నాయన్నారు. నమ్మదగిన వ్యక్తిగా రంజిత్ రెడ్డి కేటీఆర్ తో తిరుగుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి కుడి భుజంలా ఉన్నాడని అనుకున్నామన్నారు. ప్రభుత్వం మారగానే తన నిజస్వరూపం చూపించాడు. అధికారం కోల్పోగానే వెంటనే కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. రంజిత్ రెడ్డి ఓటమి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు రెండు ఒకటేసారి జరుగుతా యన్నారు. ఈ కార్యక్రమంల, అంజయ్య యాదవ్, కాలే యాదయ్య, అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీలు, దయానంద్ గుప్తా, మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మా రెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్ యాదవ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ,జడ్పిటిసి నీరటి తన్వీరాజు, ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నీల మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భారత చిన్నారుల్లో ప్రమాదకర స్థాయిలో నిద్రలేమి

### పీడియాట్రిషియన్ డాక్టర్ జక్కా శ్రీనివాస్

**శేరిలింగంపల్లి, మార్చి 20 (జనం సాక్షి) :**



భారతీయ పిల్లలలో నిద్రలేమితనం ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతుందని, తద్వారా అనేక రుగ్మతలు పెరిగిపోవడం ఆందోళన కలిగించే విషయమని అంకుర హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రీషియన్ డాక్టర్ జక్కా శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శేరిలింగ ంపల్లి నియోజకవర్గ మాదాపూర్ పరిధిలోని అంకుర హాస్పిటల్ లో బుధవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన కొన్ని విషయాలను వెల్లడిం చారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశంలో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో 30% కంటే ఎక్కువ మంది పిల్లలు అస్థిరమైన నిద్రను కలిగి ఉన్నారని, 28% మంది చిన్నారులు నిద్ర లేమితో బాధ పడుతున్నారన్నారు. ఆధునిక ప్రపంచంలో అనేక కారణాలతో పిల్లల్లో నిద్రలేమితనం ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతుందని ప్రపంచ మేధావులు, ఆయా దేశాలు ఆలోచించుకోవాల్సిన తరుణం ఏర్పడిందన్నారు. 'భారతీయ పిల్లలలో నిద్ర-రుగ్మతలు' అన్న విషయాన్ని, వాస్తవికతను అధ్యయనం చేయడానికి భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఆసుపత్రులలో మల్టీసెంటర్ అధ్యయనాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఒకటి నుండి 18 సంవత్సరాల వయస్సుగల పిల్లలలో విశ్రాంతి, నిద్రిస్తున్న తీరును అర్థం చేసుకోవడానికి, అనారోగ్యాలు మరియు ఇమ్యునైజేషన్ కోసం మైనర్‌లు ఆసుపత్రులను సందర్శించడాన్ని ఈ అధ్యయనంకోసం పరిగణలోకి తీసుకోవటం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక వైద్య ఆధారిత పరిస్థితులు, నిద్రను ప్రభావితంచేసే మందులు తీసుకుంటున్న పిల్లలను మినహాయించడం జరిగిందన్నారు. ఈ అధ్యయనంలో 31.2 శాతం మంది పిల్లలు వారాంతాల్లో, సెలవు దినాల్లో సరిగా నిద్రపోవటంలేదని తెలిసిందన్నారు. మరోవైపు 28 శాతం మందికి తగినంత నాణ్యమైన నిద్ర అందడం లేదన్నారు. ఈ అధ్యయనంకోసం మొత్తం 2 వేల 235 మంది పిల్లలను అధ్యయనం చేయడం జరిగిందని, ఇందులో 53 శాతం పురుషులు, 47 శాతం స్త్రీలు ఉన్నారన్నారు. ప్రాథమిక నిద్ర స్క్రీనింగ్ ప్రశ్నాపత్రాన్ని ఉపయోగించి తల్లిదండ్రులతో వివరణాత్మక ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందన్నారు. తమ పిల్లలలో నిద్ర సమస్యలను నివేదించే తల్లిదండ్రులగురించి చెర్విన్ మరియు ఇతరులు అభివృద్ధి చేసిన పీడియాట్రిక్ స్లీప్ ప్రశ్నాపత్రాన్ని ఉపయోగించి లోతుగా అధ్యయనం చేయడం జరిగిందన్నారు.

## మాదకద్రవ్యాల సరఫరా నిందితుల ముఠా అరెస్ట్

### కోటి రూపాయల సొత్తు స్వాధీనం

**శేరిలింగంపల్లి, మార్చి 20 (జనం సాక్షి) :**

ఖరీదైన కుటుంబాలకు గాలం వేసి వారి నమాదకద్రవ్యాల ఉచ్చులోకి లాగుతున్న ఒక రోడ్డు కట్టిన ఇద్దరు సభ్యుల ముఠాను మాదాపూర్ ఎస్‌ఓటి పోలీస్ విభాగం అధికారులుబుధవారం చేదించారు. ఈ మేరకు మాదాపూర్ జోన్ డిసిపి డాక్టర్ జి. వినీత్ వెల్లడించిన వివరాల ప్రకారం...ఢిల్లీకి చెందిన మిలాన్సీ నరేంద్ర శివనాథ్(34) చాలా కాలంగా మాదకద్రవ్యాల సరఫరాను వృత్తిగా ఎంచుకొని పబ్ కల్చర్‌కు అలవాటు పడిన ఖరీదైన కుటుంబాలను టార్గెట్గా చేసుకొని వారితో పరిచయాలు పెంచుకొని వారికి మెల్లిగా మాదకద్రవ్యాలను సరఫరా చేయడం నరేంద్ర శివనాథ్‌కు ఉన్న ప్రత్యేకత. ఈ క్రమంలో అతను దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, గోవా, బెంగళూరు, హైదరాబాద్‌లను కేంద్రాలుగా చేసుకొని తన డ్రగ్ వ్యాపారాన్ని విస్తరించాడు. ఈ క్రమంలో హైదరాబాద్ ముషీరాబాద్ పరిధి ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ రెహమాన్(27)తో పరిచయం పెంచుకుని హైదరాబాదులో డ్రగ్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. ఇందులో భాగంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మూడు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రెండు కేసులలో వీరు ప్రత్యక్షంగా పాల్గొని నిందితులుగా ఉన్నారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం ప్రకారం మాదాపూర్ జోన్ ఎస్వోటీ పోలీసు అధికారులు గచ్చిబౌలి పోలీసులతో కలిసి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి వారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని వారి వద్ద నుండి 11 గ్రాముల ఎండిఎంఏ, 7 మొబైల్ ఫోన్లు, 1 జాగ్వార్ కారు సహా కోటి విలువ చేసే సొత్తును పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, త్వరలోనే కేసు పూర్తి వివరాలను వెల్లడిస్తామని డిసిపి డాక్టర్ జి వినీత్ తెలిపారు.

# నగరంలో పార్కింగ్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలి

### కమిషనర్ రోనాల్డ్ రోస్

**హైదరాబాద్ సిటీ, మార్చి 20(జనం సాక్షి):**



నగరంలో ప్రజలకు పార్కింగ్ ఇబ్బందులు లేకుండా పూర్తి ప్రణాళికను తయారు చేయాలని, అందులో ఆర్గనైజింగ్ పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరంలో ఎదుర్కొంటున్న పార్కింగ్ సమస్య పై చర్చించారు.కాంప్రహెన్సివ్ పార్కింగ్ పాలసీ తయారు చేయుటకు అధికారులు విధివిధానాలను సిద్ధం చేయాలన్నారు. టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ తో పాటు భారీ వాహనాలు ఎక్కడ ఎక్కడ పార్క్ చేయడానికి అవకాశం ఉందో అలాంటి అనువైన స్థలాలను గుర్తించాలని చీఫ్ సిటీ ప్లానర్ ని ఆదేశించారు. జిహెచ్ఎంసి పరిధిలో ఇప్పటికే స్థలాలు గుర్తించినప్పటికీ సరైన నిర్వహణ లేకపోవడం మూలంగా పార్కింగ్ వినియోగించుకోవడం లేదని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా 4 వీలర్ పార్కింగ్, ద్విచక్ర వాహనాల కోసం ప్రత్యేక స్థలాలు గుర్తించాలని సూచించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో పయనించే వాహనదారులకు ఆయా ప్రాంతాల్లో వాహనదారులు పార్కింగ్ చేసుకునేలా అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలాల వివరాలు ప్రత్యేక పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా గుర్తించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు కమిషనర్ సూచించారు. పార్కింగ్ ప్లేసెస్ వద్ద అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా నగరంలో ఖాళీగా ఉన్న ప్రైవేటు స్థల యజమానులు పార్కింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు వచ్చిన పక్షంలో వారు పాటించాల్సిన నియమ నిబంధనలు తయారు చేయాలన్నారు. ముఖ్యంగా మెయిన్ రోడ్లతో పాటు ట్రాఫిక్ రద్దీగా ఉండే కాలనీ రోడ్లను గుర్తించి అనువైన స్థలాలను గుర్తించాలని అన్నారు. అదే విధంగా కమర్షియల్ మాల్స్ వద్ద కూడా వాహన పార్కింగ్ సౌకర్యం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కింగ్ స్థలాల వద్ద ప్రకటనల ద్వారా జిహెచ్ఎంసి ఆదాయం పెంచడం కోసం ప్రత్యేకంగా దృష్టి సారించాలని కమిషనర్ కోరారు.ఈ సందర్భంగా ఏజెన్సీ పార్కింగ్ సంబంధించిన నిర్మాణ నమూనాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమిషనర్ పరిశీలించారు. ఈ సమావేశంలో ఈవిడిఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఇఎన్‌సి జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, సిసిపి రాజేంద్ర ప్రసాద్ నాయక్, ప్రాజెక్టు సిఈ దేవానంద్ పాల్గొన్నారు.

## హెచ్ఎండిఏ ఎపిఓ సస్పెండ్

**హైదరాబాద్ సిటీ, మార్చి 20(జనం సాక్షి):**

పుప్పల్ గూడ గ్రామం గండిపేట మండలం సర్వే నెం.314 నుండి 317, 330, 332 మాస్టర్ ప్లాన్ 100ఫీట్ రోడ్‌లో భూమి పోయింది అని టీడీఆర్ కింద కొందరు వ్యక్తులు దరఖాస్తు చేసుకున్నారు. దానిని పూర్తి స్థాయిలో పరిశీలించకుండా ఎపిఓ బివి క్రిష్ణ కుమార్ పై అధికారులను తప్పుదోవ పట్టించినందుకు గాను హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎపిఓ కృష్ణ కుమార్‌ని బుధవారం సస్పెండ్ చేసారు.

# ప్రభుత్వ భూమిని కాపాడాలి





### తుంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ లక్ష్మీ నారాయణ

**శామీర్ పేట్ మార్చి 20 (జనం సాక్షి):**

ప్రభుత్వ భూమిలో మున్సిపల్ నుండి గాని మరి ఏ ఇతర ప్రభుత్వ కార్యాలయం నుండి గాని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా పెద్ద గోదాము నిర్మించుచున్నారని, దీని వల్ల తూముకుంట మున్సిపాలిటీకు మరియు అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి కూడా చాలా నష్టం జరుగుతుందని తుంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ లక్ష్మీ నారాయణ అన్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి ఈ ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఈ అక్రమ నిర్మాణా లకు పాల్పడుతున్న వారి పైన చట్టపర దేవదాయ భూములో అక్రమంగా నిర్మిస్తున్న గోడౌన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. బుధ వారం శామీర్ పేట్ తహసీల్దార్ యాదగిరి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని, దేవరయంజాల్ గ్రామంలో ప్రభుత్వ భూమిలో మున్ని పాలిటీ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మించుచున్న గోదామును తొలగించాలని కోరారు. తూముకుంట మున్సిపల్ పరిధి లోని దేవరయంజాల్‌లో నిర్మిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామంలోని ప్రకృతి రిసోర్ట్ ప్రక్కన సర్వే నంబర్ 63 గల ప్రభుత్వ మండల కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## సన్ సీడ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు బేష్



### డాక్టర్ అన్వేష్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, మార్చి 20 (జనం సాక్షి)**

కుషాయిగూడలోని సన్ సీడ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అతి తక్కువ ఫీజులకే ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో సేవలు అందిస్తున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రశంసించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్న డాక్టర్ అన్వేష్ ను అభినందించారు. సన్ సీడ్ హాస్పిటల్ ప్రారంభించిన అణతి కాలంలోనే 1500 ఇన్ పేషెంట్లకు, 5,000 పైగా ఔట్ పేషెంట్లకు వివిధ రకాల సేవలను, శస్త్ర చికిత్సలు విజయవతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం హాస్పిటల్‌లో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక బాధ్యతతో సేవలందిస్తున్న సన్ సీడ్ యాజమాన్యం చేస్తున్న సేవలను కొనియాడారు. తక్కువ ధరకు కార్పొరేట్ స్థాయిలో చికిత్సలు అందిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. సన్ సీడ్ హాస్పిటల్ సేవలను క్షేత్రస్థాయిలో విస్తరించి మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆశించారు. డాక్టర్ అన్వేష్, డాక్టర్ బానుచందర్, డాక్టర్ స్వాతి, డాక్టర్ పావనిలు సుమారు 3000 మంది పేషెంట్లకు వైద్య శిబిరంలో బిపి, షుగర్, థైరాయిడ్, గైనకాలజీ, డెంటల్, డెర్మటాలజీ తదితర సమస్యలకు సలహాలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సన్ సీడ్ హాస్పిటల్ సిబ్బంది కాప్రా లయన్స్ క్లబ్ ప్రతినిధులు సురేష్ కుమార్, హరీష్ రెడ్డి, విజయ్ కుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**మల్కాజిగిరి, మార్చి 20 (జనం సాక్షి)**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో మల్కాజిగిరి సర్కిల్ నేరెడ్ మెట్‌కు చెందిన సీనియర్ నాయకులు చెన్నారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప పుష్పగుచ్చాలు అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు.

## ఎంబిసి జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**



మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎంబిసి ఒకేషనల్ జూనియర్ కళాశాలను బుధవారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, కళాశాల ప్రిన్సిపాల్ తిమ్మోతిని కళాశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాల పరిస్థితులను గమనిస్తే గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందనదాని ఇదొక నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ ఆంధ్రూ ఎలియాస్, ఎంబిసి హైస్కూల్ హెడ్ మాస్టర్ జగదీశ్వర్ రెడ్డి, చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

## రంగనాయకులాగుట్ట బస్తి సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తా

### కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి

**ఎల్బీనగర్, మార్చి 20 (జనం సాక్షి)**



హయత్ నగర్ డివిజన్‌లోని రంగనాయకుల గుట్టలో ఉన్నటువం టి వరదనిట్టి కాలువలో చెత్తాచెదారం చేరి దుర్వాసనతో దోమలు పెరిగి కాలినీ వాసులు అనారోగ్య బారిన పడే ప్రమాదం ఏర్పడుతుందని కాలనీ వాసులు సమాచారం ఇవ్వడంతో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సమస్యను పరిశీలించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వరద నీటి కాలువను శుభ్రం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎ ఇచంద్ర శేఖర్, కాలనీ వాసులు మొగులయ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

- రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ప్రభుత్వ భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి
- ధరణి పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- అధికారుల పని తీరుపై అసహనం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు




**సంగారెడ్డి టౌన్ మార్చి 20 (జనం సాక్షి)**

జిల్లాలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవిన్యూ, నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు, మునిసిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సంగారెడ్డి, పటాన్చెరు, జిన్నారం, తదితర మండలాలలో చెరువులు, కుంటలు ప్రభుత్వ ఇతర ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని చెరువులు కుంటలు ఎఫ్‌టిఎల్ పరిధిని అధికారులు సర్వే చేసి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పటాన్చెరు, జిన్నారం, సంగారెడ్డి తదితర మండలాలలోని పెద్ద చెరువుల రికార్డులను వెంటనే సమర్పించాలని రెవెన్యూ ఇరిగేషన్ శాఖల అధికారులు ఆదేశించారు. అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ భూములు పరిరక్షించాలి అన్నారు. మైనింగ్ అనుమతులకు రెవెన్యూ అధికారులు ఎన్వోసీ తప్పనిసరి అన్నారు. అనుమతి పొందిన మేరకే మైనింగ్ జరిగేలా అధికారులు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బొల్లారం ఎర్రగుంట చెరువులో ఏర్పాటుచేసిన వెంచర్ వివరాలు వెంటనే ఇవ్వాలని సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు. ధరణి పెండింగ్ సమస్యలను రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు గ్రామస్థాయిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకాకుండా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చూడాలన్నారు పల్లె ప్రకృతి వానాలు, ఇతర ప్రభుత్వ స్థలాలు గ్రామస్థాయిలో కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే పంచాయతీ కార్యదర్శులు రెవెన్యూ అధికారుల సహాయంతో నోటీసులు అందజేసి ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. మునిసిపల్ అధికారులు నోటీసులు మాత్రమే ఇచ్చి కూర్చుంటారని చర్యలు చేపట్టారని అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజారాణి, డిపిఓ సాయిబాబా, నీటి పారుదల శాఖ ఎస్ఈ మురళీధర్, ఆర్‌డిఓ వసంత కుమారి, సంబంధిత మండలాల తహసీల్దారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఓటింగ్ శాతాన్ని పెంచేందుకే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

### వసతుల కల్పనకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**వెల్దుర్తి మార్చి 20 (జనం సాక్షి)**

రానున్న లోక్‌సభ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు తమ గ్రామాల్లోని నేరుగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లాలో ఐదు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం మాసాయిపేట మండలం కొత్తగా ఏర్పడిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లాలోని పాపన్నపేట మండలం దఖ్యాతాండ హవేలి ఘన్పూర్ మండలం వాడి మెదక్ మండలం పాషాపూర్ కొల్చారం మండలం సంగాయపేట లో ఈ నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పోలింగ్ కేంద్రాలను పరిశీలించగా ఓటర్లు ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేశారని ఆయన అన్నారు గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ తమ గ్రామాల నుండి మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి ఓట్లు వేసేందుకు ఇబ్బంది పడ్డట్లు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల కంటే రానున్న ఎన్నికల్లో అత్యధికంగా పోలింగ్ శాతాన్ని నమోదు అయ్యేటట్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అలాగే కొత్త పోలింగ్ కేంద్రాల్లో గల వసతులను పరిశీలించి మౌలిక వస్తువుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, ఎంపీడీవో జగదీశ్వర చారి, మాసాయిపేట తహసిల్దార్ జ్ఞానజ్యోతి, బీపీఎంలతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు



## ఎన్నికల నిబంధనలను ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధులు పాటించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

**మఖ్తల్ మార్చి 20 (జనం సాక్షి)**

ఎన్నికల నిబంధనలను ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధులు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ మాయాంకు మిత్తల్ అన్నారు. బుధవారం మక్తల్ తాసిల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి రాజకీయ పార్టీ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున నిబంధనల ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. ప్రచారం ఇతర అనుమతులు ముందస్తుగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్క రాజకీయ పార్టీ ఎన్నికలను విజయవంతం చేసేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

### జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సరిహద్దు రాష్ట్రాల చెక్ పోస్టల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబంది ప్రతి వాహనానికి క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో నారాయణపేట మండలంలోని జలాల్పూర్, ఏక్లాస్పూర్ చెక్ పోస్ట్ లను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి అక్కడ విధుల్లో ఉన్న పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ నిర్వహించారు. చెక్పోస్ట్ వద్ద వచ్చిపోయే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, బస్సులను, ద్విచక్ర వాహనాలను సైతం తనిఖీ నిర్వహించాలని సూచించారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబంది డ్యూటీ రోస్టర్ రిజిస్టర్ ను, వాహనాల తనిఖీల నెంబర్లను రికార్డు చేసే రిజిస్టర్ను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికల విధులను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని, జిల్లాలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాహనాల తనిఖీలు నిర్వర్తించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాత్రి సమయంలో రేడియం జాకెట్స్ ఉపయోగించాలని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి అక్రమంగా డబ్బు, మద్యం, బంగారం విలువైన వస్తువులు తరలిస్తుంటే పట్టుకోవాలని సూచించారు. 50వేల రూపాయల కంటే ఎక్కువ అమౌంట్ తీసుకెళ్తుంటే తగిన ధ్రువపత్రాలు లేకపోతే అమౌంట్ సీజ్ చేసి గ్రివియస్ కమిటీకి అప్పగించాలని సూచించారు. 10 లక్షల కంటే ఎక్కువ అమౌంట్ సీజ్ చేస్తే ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ కు సబ్మిట్ చేయాలని ఎస్పీ తెలిపారు. చెక్పోస్ట్ దగ్గర విధుల్లో ఉండే పోలీసులకు కావలిసిన అవసరాలను ఏర్పాటు చేయాలని, వేసవి తాపానికి కూలర్ ఏర్పాటు చేయాడం జరిగింది అని, ఎండలు ఎక్కువగా ఉన్నందున విధులు నిర్వర్తించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంచినీళ్ళని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఎస్పీతో పాటు ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.



## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించు కోవాలి

### డిప్యూటీ సిఈఓ జ్యోతి

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని జెడ్పీ డిప్యూటీ సిఈఓ జ్యోతి మండల మహిళా సమాఖ్య సభ్యులను కోరారు. బుధవారం నారాయణపేట మండలం మహిళా సమాఖ్య భవనంలో మహిళా సభ్యులకు స్వీప్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా సభ్యులు కృషి చేయాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు దాటిన వారిని ఓటర్‌గా నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు పై అవగాహన కలిగి ఓటును వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పిడి. అంజయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- ఎన్ఫోర్స్ మెంట్ బృందాలు పకడ్బందీగా నిఘా పెట్టాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్




**వనపర్తి బ్యూరో మార్చి 20 (జనం సాక్షి)**

ఎన్నికల్లో ప్రలోభాలను నిరోధించి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్ఫోర్స్ మెంట్ బృందాలు పకడ్బందీగా నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు, వాణిజ్య పన్నులు, అబ్కారీ, ఆదాయ పన్నులు, ఇంటలిజెన్స్, బ్యాంకు శాఖల అధికారులతో ఎన్ఫోర్స్ మెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికల్లో ప్రలోభాలను అరికట్టేందుకు ఒక్కో శాఖ పరంగా చేయాల్సిన పనులు, వివిధ శాఖల మధ్య సమన్వయంపై దిశా నిర్దేశం చేశారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలను ఎప్పటి కప్పుడు పసికట్టి అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రలోభాలకు పాల్పడే వారి పై కేసులు బుక్ చేసేవిధంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న నిఘా వివరాలపై శాఖల వారీగా కలెక్టర్ ఆరా తీశారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికారులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా మద్యం, నగదు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరుగకుండా పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశించారు. బెల్టు షాపులు, సారా దుకాణాలపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టులో నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీఎస్టీ తదితర అన్ని టీములు అప్రమత్తంగా ఉండి తనిఖీలు చేయాలని చెప్పారు. తప్పుడు సమాచారాన్ని, ఫేక్ న్యూస్ లను అరికట్టే దిశగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. చెక్‌పోస్టుల్లో సీజ్ చేసిన వివరాలను ప్రతీరోజు పోర్టల్ అప్లోడ్ చేయాలని అదేశించారు. ఐటీ, వాణిజ్య పన్నులు, ట్రెజరీ సహా అన్ని విభాగాల అధికారులు ఎన్ఫోర్స్ మెంట్ ఏజెన్సీలతో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకుల్లో జరిగే లావాదేవీల పై గట్టి నిఘా పెట్టాలని అనుమానిత లావాదేవీలు, 10లక్షలకు మించిన లావాదేవీలపై నిఘా పెట్టాలని బ్యాంకర్లను సూచించారు. అనుమానాస్పద లావాదేవీల సమాచారాన్ని ఐటీ శాఖకు అందించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థవంతంగా అమలు చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యం. నగేష్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో పద్మావతి, డీటీవో, ఐటీ, పోస్టల్, అబ్కారీ, వాణిజ్య పన్నుల శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మహబూబ్ నగర్‌లో బిజెపి గెలుపు ఖాయం

### బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ బిజెపి ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

మహబూబ్ నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం దేవరకద్ర నియోజకవర్గం లోని చిన్న రాజమూర్‌లో గల తమ ఇష్ట దైవమైన ఆంజనేయస్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు చేసినా పాలమూరు ప్రజల ఆశీస్సులతో, కేంద్రం లోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనా తీరే తమను గెలిపిస్తుందని అన్నారు. దేశం కోసం, సనాతన ధర్మం రక్షణ కోసం, సంస్కృతి పరిరక్షణ కోసం, నరేంద్ర మోదీ మళ్ళీ భారతదేశానికి ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు . మహబూబ్ నగర్ లోక్ సభ అభ్యర్థిగా పాలమూరులో తనను ప్రజలు తమను గెలిపిస్తారని నమ్మకం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభంజనం మొదలైందనీ, ఆ గాలికి కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు కొట్టుకుపోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరనీ, బిఆర్ఎస్‌ని నమ్మి మోసపోయారనీ బీజేపీతోనే ప్రజారంజక పాలన సాధ్యం అని ప్రజలు గట్టిగా నమ్ముతున్నానని ఆమె అన్నారు. వందల ఏళ్లగా ఎదురు చూస్తున్న హిందువుల చిరకాల కల అయోధ్యలో రామమందిరం నిర్మించి, బాల రాముని ప్రాణ ప్రతిష్ట చేసిన ధర్మ రక్షకుడు మన భారత ప్రధాని నరేంద్ర మోడీ అని ఆమె అన్నారు . దేశం బాగుండాలన్నా, దేశ భవిష్యత్ బాగుండాలన్నా , కేంద్రంలో మరో సారి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కావాలన్నారు. ప్రజలు అన్ని ఆలోచించి దేశం కోసం పాటుపడుతున్న బిజెపికి ఓటు వేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ కమీషన్ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యులు తల్లోజు ఆచారి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర బిజెపి ఇన్చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి, బీజేపీ, యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి

**అల్లాదుర్గం మార్చి 20 (జనం సాక్షి)**

మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న కార్యక్రమాల్లో రాష్ట్ర వైద్య ,ఆరోగ్యశాఖ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన గణపతి పూజ ,ధ్వజ స్తంభ పూజ, హోమం కార్యక్రమాలలో మంత్రి పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆలయ అర్చకులు శాలువాలతో సన్మానం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనరసింహ మాట్లాడుతూ స్వామి వారి దయతో రాష్ట్రం ,ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నారు. వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తాననీ ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం ఎంపిపి అనిల్ కుమార్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం, యూత్ కాంగ్రెస్ నాయకులు మహేష్, ఎంపిటిసిలు విట్టల్ రెడ్డి, దుర్గయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సదానందం, సురేష్, కురుమ నాగయ్య, బాలరాజు ,మర్క రాములు, కోంక శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనే కాంగ్రెస్ గెలుపుకు పునాది

### సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు, మహబూబ్ నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి



**మహబూబ్ నగర్ బ్యూరో మార్చి 20 (జనం సాక్షి)**

రాష్ట్రంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా పాలన స్ఫూర్తిగా కొనసాగుతున్న పథకాల అమలే కాంగ్రెస్ పార్టీ గెలుపుకు పునాదులవుతాయని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మహబూబ్ నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ ఫంక్షన్ హాల్ లో చేరికల కమిటీ కన్వీనర్ సత్తూరు చంద్రకుమార్ గౌడ్, కో కన్వీనర్ మొహమ్మద్ సిరాజ్ ఖాద్రిల ఆధ్వర్యంలో హన్వాడ మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి చెల్లా వంశీచందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుత పార్లమెంట్ సభ్యులని తాము చెబితే కానీ ప్రజలకు తెలియదని ఎద్దేవ చేశారు. రాజకీయ స్వలాభం కోసం విలువలను తాకట్టు పెట్టి ఎన్నో పార్టీలను మార్చుకుంటూ విలువలను, వివేకాన్ని తాకట్టు పెట్టిన మరో బిజెపి అభ్యర్థి నమ్మక ద్రోహి డికె అరుణ అని అయన విమర్శించారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు డికె అరుణ అభ్యర్థిత్వాన్ని అంగీకరించలేని పరిస్థితులలో ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేస్తూ నైతిక ఓటమిని ఒప్పుకుంటున్నారని అయన ఆరోపించారు. రాజకీయ నిబద్ధత, క్రమశిక్షణ, విశ్వసనీయత, విలువల దారి తప్పి పాలమూరు ప్రజలను ఎప్పటినుండో మోసం చేస్తూన్నారని, మళ్ళీ మరోసారి మోసానికి తెరలేపి మొసలి కన్నీరుతో ప్రజల్ని మోసం చేసేందుకు డీకే అరుణ ప్రజల్లోకి వస్తున్నారని, ఆమె తల్లి బల్లి మాటలకు మోసపోవదని చల్లా వంశీచంద్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డికె అరుణకు కుటుంబ ఎదుగుదల స్వార్థ ప్రయోజనాలు తప్పా ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్టదాని, గిట్టదని అయన విమర్శించారు. ప్రజల కోసం పనిచేయరని ,ప్రజాబివృద్ధి కోసం ఆమె త్యాగాలు చేయరని సిద్ధాంతాలను గాలికి వదిలేసి నీతిమాలిన రాజకీయాలను చేస్తూ నిస్సిగ్గుగా గుర్తించిన పార్టీకి గంతలు కొట్టి అసెంబ్లీ ఎన్నికల్లో చీకటి ఒప్పందాలతో గద్వాల బిఅర్ఎస్ అభ్యర్థి స్వయాన మేనల్లుడు అయిన బండ్ల కృష్ణమోహన్ రెడ్డి నీ గెలిపించి అందలమెక్కించిన డికె అరుణ చరిత్రహీనురాలని అయన ఘాటుగా వ్యాఖ్యానించారు. నీతి ,నిజాయితీతో నమ్మిన సిద్ధాంతం కోసం పేద ప్రజల అభివృద్ధి కోసం సామాన్య నాయకుడిగా జీవిత ప్రస్థానం ప్రారంభించిన నాటి నుండి ఏనాడూ స్వార్థ ప్రయోజనాలకు తావివ్వకుండా పార్టీ కోసం, ప్రజల కోసం,కార్యకర్తల కోసం తాను పనిచేస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కొనసాగే ప్రజా పాలనకు అండగా నిలబడి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని అయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, చేరికల కమిటి కన్వీనర్ సత్తూరు చంద్రకుమార్ గౌడ్, కో కన్వీనర్ మహ్మద్ సిరాజ్ ఖాద్రీ, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, నాయకులు ఎన్ పి వెంకటేష్, హనీఫ్ అహ్మద్, మారేపల్లి సురేందర్ రెడ్డి, మైనారిటీ సెల్ చైర్మన్ ఫయాజ్, సుధాకర్ రెడ్డి, డిసిసి కార్యదర్శి కృష్ణయ్య, మహబూబ్ నగర్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహా రెడ్డి, హన్వాడ మండల అధ్యక్షులు మహేందర్ , లక్ష్మణ్ యాదవ్, అజ్మత్ అలి, పెద్ద విజయ్ కుమార్, నవనీత, వసంత, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్ నగర్ జిల్లాలో బిఆర్ఎస్‌కు మరో భారీ షాక్

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

మహబూబ్ నగర్ జిల్లాలో బిఆర్ఎస్ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. మహబూబ్ నగర్ జెడ్పి చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డితో పాటు పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం



హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి, మహబూబ్ నగర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇది ఒక సినిమా కాదు.. ఇది ఒక నిజ జీవిత కథ.. ఒక మగువ తలుచుకుంటే తన సంకల్పబలంతో ఏదైనా సాధించగలనని నిరూపించిన జ్యోతిరెడ్డి కథ. నిజ జీవిత కష్టాల కడలిని దాటిన వైనం.. దినసరి కూలి నుంచి సీఈవో వరకు ఆమె చేసిన పోరాటం అంతా ఇంతా కాదు.మైలవరం పల్లె నుంచి అమెరికా వరకు పోరాడిన తీరు.. రోజువారి కూలి పని చేసుకునే ఒక సాధారణ అమ్మాయి ప్రఖ్యాత సాఫ్ట్వేర్ కంపెనీ సీఈవోగా నిలబడిన తీరు మహిళలందరికీ ఆదర్శనీయం..

# ఇది కథ కాదు

## కూలీ నుంచి సీఈవో వరకు 'జ్యోతిరెడ్డి' ప్రయాణం

వరంగల్ జిల్లా దగ్గర నరసింహులగూడెంలో పుట్టింది, వెంకట్ రెడ్డి సరస్వతమ్మ దంపతుల 4వ సంతానము జ్యోతి రెడ్డి, తనకి ఒక అన్న ఇద్దరు తమ్ముళ్ళు ఒక చెల్లె, తల్లిదండ్రులకు ఈ ఐదుగురు పిల్లలను పెంచడం ఆర్థికపరంగా చాలా కష్టంగా ఉండేది, ఆడపిల్లల్ని ఇద్దరినీ ఉచితంగా ఎవరైనా చదివిస్తే బాగుండు అనే విధంగా తండ్రి అడుగులు వేయటం మొదలుపెట్టాడు. వరంగల్ దగ్గర హనుమకొండలో బాల సదన్ కేంద్రంలో చేర్పించాలని నిర్ణయం తీసుకున్నారు అందులో తల్లిదండ్రులు లేని పిల్లల కానీ తల్లి లేని పిల్లలకు కానీ మాత్రమే ఉచితంగా విద్య నేర్పబడటం మరియు వసతి కల్పించడం జరుగుతుంది. ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో తల్లి లేదు అని చెప్పి ఆడపిల్లలు ఇద్దర్ని కూడా చేర్పించడం జరిగింది.వాళ్ల చెల్లెలు కొన్ని ఆరోగ్య కారణాల వల్ల తిరిగి ఇంటికి వెళ్లిపోయారు తను మాత్రం పదవ తరగతి వరకు అక్కడే ఉండి చదువుక న్నారు కానీ తల్లిదండ్రులను మిస్ అవుతున్న అన్న బాధ తనకు ఎక్కువగా ఉండేది.తన తోటి విద్యార్థులు చూసి చలించిపోయి అందరి కష్టాలకు ఏదో ఒక సహాయం చేయాలి అని అప్పుడే నిర్ణయించుకొని తను డాక్టర్ కావాలను కున్నారు కానీ తన తండ్రి తనకు చిన్నతనంలోనే పదహారేళ్లకే వివాహం చేయడం జరిగింది.వివాహం అనంతరమైన తన జీవితం బంగారు బాటలో ఉంటుందని ఎన్నో కలలు కన్నారు కానీ తనకు మళ్ళీ కష్టాల కడలే ఎదురైంది,ఒకవైపు కుటుంబాన్ని చూసుకుంటూ మరోవైపు భర్తకు సహాయంగా పోలం పనులకు వెళ్లేవారు,వేరే వారికి కూలి పనికి కూడా వెళ్లేవారు.18 సంవత్సరాలు వచ్చేసరికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు ఇంకా తన మీద బరువు బాధ్యతలు ఎక్కువయ్యాయి. తను ప్రతి రోజు కూడా ఒకటే బాధ పడేవారు నా జీవితం అంతా ఇంతేనా నా జీవితంలోకి వెలుగు రాదా అని ఎదురు చూస్తూ ఒకా నొక పరిస్థితుల్లో జీవితం మీద విరక్తి కలిగేది, అప్పు డే తన జీవితంలో ఒక అద్భుతమైన అవకాశం వచ్చింది వాళ్ళ ఊరిలో రాత్రిపూట చదువు చెప్ప దానికి ఎవరైనా కావాలని ఒక ఆమె తన ఇంటికి వచ్చి అడిగి 10వ తరగతి పాస్ అయిన వాళ్ళు ఎవరైనా ఉన్నారని తనని అడిగింది. ఆ ఊరిలో పదవ తరగతి చదివిన వారు ఎవరూ లేకపోవడం వల్ల ఆ అవకాశం వెతుక్కుంటూ వచ్చింది. నెలకు 120 రూపాయల జీతానికి పనిచేయటం మొదలుపెట్టారు. తనకు అందిన మొదటి అవకాశాన్ని తను సద్వినియోగం చేసుకుంటూ వచ్చారు. ఒక సంవత్సరంలో అయిపోతుంది అనగా తనకి ఇం కొక అవకాశం వచ్చింది నేషనల్ సర్వీస్ వాలంటీర్గా రూ.195 జీతంతో మరల తనకు మరొక అవకాశం ఇచ్చింది. ఇప్పుడు వారు కుటుం బాన్ని హనుమకొండ కి మార్చడం జరిగింది. ఇంటి ఖర్చు లు కూడా పెరిగిపోయాయి, మరోపక్క తను టైపింగ్ నేర్చుకోవడం జరిగింది. మరోపక్క ఒకేషనల్ డిగ్రీ కూడా కంప్లీట్ చేశారు ఎన్ని కష్టాలు పడుతున్నా కానీ వెనుకంజ వేయకుం టడా ముందుకు సాగుతూనే ఉన్నారు. తనకు వచ్చిన జీతాన్ని చాలా జాగ్రత్తగా ఖర్చు పెట్టేవారు, టైలరిం గ్ కూడా చేయటం జరిగింది.రూ.398/- గవర్నమెంట్ జాబు రావడం జరిగింది. పిల్లలు పెరుగుతున్న కొద్దీ ఖర్చులు కూడా పెరుగుతున్నా దానికోసం తను ఇంటి వద్ద నుంచి తను ఉద్యోగం దగ్గరికి వెళ్లే మధ్యలో ఆ రైలులో కూడా చీరలు అమ్ముతూ డబ్బులు సంపాదిస్తూ ఇంటికి ఖర్చుల కోసం ఉపయోగించేవారు, కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ సీటు సంపాదించారు. ఇక తను జీవితంలో వెనక్కి తిరిగి చూసుకోకుండా ఏదో ఒక ఉద్యోగం చేస్తూ ఏదో ఒక సంపాదిస్తూ మన జీవిత గమనాన్ని విజయం వైపు అడుగులు వేస్తూ దూసుకుంటూ వెళ్లిపోయారు.రూ.5వేల నెలకు జీతం సంపాదించే స్థాయికి తను ఎదిగారు అక్కడితో ఆగారా లేదు. అదే సమయంలో తన బంధువు ఒక ఆమె అమెరికా నుంచి వచ్చారు తనతో కలిసి మాట్లాడుతూ నేను కూడా అమెరికా వస్తే అక్కడ ముందుకు వెళ్లగలనా అని సంశయంతో అడిగింది,అమెరికా వెళ్లాలన్న కోరికతో పిజిడిసిఐ నేర్చుకున్నారు పాస్పోర్ట్ కు అప్లై చేశారు,ఏదో ఒక విధంగా అయితే అమెరికా ఫ్లైట్ ఎక్కేశారు అమెరికా వెళ్ళిపోయారు ఇక మొదలయ్యాయి కష్టాల కడలి మళ్లీ మొదలైంది.





తెలియని ఆహారపు అలవాట్లు తెలియని భాష ఇక మళ్ళీ ఇబ్బందులు మొదలయ్యాయి,మాటలు పడటం అవమానాలు భరించడం మడి మొదలైంది. కృషితో నాస్తి దుర్భిక్షం కాదు కసితో నాసి దుర్భిక్షం అని తను నమ్మారు ,తను చేస్తున్న గవర్నమెంట్ ఉద్యోగానికి ఐదు సంవత్సరాలు లాంగ్ లీవ్ పెట్టి ఇద్దరు ఆడపిల్లల్ని హాస్టల్లో ఉంచి తన అమెరికా వెళ్లారు. కానీ ఇంగ్లీష్ రాకపోవటం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు, అవకాశాలు ఎన్ని ఉన్నా ఆదుకునే వారు లేకపోవడం వల్ల కూడా ఇబ్బంది ఎదుర్కొన్నారు. తను చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఇప్పుడు ఒక కంపెనీకి సీఈఓ స్థాయికి ఎదిగారు ఇద్దరు పిల్లలను అమెరికా తీసుకెళ్లి మంచి విద్యను అందించి పెళ్లిళ్లు చేసి వాళ్లు జీవితంలో స్థిరపడే విధంగా బాధ్యతలు నిర్వర్తించి ఇంకా ఏదో చేయాలి అన్న తపన ఇప్పుడు అనిపించింది తాను ఎన్ని రకాలుగా కష్టాలు బాలసదంలో అనుభవించాను అలాంటి కష్టాలు మరి ఎవరు అనుభవించవద్దు ప్రతి ఒక్కరికి సహాయం చేయాలి అన్న దిశగా అడుగులు వేస్తూ తన జీవితపైనాన్ని కష్టాల కడలి నుంచి విజయ పదం వరకు తీసుకువెళ్లారు జ్యోతి రెడ్డి గారు తన జీవితం ప్రతి ఒక్కరికి ప్రతి మహిళకి కూడా ఆదర్శప్రాయం.కష్టాలు అనేవి ప్రతి ఒక్కరికి ఉంటాయి కానీ వాటిని అధిగమించి సంకల్ప బలంతో ముందుకు వెళ్తేనే విజయ పదాన్ని చేరుకోగలమని నిరూపించారు. మార్చి 8 మహిళా దినోత్సవం సందర్భంగా జూన్ మీటింగ్ లో నేను తనని చూడడం జరిగింది తన నోటి వెంటనే తన జీవిత గాథ మొత్తాన్ని వినడం జరిగింది. విన్నంతసేపు కూడా మనసంతా బాధతో నిండిపోయి మనిషికి ఇన్ని కష్టాల అనిపించింది. వాటిని దాటి విజయపథంలో వెళ్లిన విధానం కూడా చాలా అద్భుతంగా ఉంది. తను ఏదో సాధించాలి అన్న సంకల్పబలం తను ఇంత సాధించడానికి కృషి చేసింది





వీరవెల్లి శ్రీలత, నేరేడుచర్ల

# ఇంటి వంట ముద్దు.. బయట ఫుడ్డు వద్దు

న్యూట్రిషన్, హెల్తీ ఫుడ్ కు ప్రాధాన్యం ఇవ్వండి • జంక్ ఫుడ్ తో అనర్థాలు అధికం

వంటల్లో మగవారు సాయపడాలి • కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

రెవెన్యూ గార్డెన్‌లో పురుషులకు వంటల పోటీలు • బహుమతుల అందజేత



**కరీంనగర్ బ్యూరో, మార్చి 20 (జనం సాక్షి) :** ఇంట్లోనే తయారు చేసుకున్న హెల్తీ, న్యూట్రిషన్ ఫుడ్ కు అందరూ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బయట దొరికే జంక్ ఫుడ్ ను తీసుకోవడం వల్ల అధిక అనర్థాలు ఉంటాయని తెలిపారు. బుధవారం కరీంనగర్ లోని రెవెన్యూ గార్డెన్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మగవారికి వంటల పోటీలు నిర్వహించారు. దీనికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై వంటకాలను రుచి చూశారు. మగవారు చాలా బాగా వంటలు చేశారని అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఫాస్ట్ గా లభించే ఫాస్ట్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవద్దని, వాటి వల్ల చాలా అనర్థాలు, ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. ఇంట్లోనే హెల్తీ ఫుడ్ న్యూట్రిషన్ ఫుడ్ ను తయారు చేసుకొని తినాలని సూచించారు. సంప్రదాయ వంటకాలపై అధిక దృష్టి సారించాలని, వాటితోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. మహిళలకు వంటల్లో మగవారు కొంత సాయం చేయాలని సూచించారు. మన ఆరోగ్యంలో మనం తీసుకున్న ఆహారమే కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మహిళలకు దీటుగా మగవారు వంటలు చేయడం నేర్చుకోవాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూమహిళలు పోషకాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని పేర్కొన్నారు. కూరగాయలు ఆకుకూరలతో పాటు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటూనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. వంటల పోటీల్లో కొత్తపెల్లి సెక్టార్ పరిధిలోని ఆసిఫ్ నగర్ - 4 అంగన్వాడీ సెంటర్ కు ప్రథమ బహుమతి లభించింది. సురేష్ వెన్నెల దంపతులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ, అంగన్వాడీ టీచర్ మెంగాని పద్మలకు జిల్లా కలెక్టర్ బహుమతి అందజేశారు. దీంతోపాటు పలువురికి జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్, అధికారులు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, డీఈవో జనార్దన్ రావు, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు, కరీంనగర్ రూరల్ సిడిపిఓ సబిత, అర్బన్ సిడిపిఓ లక్ష్మీనారాయణ, గంగాధర సిడిపిఓ కస్తూరి, అధికారులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజెపి పార్లమెంటు ఇంచార్జ్‌గా సంటి మహేష్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** భాజపా కరీంనగర్ పార్లమెంటు ఎస్సీ మోర్చా ఇన్చార్జిగా సంటి మహేష్ ను భాజపా రాష్ట్ర పార్టీ నియామకం చేసింది. సంటి మహేష్ ఇప్పటికే ఎస్సీ మోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా ఉంటున్న క్రమంలో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బాజపా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఆయనకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు.ఈ సంద ర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రానున్న కరీంనగర్ పార్లమెంటు ఎన్నికలలో బిజెపి జెండా ఎగురవేసే విధంగా పార్లమెంటు పరిధిలోని దళితులం దరినీ ఏకం చేసి బీజేపీ జెండా ఎగిరే విధంగా నా వంతు కృషి చేస్తానన్నారు.నా మీద నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత ఇచ్చిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్,ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్,రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, కాంతి కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెగుల మల్లికార్జున్ ధన్యవాదాలు తెలిపారు.



# బిజిగిర్ షరీఫ్ దర్గాలో ఘనంగా ఈటల జన్మదిన వేడుకలు

**జమ్మికుంట, మార్చి 20 (జనంసాక్షి):** జమ్మికుంట మండలం బిజీగిర్ షరీఫ్ గ్రామంలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి దర్గాలో మాజీ మంత్రి ఈటెల రాజేందర్ జన్మదిన వేడుకల సందర్భంగా బుధవారం రోజున దర్గాలోని సమాధులకు చాదర్లు సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేసిన జమ్మికుంట ముస్లిం మైనార్టీ నాయకులు,మత గురువు మౌలానా యాసీన్, మైనార్టీ నాయకుడు మహమ్మద్ నసిరుద్దీన్. ఈ సందర్భంగా నసీరుద్దీన్ మాట్లాడుతూ ఈటెల రాజేందర్ ఆయురారోగ్యాలతో ,సుఖ సంతోషాలత నిండు నూరేళ్లు జీవించాలని , రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో మల్కాజ్ గిరి నియోజకవర్గం నుండి భారీ మెజార్టీతో గెలవాలని దర్గాలో ప్రార్థించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మొహమ్మద్ నసిరుద్దీన్, మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ యాకూబ్, మొహమ్మద్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

'జనంసాక్షి' కథనానికి స్పందన

# పల్లెబాట పట్టిన అధికార యంత్రాంగం





విషజ్వరాలపై సర్వే, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ

**మంథని, (జనంసాక్షి) :** మంచానపడ్డ మంథని పల్లెలు, ప్రబలుతున్న విష జ్వరాలు, పట్టించుకోని అధికారులు, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయా లని గ్రామస్తుల డిమాండ్" అనే శీర్షికతో జనంసాక్షి లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించారు. ఇందులో భాగంగా బుధ వారం మంథని మండలంలోని లక్కే పూర్, కాకర్లపల్లి సూరయ్యపల్లి గ్రామాల్లో మంథని డివిజనల్ పంచాయతీ అధికారి శంకర్, మంథని మండల పంచాయతీ అధికారి హుస్సేన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికి తిరుగుతూ జ్వర సర్వే నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు.

# సొంతగూటికి తమిళిసై..

అధ్యక్షుడు అన్నామలై సమక్షంలో బుధవారం పార్టీ కండువా కప్పుకొన్నారు. గతంలో భాజపా తమిళనాడు రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసిన సంగతి తెలిసిందే.గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవిచూసిన తమిళిసై మరోసారి ఎన్నికల బరిలో నిలవనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రజా సేవ చేసేందుకే తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెట్టినట్లు చెప్పారు. త్వరలో భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తానని వెల్లడించారు. తమిళనాడులో కమలం వికసిస్తుందని పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలో తన ఉనికిని విస్తరించాలని భావిస్తున్న భాజపాకు.. తమిళిసై రాక కొత్త ఉత్సాహాన్నిస్తుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.తమిళిసై రాకను పార్టీ అధ్యక్షుడు అన్నామలై స్వాగతించారు. ఆమె పాలనా అనుభవం, ప్రజలకు సేవల చేయాలన్న తపనను కొనియాడారు. ఎన్డీయే ఈ సారి 400 సీట్లు సాధించి తీరుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. మరోవైపు తమిళిసై రాజీనామా నేపథ్యంలో గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రస్తుతం ఝార్ఖండ్ గవర్న ర్‌గా ఉన్న రాధాకృష్ణన్.. అదనంగా తెలంగాణ బాధ్యతలు స్వీకరించారు.

## ఎన్నికల వేళ 'ఉచితాల'పై విచారణకు సుప్రీం ఒకే..

విజ్ఞప్తిని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. 'ఇది ముఖ్యమైన అంశం. దీనిని రేపు బోర్డు ముందు ఉంచుతాం' అని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది.రాజకీయ పార్టీలు ఇచ్చే వాగ్దానాలపై చర్యలు తీసుకునేలా ఈసీని ఆదేశించాలంటూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే పథకాలపై రాజకీయ పార్టీలు ఇచ్చే అసంబద్ధ హామీలు ఓటర్లను ప్రభావితం చేస్తాయన్నారు. ఇవి నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగిస్తాయన్నారు. రాజకీయలబ్ధి పొందే ఉద్దేశంతో ఇచ్చే ఇటువంటి ప్రజాకర్షణీయ చర్యలు రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని, వీటిపై నిషేధం విధించాలని అందులో పేర్కొన్నారు. వీటిపై ఎన్నికల సంఘం తగు చర్యలు తీసుకునేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు.

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**ముత్తారం (జనంసాక్షి ):** రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్, ముత్తారం, ఓడేడ్ పోలింగ్ కేంద్రాలను బుధవారం రోజున మంథని సిఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్లోని పరిసరాలను పరిశీలించి ముత్తారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు,ఎస్ఐ మధుసూదన్ రావు కలిసి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పరిమితికి మించి నగదు తీసుకెళ్లరాదని, అదేవిధంగా సరైన సమాచారం లేకుండా ఇతర వస్తువులను కూడా తరలించరాదని అన్నారు. ఒకవేళ తీసుకెళ్తూ పట్టుబడితే సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా సోషల్ మీడియాలో ఒక వ్యక్తిగానీ, పార్టీలను గానీ విమర్శించుకుంటూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



యువత చెడు మార్గంలో వెళ్లకుండా, సన్మార్గంలో నడవాలని, దేశ పౌరులుగా ఎదగాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలై యువత భవిష్యత్ చిత్తు చేసుకోవద్దని, గంజాయి,మత్తుపదార్థాలపై సమాచారం ఉంటే పోలీసులకు అందించాలని సూ చించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని, తద్వారా సైబర్ మోసాలకు గురి కాకుం డా ఉండవచ్చని, సైబర్ నేరాల విషయంలో ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# గవర్నర్‌కు మంత్రి శ్రీధర్ బాబు శుభాకాంక్షలు

**మంథని,(జనంసాక్షి):** గవర్నర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాధా కృష్ణన్‌కుసీఎం రేవంత్ రెడ్డి తో పాటు మంత్రి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు పాల్గొని గవర్నర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.



# యుద్ధప్రాతిపదిన మరమ్మతులు

**12 గంటల్లో కరెంటు అందించినసెస్ డైరెక్టర్ అంజిరెడ్డి**



ముస్తాబాద్(జనంసాక్షి): మండల కేంద్రంలో వడగళ్ల వర్షం కారణంగా భారీ వృక్షం, విద్యుత్ స్తంభం కూలిన ప్రాంతాన్ని ముస్తాబాద్ లో నిన్న రాత్రి నుండి కరెంట్ లేకపోవడంతో దగ్గర ఉండి సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి సిబ్బందితో మరమ్మతులు చేయించి విద్యుత్‌సరఫరా పునరుద్దరించారు

# ఆదివరాహ స్వామి ఆలయానికి వితరణ

**మంథని(జనంసాక్షి) :** కమాన్ పూర్ మండల కేంద్రం లోని ఆది వరహాస్వామి దేవాలయానికి వన్ వరల్డ్ వన్ పీపుల్ వ్యవస్థాపకుడు రణవేన లక్ష్మీనారాయణ ప్లేట్స్, గ్లాసులు కిచెన్ స్టాండు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని అతని చేతుల మీదుగా ఆలయ ఈవో కాంత రెడ్డి కి అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గాండ్ల మోహన్ మాట్లాడుతూ.. దేవాలయానికి దాతలు విరాళాలు అందజేయాలని తద్వారా ఆలయ అభివృద్ధికి అందరు కృషి చేయాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో



కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, చందు, లక్ష్మి, కలువల సంతు, కోలేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో ఉంటాం.. ప్రజల కోసం పనిచేస్తాం

- మళ్లీ అధికారంలోకి వస్తాం
- నాడు నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చాం
- నీళ్లు లేక పొలాలు ఎండుతుంటే పట్టించుకోని ప్రభుత్వం
- పార్లమెంట్ ఎన్నికల్లో సమిష్టిగా పని చేసి పార్టీ అభ్యర్థిని గెలిపించాలి
- మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి





**హుజూర్ నగర్, మార్చి 20 (జనంసాక్షి):** ప్రజలతో ఉంటాం.. ప్రజల కోసమే పని చేస్తాం వారి మద్దతుతో మళ్ళీ అధికారంలోకి వస్తాం అని మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్ నగర్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్లో జరిగిన నియోజకవర్గ విస్తృతస్థాయి బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంటు అందించామన్నారు. నేడు రాష్ట్రంలో కరెంటు సమస్యలు ఎలా ఉన్నాయో రైతులు, ప్రజలు గమనించాలి అన్నారు. ఎడమ కాలువ ప్రాంతంలో నల్లగొండ జిల్లాలో రైతులు పొలాలు ఎండి ఆందోళన చెందుతుంటే ఇతర ప్రాంతాలకు సాగర్ నీళ్లు అందిస్తున్నారన్నారు. . నేడు రాష్ట్రంలో ఉన్న కరువు కన్నా పాలకులు సృష్టిస్తున్న కృత్రిమ కరువు ఎక్కువగా ఉందన్నారు. కాళేశ్వరం మూడు పిల్లర్లు కుంగితే భూతద్దంలో చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వంగా ఎద్దేవా చేశారు. పంటలు ఎక్కువగా పండితే రైతులకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందని ప్రభుత్వం ఆలోచిస్తుందని విమర్శించారు. 35 వేల కోట్ల ఆదాయం ఉన్న రైతుబంధు, రుణమాఫీ ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని రైతులకు సమాధానం చెప్పాలన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు నిలిపివేయాలని ఎన్నికల సమయంలో ఫిర్యాదు చేసి కోరిన నేతలు నేటి కాంగ్రెస్ పాలకులు అన్నారు. రైతులు, ఆటోడ్రైవర్లు ఇలా అనేక వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ వ్యతిరేకత మొదలైంది ప్రజలు మళ్లీ కెసిఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థికి గెలుపు కృషి చేయాలన్నారు. నియోజకవర్గంకు త్వరలో అందరూ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి పార్టీ ఇన్చార్జిని నియమించడం జరుగుతుందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ ఒకరిద్దరు నాయకులు పార్టీ వీడినంతమాత్రాన నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని జిల్లా, రాష్ట్ర నాయకత్వం ప్రతి ఒక్కరిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామన్నారు. నియోజకవర్గ ప్రజల చైతన్యం ఓట్ల రూపంలో రాబోయే ఎంపీ ఎన్నికల్లో చూపించాలన్నారు. సమర్థుడైన నేతని హుజూర్నగర్ పార్టీ ఇన్చార్జిగా నియమించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ముందుగా మాట్లాడిన పలు మండల పార్టీల నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి నియమించాలని, కార్యకర్తలకు రక్షణగా ఉండాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, జెడ్పిటిసిలు కొప్పుల సైదిరెడ్డి, జగన్ నాయక్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, నేరేడుచర్ల, పాలకీడు, గరిడేపల్లి, మఠంపల్లి, మేళ్లచెరువు పార్టీల అధ్యక్షులు అరి బండి సురేష్, అంజిరెడ్డి, కృష్ణ నాయక్, ఇరుగు పిచ్చయ్య, బసవయ్య, నాయకులు అప్పి రెడ్డి, చిన్నబోయిన సైదులు, కడియం వెంకట్ రెడ్డి, నర్సింగ్ వెంకటేశ్వర్లు, దొడ్డ నరసింహారావు, వేములూరి రంగాచారి, బెల్లంకొండ అమర్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎన్నికల సామాగ్రి రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

**దేవరకొండ, మార్చి, 21(జనంసాక్షి)** పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేయనున్న ఎన్నికల సామాగ్రి పంపిణీ మరియు రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన బుధవారం తనిఖీ చేశారు. దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న డిఆర్సి మరియు రిసెప్షన్ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో స్ట్రాంగ్ రూమ్ భద్రత, వాహనాల పార్కింగ్,సామర్థ్యం, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అంతేకాక కొండ భీమనపల్లి పరిధిలో ఉన్న అవుట్ డోర్ స్టేడియాన్ని సైతం ఆమె పరిశీలించారు. మైనాంపల్లి దగ్గర ఉన్న గిరిజన గురుకుల సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల హాస్టల్ క్యాంపస్ ను ఆకస్మికంగా తనిఖీ చేయడమే కాక, హాస్టల్ లో సౌకర్యాలు, లైబ్రరీ ,వంటశాల తదితర వాటిని తనిఖీ చేశారు. హాస్టల్ క్యాంపస్ ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఆర్డిఓ శ్రీరాములు, తహసిల్దార్ సంతోష్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి ఎంపీడీవో సుదర్శన్ తదితరులు ఉన్నారు.



## కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### గిరిజన గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఆకస్మిక తనిఖీ చేపట్టిన కలెక్టర్ హరి చందన దాసరి



**దేవరకొండ మార్చి 20 జనంసాక్షి** దేవరకొండ పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలకు నల్గొండ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆకస్మికంగా తనిఖీ చేసారు. మహిళా కళాశాలలో ఉన్నటువంటి గ్రంథాలయం, తరగతి గదులు మరియు వంట గదులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం తో పాటు నాణ్యమైన చదువు చెప్పాలని తెలిపారు .కళాశాల అధ్యాపక బృందం కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్యామల పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్

**ఖమ్మం బ్యూరో, మార్చి20(జనంసాక్షి) :** పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌళిక వసతుల కల్పన చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతాండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మద్దులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పొన్నెకల్ కేంద్ర ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి, పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో త్రాగునీరు, విద్యుత్, టాయిలెట్ తదితర అన్ని మౌళిక సదుపాయాలు వుండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేనిచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమున్నచోట పెయింటింగ్ వేయాలని, టాయిలెట్లలో రన్నింగ్ వాటర్ ఉండాలన్నారు. ఫ్యాన్లు, లైట్లు సరిపోను వుండేలా చర్యలు చేపట్టాలన్నారు. భద్రతాపరంగా చర్యలు తీసుకోవాలని, కాంపౌండ్ వాల్ లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే కాంపౌండ్ వాల్ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. స్వీప్ కార్యాచరణ లో భాగంగా కాంపౌండ్ గోడలపై ఓటరు అవగాహనకు సంబంధించి నినాదాలు వ్రాయించాలన్నారు. భద్రత పరంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల విధుల సిబ్బందికి వసతికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజలకు పాఠశాలను చూడగానే, ఇందులో పోలింగ్ కేంద్రం ఉన్నదనే ప్రత్యేకత కనిపించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, ఇఇ వెంకట్ రెడ్డి, విద్యాశాఖ ఇఇ నాగశేషు, ఖమ్మం రూరల్ ఎంపిడివో ఎస్. కుమార్, తహసీల్దార్ రాంప్రసాద్, మండల విద్యాధికారి శ్యాంసన్, అధికారులు తదితరులు ఉన్నారు.

# జిల్లా అంతటా పటిష్ట నిఘా - చెక్ పోస్టుల్లో నిఘా పెంచాలి

-జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ వెంకట్రావు



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అంతటా పటిష్ఠ నిఘా పెంచాలని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు అధికారులను ఆదేశించారు. జిల్లా అంతటా ఏర్పాటు చేసిన అన్ని చెక్ పోస్టులలో గట్టి నిఘా పెంచాలని అన్నారు. బుధవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే, జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత, అదనపు ఎస్పీ నాగేశ్వరవుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు డిజిటల్ లావాదేవీలపై,బ్యాంక్ లావాదేవీలు రూ.5 లక్షల నుండి 10 లక్షల వరకు జరిగే వాటిపై, పోస్టల్ శాఖ ద్వారా జరిగే లావాదేవీలపై గట్టి నిఘా ఉంచాలని, ప్రతిరోజు నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలలో స్వాధీనం చేసుకున్న వాటికి తప్పకుండా రశీదు అందజేయాలని తెలిపారు. ఎక్సైజ్ శాఖ టీమ్స్ నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. లిక్కర్ తో పాటు ఇతర మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకోవాలని అన్నారు. జిల్లాలో నల్లబెల్లం, బెల్టు షాపుల నిర్వహణ కట్టడి చేయాలని సూచించారు. జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న టీములు, పోలీస్, ఎక్సైజ్, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ శాఖ వారు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, ఎక్సైజ్ పర్యవేక్షకులు లక్ష్మనాయక్,డిఎఫ్ఓ సతీష్ కుమార్,ఇన్కమ్ టాక్స్ అధికారి, డిసిఓ,లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ ,ఎలక్షన్ విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేట హైవే రోడ్డు పనులను పరిశీలించిన

### జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

**ఖమ్మం రూరల్, మార్చి 20 (జనంసాక్షి) :** బుధవారం జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి, పెద్దతాండ, మద్దులపల్లి అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలు ఎంతమంది ఉన్నది, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నది అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో స్టోర్స్ ను తనిఖీ చేసి, సామాగ్రి నిలువను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం నుండి ఇస్తున్న గుడ్ల నాణ్యతను పరిశీలించారు. గుడ్ల బరువు ను తూకం వేయించారు. అగ్రిమెంట్ ప్రకారం గ్రుడ్ల బరువు వుండేలా చూడాలన్నారు. అనంతరం పొన్నెకల్ వద్ద పురోగతిలో ఉన్న ఖమ్మం సూర్యాపేట హైవే రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. రోడ్డు విస్తరణలో విద్యుత్ స్తంభాల పనులు పూర్తయినట్లు ఒకవైపు రోడ్డు పనులు కొనసాగుతున్నట్లు, నెలాఖరుకు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను, కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, రేడియం స్టిక్కర్లు ప్రదర్శించాలని అన్నారు. ఈ సందర్భంగా శిక్షణా సహాయ కలెక్టర్ యువరాజ్, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, నేషనల్ హైవే ఇఇ యుగంధర్ రావు, అధికారులు తదితరులు ఉన్నారు.

# మీడియా సెంటర్ ప్రారంభం

- ఎన్నికల సమాచారాన్ని మీడియాకు అందించాలి
- పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు..
- మీడియా సహకారం అందించాలి
- జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ వెంకట్రావు



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ని బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసీఎంసీ పనితీరుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలు వంటి వాటిని సకాలంలో ఆమోదిస్తూ, మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ ఛానెల్స్ లో వచ్చే వార్తలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్లు, టెలివిజన్ ఛానెల్లు, స్థానిక కేబుల్ నెట్వర్కులు, సోషల్ మీడియా, మూవీ హాస్లు,సంక్షిప్త సందేశాలు ఇతర ఆడియో వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసీఎంసీ నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. జిల్లాలో ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించేందుకు మీడియా సహకారం అవసరమని అన్నారు. అనంతరం ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, ప్రకటనలు ప్రసారం చేయవద్దని, అట్టి వారిపై చర్యలు తీసుకోబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బిఎస్.లత, ఏఎస్పీ నాగేశ్వర రావు, డీపీఆర్ఓ రమేష్ కుమార్, డిఇఈ మల్లేశం, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, జర్నలిస్టులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీరో అకౌంట్ ఓపెన్ చేసుకోవాలి

### తల్లాడ సీఎస్పీ నిర్వాహకురాలు నిర్మల

**తల్లాడ, మార్చి 20 (జనంసాక్షి):** తల్లాడ మండలంలో పదేళ్లు దాటిన చిన్నారులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచితంగా జీరో అకౌంట్ అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకురాలు సంఘసాని నిర్మల తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ అకౌంట్ కోసం పిల్లల ఆధార్ కార్డు, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, స్టడీ కండక్ట్ జిరాక్స్, రెండు పాస్ ఫోటోలు అందజేయాలని సూచించారు. 18 ఏళ్లు పైబడిన వారికి కూడా జీరో అకౌంట్ ఇస్తున్నామని, వారు కూడా ఆధార్ కార్డు, రెండు పాస్ ఫోటోలు తెచ్చుకోవాలని వివరించారు. వీటితోపాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి, ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ లు చేస్తున్నామని తెలిపారు. సురక్ష బీమాకు 20 రూపాయలు, జీవనజ్యోతికి 436 రూపాయలు చెల్లిస్తే వారికి రెండు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అదేవిధంగా సంవత్సరానికి 1000 కట్టుకుంటే ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే మరో 20 లక్షలు వచ్చే అవకాశం ఉందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.


# అటవీ భూమి హద్దులను పటిష్టంగా ఏర్పాటు చేయాలి : జిల్లా కలెక్టర్ వెంకట్రావు



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** అటవీ భూమి హద్దులను పటిష్టంగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ నందు జరిగిన జిల్లా స్థాయి అటవీ పరిరక్షణ కమిటీ సమావేశంలో అటవి పరిరక్షణ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ చింతలపాలెం రిజర్వ్ ఫారెస్ట్ లో ఉన్న డిస్-రిజర్వ్ చేయబడిన భూములను గుర్తించి వాటికి సరిహద్దులు నిర్ణయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అటవీ భూములకు హద్దులు లేకపోవడం వలన అటవీ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ అధికారులు అటవీ భూముల సంరక్షణపై తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్, రెవెన్యూ, సర్వే ,ఆటవి అధికారులతో సమావేశం నిర్వహించి అటవీ ,రెవెన్యూ ప్రాంతాలను గుర్తించి సరిహద్దులను నిర్ణయించాలని అన్నారు. ఈ సరిహద్దులను గుర్తించడం ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరించాలని సూచించారు. కృష్ణానదిలోని మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని ,అట్టి వారిపై తగు చర్యలు తీసుకోవాలని అటవీ, మైనింగ్, రోడ్డు రవాణా, రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. వారిపై అటవీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పన్నులు చెల్లించకుండా అనధికారికంగా నడిచే వాహనాలపై చర్యలు తీసుకోవాలని సూర్యాపేట ఆర్టీఓ సురేష్ రెడ్డిని ఆదేశించారు. జాన్ పహాడ్ దగ్గరలో ఉన్న పసుపు బోర్డు అడవి ప్రాంతంలో సాగర్ కాలువకు ఇరువైపులా ఉన్న అటవీ భూములలో సాగర్ నీటిని అక్రమంగా తరలించి అటవీ భూముల ఆక్రమణకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పోలీసుల అధికారుల సహకారంతో భూములను తిరిగి స్వాధీనం చేసుకొనుటకు చర్యలు తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ముందుగా కన్వీనర్, జిల్లా అటవీ అధికారి వి.సతీష్ కుమార్ జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతం, అడవుల సంరక్షణలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి వాటి యొక్క ఛాయాచిత్రాలను చూపిస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ బిఎస్.లత, ఏఎస్పీ నాగేశ్వరరావు, డిటిడబ్ల్యూఓ శంకర్, ఆర్టీవో సురేష్ రెడ్డి, జిల్లా మైనింగ్ అధికారి సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ సురేందర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తప్పుడు ధ్రువీకరణలతో 21లక్షల సిమ్‌కార్డులు

## రద్దుకు డీవోటీ చర్యలు..!



**దిల్లీ మార్చి 20 (జనం సాక్షి):**
దేశ వ్యాప్తంగా తప్పుడు ప్రూఫ్‌ల ఆధారంగా సుమారు 21 లక్షల సిమ్‌కార్డులు జారీ అయినట్లు తమ విశ్లేషణలో తేలిందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ తెలిపింది. ఈ మేరకు ఎయిర్‌టెల్, ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్ సంస్థలకు అలర్ట్ జారీ చేసినట్లు వెల్లడించింది. కొన్ని అనుమానాస్పద నంబర్ల జాబితాను విడుదల చేసి చేసి వాటి పత్రాలను తక్షణమే రీవెరిఫికేషన్ చేయాలని ఆదేశించినట్లు చెబుతోంది. ఒక వేళ అవి బోగస్ ప్రూఫ్‌లని తేలితే సిమ్‌లను రద్దు చేయాలని పేర్కొంది. సంచార్ సాతీ కార్యక్రమం కింద దేశ వ్యాప్తంగా 114 కోట్ల మొబైల్ కనెక్షన్లను డీవోటీకి చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డిజిటల్ ఇంటెలిజెన్స్ విభాగం విశ్లేషించింది. వీటిల్లో 21 లక్షల సిమ్‌కార్డులను యాక్టివేట్ చేసుకోవడానికి తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించినట్లు గుర్తించింది. వీటిలో చాలా సిమ్‌లను సైబర్ నేరాలకు వాడుతున్నట్లు అనుమానిస్తోంది. ఇవి నిరూపితమైతే ఆ సిమ్ కార్డును రద్దు చేయడంతోపాటు.. దానిని వినియోగించిన ఫోన్‌ను కూడా పనిచేయకుండా చేస్తామని ఏఐ అండ్ డీఐయూ డైరెక్టర్ జనరల్ ముఖేశ్ మంగళ్ వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 1.92 కోట్ల మంది తొమ్మిది సిమ్‌కార్డుల పరిమితికి మించి కనెక్షన్లు తీసుకొన్నారు. వీరిలో చాలా మంది సర్వీసు ప్రొవైడర్లకు ఇచ్చిన డేటాలో చాలా తప్పులున్నాయి. ప్రజలకు తెలియకుండా వారిపేరిట తీసుకొనే సిమ్‌కార్డులను గుర్తించి వాటిని రద్దు చేయించడానికి సంచార్ సాతీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నెంబర్లపై దర్యాప్తు సహా ఇతర చర్యలకు డీవోటీ ఇప్పటికే సర్వీసు ప్రొవైడర్లకు డెడ్‌లైన్ విధించింది. వీటిని పూర్తి చేసే క్రమంలో భారీ సంఖ్యలో సిమ్‌కార్డులు డిస్‌కనెక్ట్ అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇక ఈ మొత్తం ఆపరేషన్‌లో ఏఐ అండ్ డీఐయూ సంస్థ ఇతర చట్ట సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఇప్పటి వరకు 1.8లక్షల మొబైల్ హ్యాండ్‌సెట్లను పనిచేయకుండా చేశామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు తమిళనాడు డీజీపీ శంకర్ జివాల్ మాట్లాడుతూ 90శాతం సైబర్ నేరాలకు తప్పుడు సిమ్‌కార్డులనే వాడుతున్నట్లు పేర్కొన్నారు. పోలీసులు తమను ట్రాక్ చేయడానికి వీల్లేకుండా వారు వీటిని వినియోగిసున్నారన్నారు.

# జొమాటో కీలక ప్రకటన

## వెజ్ ఆర్డర్లూ ఎర్ర రంగు యూనిఫామ్‌లోనే..!




**దిల్లీ మార్చి 20 (జనం సాక్షి):**
శాకాహారం మాత్రమే కోరుకునే వారికోసం 'ప్యూర్ వెజ్ ఫ్లీట్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించిన కొన్ని గంటల్లోనే జొమాటో మరో కీలక ప్రకటన చేసింది. ఈ కొత్త సేవలను అందించే తమ డెలివరీ బాయ్స్ గ్రీన్ రంగు యూనిఫామ్ ధరిస్తారని తెలిపిన కంపెనీ తాజాగా ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఇకపై అందరూ ఎర్ర రంగు యూనిఫామ్‌లోనే కనిపిస్తారని తెలిపింది. అలా అని 'ప్యూర్ వెజ్ ఫ్లీట్' సేవలను నిలిపివేయడం లేదని స్పష్టం చేసింది. వెజ్ ఆర్డర్లను అందించడానికి ప్రత్యేక సిబ్బంది ఉంటారని తెలిపింది. మరోవైపు 'ప్రతికూల సామాజిక పరిణామాలు' ఎదురైతే 'ప్యూర్ వెజ్ ఫ్లీట్' వెంటనే నిలిపివేస్తామని సీఈఓ దీపిందర్ గోయల్ మంగళవారం రాత్రి వెల్లడించారు. ఆన్‌లైన్‌లో కొన్ని వర్గాల నుంచి విమర్శలు వచ్చిన నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సేవల వల్ల కొన్ని వర్గాలు రెగ్యులర్ జొమాటోను కూడా బహిష్కరించొచ్చనే ఆందోళనలకు గోయల్ చెక్ పెట్టే ప్రయత్నం చేశారు. ఈ పరిణామాల మధ్య తాజాగా యూనిఫామ్‌ను మాత్రమే మార్చుతున్నట్లు ప్రకటన రావడం గమనార్హం. ప్యూర్ వెజ్ ఫ్లీట్ వెనుక ఎలాంటి రాజకీయ, మతపరమైన ఉద్దేశాలు లేవని గోయల్ స్పష్టం చేశారు. 'ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. డెలివరీ బాక్సుల్లో ఆహార పదార్థాలు ఒలికిపోతుంటాయి. దీని వల్ల ముందు డెలివరీ చేసిన ఫుడ్ వాసన తర్వాత ఆర్డర్‌కు ఎంతోకొంత అంటుకుంటుంది. అందుకే ఫ్లీట్‌ను విభజించాల్సి వచ్చింది. కొంతమంది వారి మతం లేదా కులంతో సంబంధం లేకుండా మాంసాహారం వండని హోటళ్ల నుంచి మాత్రమే ఫుడ్ తెప్పించుకుంటుంటారు. వారిని దృష్టిలో ఉంచుకునే దీన్ని తీసుకొచ్చాం" అని గోయల్ వివరణ ఇచ్చారు. శాకాహారమే కోరుకునే వినియోగదారుల కోసం 'ప్యూర్ వెజ్ ఫ్లీట్' పేరుతో ప్రత్యేక సేవలను ప్రారంభిస్తున్నట్లు గోయల్ మంగళవారం మధ్యాహ్నం ప్రకటించారు. శాకాహారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకే ఈ సేవను తీసుకొస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే భారత్‌లోనే అత్యధిక శాతం శాకాహారులు ఉన్నారని వెల్లడించారు. ఆహారం వండే విధానం, దాన్ని నిర్వహించడంపై వారు ఒక స్పష్టమైన అభిప్రాయంతో ఉంటారని అన్నారు. కేవలం శాకాహారమే అందించే రెస్టారంట్ల ఎంపిక, నాన్-వెజ్ ఆహారాన్ని మినహాయించడం వంటివి ప్యూర్ వెజ్ మోడ్‌లో ఉంటాయని తెలిపారు. ప్యూర్ వెజ్ ఫ్లీట్ ఆహారాన్ని డెలివరీ చేసేందుకు జొమాటో సాధారణంగా వినియోగించే ఎర్ర బాక్సుల స్థానంలో ఆకుపచ్చ డెలివరీ బాక్స్‌లను వినియోగించనుంది. అయితే, ఈ కొత్త సేవలపై ఆన్‌లైన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీంతో యూనిఫామ్ విషయంలో మార్పులు చేసింది.

# త్వరలో వాట్సప్ స్టేటస్‌లో నిమిషం వీడియో!

**దిల్లీ మార్చి 20 (జనం సాక్షి):**
వాట్సప్ స్టేటస్‌లో ప్రస్తుతం గరిష్ఠంగా 30 సెకన్ల నిడివి గల వీడియోలను మాత్రమే పోస్ట్ చేసేందుకు అవకాశం ఉంది. అంతకంటే పెద్ద వీడియోలను అప్‌లోడ్ చేయాలంటే మరో స్టేటస్ అప్‌డేట్ తప్పదు. అలా వీడియో నిడివి పెరుగుతున్న కొద్దీ స్టేటస్ అప్‌డేట్ల సంఖ్య పెరుగుతూ పోతుంది. దీన్ని పరిష్కరించేందుకు వాట్సప్ సిద్ధమైంది! ఇకపై 60 సెకన్ల నిడివితో ఉన్న వీడియోలను సైతం స్టేటస్‌లో అప్‌లోడ్ చేసే అవకాశాన్ని వాట్సప్ ఇవ్వబోతు న్నట్లు సమాచారం. ఇప్పటికే దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. కొంత మంది బీటా యూజర్లకు ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వాబీటా వెల్లడించింది. బీటా వెర్షన్ 2.24.7.3 డౌన్‌లోడ్ చేసుకున్నవారికి ఈ ఫీచర్ దశలవారీగా అందుబాటులోకి వస్తోంది. త్వరలో మిగిలిన యూజర్లందరికీ ఇది అందుబాటులోకి రానుంది. మరోవైపు పేమెంట్స్‌ను సైతం వాట్సప్ మరింత సులభతరం చేస్తోంది. ప్రస్తుతం వాట్సప్‌లో చెల్లింపులు చేయాలంటే త్రీ డాట్స్ మెనూలో పేమెంట్స్‌లోకి వెళ్లాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం లేకుండా మనం ఎంచుకున్న కాంటాక్ట్ చాట్‌లోనే పై భాగంలో క్యూఆర్ కోడ్ సింబల్ ఉంటుంది. దానిపై క్లిక్ చేసి పేమెంట్ చేయొచ్చు. ఇది కూడా ప్రస్తుతం బీటా యూజర్లకు అందుబాటులో ఉంది.







# లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

## నిఫ్టీ ఏ 21,880

**ముంబయి మార్చి 20 (జనం సాక్షి):**
అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాల మధ్య దేశీయ స్టాక్ సూచీలు బుధవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:22 గంటల సమయంలో సెన్సెక్స్ 168 పాయింట్ల పుంజుకొని 72,180 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 69 పాయింట్లు పెరిగి 21,887 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.02 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో మారుతీ, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, పవర్ గ్రిడ్, టీసీఎస్, టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎం అండ్ ఎం, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, టైటన్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా మార్కెట్లు మంగళవారం లాభాలతో ముగిశాయి. నేడు ఆసియా- పసిఫిక్ ప్రధాన సూచీలు సానుకూలంగా ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 87.24 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. 'విదేశీ సంస్థాగత మదుపర్లు' మంగళవారం నికరంగా రూ.1,421.48 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. 'దేశీయ సంస్థాగత మదుపర్లు' రూ.7,449.48 కోట్ల స్టాక్స్‌ను కొన్నారు.

# ఏఐ నైపుణ్యాలుంటే..భలే జీతం!




**దిల్లీ మార్చి 20 (జనం సాక్షి):**
కృత్రిమమేధ నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులు భారీ జీతాలు అందుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తాజా సర్వేలో వెల్లడైంది. భారత్‌లో ఏఐ స్కిల్స్ ఉన్నవారికి 54 శాతం కంటే ఎక్కువ జీతం పెరిగే వీలుందని ఉందని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) నిర్వహించిన పరిశోధనలో తేలింది. ఐటీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెక్టార్లలో పని చేసేవారికి మరింత మేలు చేకూరుతుందని పేర్కొంది. 2028 నాటికి దేశంలోని 99 శాతం మంది యజమానులు తమ కంపెనీలను ఏఐ ఆధారిత సంస్థలుగా మార్చే అవకాశం ఉందని ఏడబ్ల్యూఎస్ తన నివేదికలో పేర్కొంది. తద్వారా సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవచ్చని వారు భావిస్తున్నట్లు తెలిపింది. ప్రధానంగా ఐటీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, సేల్స్ అండ్ మార్కెటింగ్, వ్యాపార నిర్వహణ, మానవ వనరుల విభాగాల్లో ఏఐ సేవలు వినియోగించుకునేందుకు యజమానులు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. రాబోయే ఐదేళ్లలో 98శాతం మంది యజమానులు జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలను తీసుకొచ్చేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఏడబ్ల్యూఎస్ తేల్చింది. పరిశోధనలో భాగంగా అమెజాన్ అనుబంధ సంస్థ అయిన ఏడబ్ల్యూఎస్ 1,600 మంది కార్మికులు, 500 సంస్థల యజమానులపై సర్వే నిర్వహించి నివేదిక రూపొందించింది. ఏఐ నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులనే నియమించుకునేందుకు సంస్థలు మొగ్గు చూపుతున్నట్లు నివేదిక పేర్కొంది. అయితే, 79 శాతం మంది యజమానులకు అది సాధ్యపడటం లేదని, దీనికి ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యావేత్తల సహకారం అవసరమని తెలిపింది. భారత్‌లో కృత్రిమ మేధను మరింత అభివృద్ధి చేసి క్షేత్ర స్థాయిలో వినియోగించుకునేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్న ఏడబ్ల్యూఎస్.. ఏఐ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు 95 శాతం మంది ఉద్యోగులు ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించింది. మరోవైపు విప్రో, ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్, ఐరిస్ సాఫ్ట్‌వేర్ తదితర సంస్థల ఉద్యోగులకు ఆయా రంగాల్లో ఏఐ ఆధారిత శిక్షణ ఇచ్చి, వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు తాము సహకరిస్తున్నట్లు ఏడబ్ల్యూఎస్- ఇండియా అధిపతి అమిత్ మెహతా వెల్లడించారు.

# యూకే మార్కెట్లోకి డాక్టర్ రెడ్డీస్ కేన్సర్ ఔషధం

**హైదరాబాద్ మార్చి 20 (జనం సాక్షి):**
డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ బెవాసిజుమ్యాబ్ అనే మందును యూకే మార్కెట్లో విడుదల చేసింది. వెర్సావో బ్రాండుతో దీన్ని ఆవిష్కరించినట్లు డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. రోష్ అనే స్విస్ కంపెనీకి చెందిన 'అవాస్టిన్' బ్రాండుకు ఇది బయోసిమిలర్ ఔషధం. పునరావృతం అయ్యే గ్లియోబ్లాస్టోమా, మెటాస్టాటిక్ కొలొరెక్టర్ కేన్సర్, నాన్- స్క్వామస్ నాన్ - స్మాల్ సెల్ లంగ్ కేన్సర్, రీనల్ సెల్ కార్సినోమా, అడ్వాన్స్‌డ్ సర్వైకల్ కేన్సర్, ఒవేరియన్ కేన్సర్, మెటాస్టాటిక్ బ్రెస్ట్ కేన్సర్ చికిత్సలో దీన్ని వినియోగిస్తున్నారు. యూకేలో డాక్టర్ రెడ్డీస్ విడుదల చేసిన తొలి బయోసిమిలర్ ఔషధం ఇదే. దీన్ని 100 ఎంజీ, 400 ఎంజీ సింగిల్ యూజ్ వయల్ డోసులో అందిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ మందును 2019లో మనదేశంలో విడుదల చేసిన సంస్థ, తదుపరి థాయ్‌ల్యాండ్, ఉక్రెయిన్, నేపాల్, జమైకా దేశాల్లోనూ అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు యూకే మార్కెట్లో అందుబాటులోకి తేవడం ద్వారా అత్యున్నత ప్రమాణాలతో బయోసిమిలర్ ఔషధాలు ఉత్పత్తి చేసి అందించగలమని రుజువు చేసుకున్నట్లు డాక్టర్ రెడ్డీస్ గ్లోబల్ హెడ్ (బయోలాజిక్స్) జయంత్ శ్రీధర్ వివరించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా మరికొన్ని బయోలాజికల్ ఔషధాలు త్వరలో ఆవిష్కరిస్తామని అన్నారు.



**ప్రత్యర్థుల ఫోన్లు అక్రమంగా వినడం న్యాయమా?**

**బొండా ఉమా**

**అమరావతి మార్చి 20 (జనం సాక్షి):**
వైకాపా ఘోరంగా ఓడిపోతుందని తెలిసే అరాచకాలకు పాల్పడుతోందని తెదేపా నేత, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా విమర్శించారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యర్థుల ఫోన్లు అక్రమంగా వినడం న్యాయమా?అని ప్రశ్నించారు. జగన్, పెద్దిరెడ్డి, సజ్జల ఆదేశాలు పాటించే ఇదంతా చేస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వం నిరంతరం ట్యాపింగ్ చేస్తోందని.. తమతో పాటు అధికారుల ఫోనపైనా నిఘా ఉంచారని ఆరోపించారు. మంత్రులు ఇచ్చిన స్టేట్‌మెంట్లే ఇందుకు నిదర్శనమ న్నారు. దీనిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఎన్నికల్లో కుట్రలు, కుతంత్రాలతో గెలవాలని వైకాపా చూస్తోందన్నారు. ఆ పార్టీ అరాచకాలపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బొండా ఉమా డిమాండ్ చేశారు.

# అత్యంత సంతోషకరమైన దేశాలివే

## భారత్‌ది ఎన్నో స్థానమంటే..?



**న్యూయార్క్ మార్చి 20 (జనం సాక్షి):**
ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశాల్లో ఫిన్లాండ్ మరోసారి అగ్రభాగాన నిలిచింది. ఏడు దఫాలుగా అదే స్థానంలో కొనసాగుతుండడం విశేషం.'అంతర్జాతీయ ఆనంద దినోత్సవ'మైన బుధవారం (మార్చి 20న) యూఎన్ ఆధారిత సంస్థ తాజా ర్యాంకులను విడుదల చేసింది. ప్రపంచంలోని 143కి పైగా దేశాల ప్రజల మనోభావాలను తెలుసుకుని దీన్ని రూపొందించారు. సంతోష సూచీల్లో నార్డిక్ దేశాలైన ఫిన్లాండ్(1), డెన్మార్క్(2), ఐస్‌లాండ్(3) వరుసగా తొలి మూడు ర్యాంకులను దక్కించుకున్నాయి. ఈ జాబితాలో భారత్ 126వ స్థానంలో నిలిచింది. చైనా (60), నేపాల్ (93), పాకిస్థాన్ (108), మయన్మార్(118) దేశాలు ఈ విషయంలో మనకన్నా మెరుగైన స్థితిలో ఉన్నాయని నివేదిక పేర్కొంది. తాలిబన్ల పాలనలోకి వెళ్లిన తర్వాత తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్న అఫ్గానిస్థాన్ ఈ జాబితాలో అట్టడుగున నిలిచింది. ఆత్మ సంతృప్తి, తలసరి జీడీపీ, సామాజిక మద్దతు, జీవన కాలం, స్వేచ్ఛ, దాతృత్వం, అవినీతి వంటి అంశాల ఆధారంగా ఈ జాబితాను రూపొందిస్తారు. దాదాపు దశాబ్దకాలంలో అమెరికా, జర్మనీ మొదటిసారిగా తొలి 20 స్థానాల నుంచి ఈ ఏడాది కిందకు దిగజారాయి. కోస్టారికా, కువైట్ తొలిసారి టాప్-20లోకి చేరాయి. వరుసగా 12, 13 స్థానాలు దక్కించుకున్నాయి. తొలి పది దేశాల్లో పెద్ద దేశమేదీ లేదని నివేదిక తెలిపింది. తొలి పదింటిలో 1.5 కోట్ల కంటే ఎక్కువ జనాభా కలిగినవి నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా మాత్రమే. టాప్-20లో కెనడా, యూకే మాత్రమే మూడు కోట్ల కంటే అధిక జనాభా ఉన్న దేశాలు. 2006-10 నుంచి అఫ్గానిస్థాన్, లెబనాన్, జోర్డాన్ ప్రజలు సంతోషాన్ని గణనీయంగా కోల్పోయినట్లు నివేదిక తెలిపింది. సెర్బియా, బల్గేరియా, లాత్వియా వంటి దేశాల్లో పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. పెద్ద వారితో పోలిస్తే తక్కువ వయసు వారే ఆనందంగా ఉన్నట్లు ఈ ఏడాది నివేదిక పేర్కొంది. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఇది ఒకేరకంగా లేదని తెలిపింది. ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో 30 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారిలో సంతోషం గణనీయంగా తగ్గింది. అక్కడి పెద్దలే ఆనందంగా ఉన్నట్లు తేలింది. మధ్య, తూర్పు ఐరోపాలో మాత్రం అన్ని వయసులవారిలో సంతోషం పెరిగినట్లు వెల్లడించింది. పశ్చిమ ఐరోపాలో అందరూ ఒకేరకమైన ఆనంద స్థాయులను అనుభవిస్తున్నట్లు తేలింది. సంతోషకర స్థాయిలో అసమానత ఒక్క ఐరోపా మినహా ప్రపంచవ్యాప్తంగా పెరిగిందని.. ఇది ఆందోళన కలిగించే విషయమని నివేదిక అభిప్రాయపడింది.







# ప్రిన్స్ హ్యారీపై చర్యలు తీసుకొంటా: ట్రంప్

**ముంబయి మార్చి 20 (జనం సాక్షి):**
తాను అధికారంలోకి వస్తే బ్రిటన్ రాజకుటుంబానికి చెందిన ప్రిన్స్ హ్యారీపై అవసరమైతే తగిన చర్యలు తీసుకొంటానని రిపబ్లికన్ అభ్యర్థిత్వ రేసులో ఉన్న ట్రంప్ పేర్కొన్నారు. ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా వీసా పొందే సమయంలో సదరు దరఖాస్తుదారుకి గతంలో మాదక ద్రవ్యాలు వినియోగించిన చరిత్ర ఉంటే వెల్లడించాలి. ఆ సమాచారం ఆధారంగానే వీసా ఇచ్చేది లేనిది నిర్ణయించే అవకాశం ఉంటుంది. ఎవరైనా ఈ విషయంలో తప్పుడు సమాచారం ఇస్తే.. వారికి భారీగా జరిమానా విధించడం లేదా తిరిగి వెనక్కి పంపే అధికారం అమెరికాకు ఉంటుంది. ప్రిన్స్ హ్యారీ 2020 నుంచి అమెరికాలోని కాలిఫోర్నియాలో నివాసం ఉంటున్నాడు. అతడు స్పేర్ అనే పుస్తకం రాశాడు. గతంలో మాదక ద్రవ్యాలు వాడినట్లు దానిలో పేర్కొన్నాడు. ఈ అంశంపై హెరిటేజ్ ఫౌండేషన్ అనే సంస్థ అతడి ఇమ్మిగ్రేషన్ రికార్డులు చూపించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ ప్రిన్స్ హ్యారీ వీసా దరఖాస్తును కోర్టులో ఇవ్వాలని పేర్కొన్నారు. తాజాగా ఈ అంశం వివాదాస్పదంగా మారింది. బ్రిటన్‌కు చెందిన జీబీ న్యూస్ అనే సంస్థ ఈ అంశాన్ని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వద్ద ప్రస్తావిస్తూ.. ఒక వేళ మీరు ఎన్నికల్లో గెలిస్తే ప్రిన్స్‌కి ఏమైన ప్రత్యక రక్షణ లభిస్తుందా..?అని అడిగారు. దీనికి ట్రంప్ స్పందిస్తూ.. "అతడికి అసలు డ్రగ్స్ వ్యవహారంతో సంబంధం ఉందో లేదో చూడాలి. అతడు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే తగిన చర్యలు తీసుకొంటాం" అని పేర్కొన్నారు. కచ్చితంగా ఆ చర్యలు ఏమిటనేది మాత్రం వెల్లడించలేదు. అతడిని అమెరికా నుంచి వెనక్కి పంపించే విషయాన్ని స్పష్టంగా చెప్పలేదు. మేఘన్ మార్కెల్‌ను 2018లో ప్రిన్స్ హ్యారీ పెళ్లి చేసుకొన్నారు. ఆ తర్వాత రాచరికపుహోదాను వదులుకొని ఈ జంట అమెరికాకు వెళ్లిపోయింది. ఆ తర్వాత చాలా అరుదుగా మాత్రమే బ్రిటన్‌కు వెళ్లేవారు. వీరి పిల్లలను మాత్రం రాజకుటుంబ వారసులుగా బకింగ్‌హామ్ ప్యాలెస్ గుర్తించింది.

# చైనా విషయంలో ఆయన హెచ్చరికలను నెహ్రూ పట్టించుకోలేదు: జైశంకర్



**దిల్లీ మార్చి 20 (జనం సాక్షి):**
భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చైనాపై ఉదాసీన వైఖరితో వ్యవహరించే వారని కేంద్ర మంత్రి జైశంకర్ అన్నారు. చైనా విషయంలో నెహ్రూను పలుమార్లు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ హెచ్చరించారని తెలిపారు. బుధవారం ఒక జాతీయ వార్తా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైనా, అమెరికాలతో సంబంధాలు, భారత్ విదేశాంగ వైఖరిపై మాట్లాడారు. 'చైనా విషయంలో మాజీ ప్రధాని నెహ్రూ అవలంబించిన విదేశాంగ విధానం బుడగతో సమానం. ఆయనకు అమెరికా అంటే కోపం. అందుకే భారత్‌కు చైనా గొప్ప మిత్ర దేశమన్నారు. అప్పట్లో అందరూ దాన్నే నమ్మారు. ఇప్పటికీ కొంతమంది అదే మాట చెబుతున్నారు. కానీ, చైనా స్నేహాన్ని ఉదాసీన వైఖరితో చూడొద్దని నెహ్రూను పటేల్ ఎన్నోసార్లు హెచ్చరించారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాకిస్థాన్, చైనా వ్యవహారాలపై అప్పటి మంత్రులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పటేల్‌లు ఆందోళన వ్యక్తంచేసినా నెహ్రూ సరైన దృష్టి సారించలేదు. హిమాలయాల మీదుగా ఆక్రమణకు ప్రయత్నిస్తారని అనుకోవడం లేదని చెప్పారు. కానీ, 1962లో చైనా ఆ దుశ్చర్యకు పాల్పడింది. 1950లో అమెరికాకు భారత్ దూరం కావడానికి చైనానే కారణం. దీనిపై నెహ్రూని అప్పటి న్యాయశాఖ మంత్రి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రశ్నించారు. ఈ విషయాలేవీ ఇప్పటితరం వారికి తెలియవు. నెహ్రూ విదేశాంగ విధానాలనే తర్వాత వచ్చిన పాలకులు అనుసరించారు. ఒకవేళ దానికి భిన్నంగా వ్యవహరిస్తే దాన్ని పెద్ద తప్పుగా ప్రచారం చేస్తున్నారు. కంపెనీల్లో ఆడిట్ వ్యవస్థ ఉన్నట్లే దేశాలు అనుసరిస్తున్న విధానాలకు ఆడిట్ ఉండాలి" అని జైశంకర్ పేర్కొన్నారు.



## సౌర విద్యుత్ కేంద్రం పనులను త్వరగతిన పూర్తి చేయండి

### జీ.ఎం(సోలార్)

**రామగిరి, మార్చి 20, (జనంసాక్షి) :**
రామగుండం-3 ఏరియాలోని ఓసిపి-1 ఉపరితల గని ఓ.బి డంపు పై నూతనంగా ఏర్పాటు చేస్తున్న 22 మెగావాట్ల సౌర విద్యుత్తు కేంద్రము అభివృద్ధి పనులను త్వరత గతిన పూర్తి చేయాలని జీ.ఎం. సోలార్ జానకిరామ్ అన్నారు.బుధ వారము ఆయన జీఎం కార్యాలయం నందు ఆర్.జీ -3 జీ.ఎం సుధాకర రావు, ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా లతోపాటు సంబంధిత అధికారులతో, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న 22 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం పనులు మే 15 తారీకు వరకు పూర్తి అయ్యే విధంగా తగిన ప్రణాళికలను, చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డి. జీ.ఎం శ్రీనివాస్,ఎస్. ఇ శ్రీనివాస్ రెడ్డి లతోపాటు సోలార్ కాంట్రాక్టు ఉద్యోగులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి ఓసి-3 ఈపి ఆపరేటర్లు ..



**గోదావరిఖని, మార్చి 20, (జనంసాక్షి) :**
సింగరేణి ఆర్జీ-2 పరిధి ఓసీపీ-3లో పనిచేసే ఈపి ఆపరేటర్లు బుధవారం రామగుండం కాంగ్రెస్‌లో చేరారు.నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో.. ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ దంపతులు..



**గోదావరిఖని, మార్చి 20, (జనంసాక్షి) :**
సింగరేణి సెక్టర్-2 ఆలయ కమిటీ, న్యూఫిల్టర్ బెడ్‌సివిల్ డిపార్ట్మెంట్ ఆర్జీ-1 సింగరేణి ఉద్యోగుల ఆహ్వానం మేరకు శ్రీదుర్గామాత అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్-మనాలి రాజ్‌ఠాగూర్ దంపతులు హాజరయ్యారు.ఆలయ కమిటీ నిర్వాహకులు సాదరంగా స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఆలయ కమిటి సన్మానించింది. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ కార్మికులకు అమ్మవారు ఆయురారోగ్యాలతో పాటు సుఖసంతోషాలు, విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందికలగకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులతో పాటు సింగరేణి యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మీరు గానీ విజిలేస్తే.. మడతెట్టేస్తారు!

**• అందుబాటులో 'సి విజిల్' యాప్ • ఇలా 100 నిమిషాల్లో ఫిర్యాదును పరిష్కరిస్తారు**



**ఖమ్మం బ్యూరో,మార్చి 20 (జనంసాక్షి):**
రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశా నిర్దేశం చేసే..సార్వత్రిక ఎన్నికల(2024)కు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) అమల్లోకి వచ్చేసింది. ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఈ నేపథ్యంలో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వాములను చేస్తోంది. 'సి విజిల్' యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. దాని గురించి తెలుసుకుని, నిబంధనలు ఉల్లంఘించే వారి పని పట్టండిలా..

**అసలు.. ఏంటిది..?**
ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ 'సి విజిల్' యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

**రిజిస్టర్ చేసుకోండిలా..**
ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారి 'సి విజిల్' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ చరవాణి నంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోవాలి. ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే 'సి విజిల్' యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

**ఎలాంటివి చేయవచ్చంటే...**
ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైనైనా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయండి.

**ఎలా చేయాలంటే...**
మీ యాప్ తెరవగానే తెరపై 'ఫొటో', 'వీడియో', 'ఆడియో' అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. మీరు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడ్ చేయండి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

**5 నిమిషాల్లో రంగంలోకి అధికారులు**
యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి 5 నిమిషాల్లో.. దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి, 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సి విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.

**అడ్డుకట్ట వేయండి..**
తాయిలాలు పంచి, అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమ గీతం పాడొచ్చు. ఈ రోజే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని.. ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయండి. అక్రమాలకు అడ్డుకట్ట వేయండి. మీ పిల్లలు, రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం.. మీ వంతు బాధ్యతను నిర్వర్తించండి.

## జెఎన్టియులో బి-జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం..



**రామగిరి, మార్చి 20, (జనంసాక్షి) :**
మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న బి-జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్లో కరీంనగర్‌కు చెందిన వాగేశ్వరి జట్టు సెమిఫైనల్‌కు చేరుకుంది.లీగ్ ఆడిన రెండు మ్యాచ్‌ను గెలుపొంది మంథని జట్టుతో జరిగే సెమీఫైనల్కు అర్హత సాధించింది.బుధవారం జరిగిన మొదటి మ్యాచ్లో జెఎన్టీయు కొండగట్టు జట్టు వరంగలుకు చెందిన జయముఖి జట్టుపై గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన కొండగట్టు జట్టు 5 వికెట్లు కోల్పోయి 195 పరుగులు చేసింది. మహ్మద్ నోమా 48, అఖిల్ 52 పరుగులు చేయగా అరుణ్ రెండు వికెట్లు తీశారు.అనంతరం 7వికెట్లకు 147 పరుగులు చేసింది. రాకేశ్ 52 పరుగులు చేయగా కన్నయ్య రెండు వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా నోమాన్ ఎంపికయ్యాడు.రెండవ మ్యాచ్లో కరీంనగర్కు చెందిన వాగేశ్వరి కళాశాల జట్టు 41 పరుగుల తేడాతో జయముఖిపై నెగ్గింది. వాగేశ్వరి 6 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసింది. వంశీ 64, నదీర్ 64 పరుగులు చేయగా రాకేశ్ రెండు వికెట్లు తీశారు. జయముఖి 149 పరుగులు చేసింది. రాకేశ్ 34, అరుణ్ 24 పరుగులు చేయగా జగదీశ్, నదీర్, ఉదయ్, మణిరూత్లు చెరో రెండు వికెట్లు తీశారు.నదీర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్గా ఎంపికయ్యాడు.మూడవ మ్యాచ్లో వాగేశ్వరి జట్టు కొండగట్టు జట్టుపై పరుగల తేడాతో గెలిచింది.మొదట బ్యాటింగ్ చేసిన కొండగట్టు జట్టు 8 వికెట్లకు 120 పరుగులు చేసింది.సాయికిరణ్ 24 పరుగులు చేయగా మణిరూత్ 4, నదీర్ 2 వికెట్లు తీశారు. కేవలం రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. శివమణి 42, వంశీ 51 పరుగుల చేశారు.మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్గా మణిచంద్ ఎంపికయ్యాడు.బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి సింగరేణి సంస్థ ఆర్జి-3 ఏరియా సివిల్ డిజిఎం పద్మరాజు ముఖ్యఅతిథిగా హాజరై మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందించారు.కార్యక్రమంలో సిఎస్ఇ విభాగ అధిపతి రామ్నరేశ్, డిఇఇ సతీష్, ఆఫీసు సూపరింటెండ్ రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, సునీల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## డీసీసీబీ చైర్మన్ పదవి తుపాకుల యలగొండస్వామికి ఇవ్వాలి

### జిల్లాలలో సామాజిక న్యాయం చేయాలి..



**ముదిగొండ ,మార్చి 20 (జనంసాక్షి):**
ముదిగొండ సొసైటీ చైర్మన్ గా మండలంలో రైతులకు సేవలందిస్తూ పలువురు మన్నలను అందుతూన్న యలగొండ స్వామి గతంలో ముత్తారం సర్పంచ్ గా గ్రామంలో అభివృద్ధి తో పాటు పలువురికి ఆర్థిక సహాయ సహకారాలు అందజేసి గ్రామంలో మంచి గుర్తింపు పొందిన యలగొండ స్వామి డిసిసిబి చైర్మన్ పదవిని దక్కించుకునే అవకాశం ఉంది. .తుపాకుల యలగొండ స్వామికి డిసిసిబి చైర్మన్ పదవిని ఇవ్వాలని కోరుకుంటున్న ముదిగొండ మండల ప్రజలతోపాటు జిల్లాలో పలువురు ముఖ్య నాయకులు,డీసీసీబీ చైర్మన్ పదవి బీసీ బిడ్డ తుపాకులకే ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జనాభాలో 60శాతంగా ఉన్న బీసీలకు కాంగ్రెస్ పాలక వర్గంలో ప్రాధాన్యం ఇవ్వాలని, డీసీసీబీ చైర్మన్ పదవికి అన్ని అర్హతలు కలిగి ఉండడంతో ఆయనకే ఇవ్వాలని, ఇప్పటికే జిల్లాలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి ముఖ్యమైన పదవులు దక్కడంతో బీసీలకు అన్యాయం జరుగుతుందని,సామాజిక న్యామం జరగాలంటే,అన్ని అర్హతలు కలిగి,వివాదాస్పదుడిగా జిల్లాలో మంచి పేరున్న యలగొండస్వామికి, డీసీసీబీ చైర్మన్ పదవిని కట్టబెట్టటంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు చొరవ తీసికొని,బిసిలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# హామీలు నెరవేర్చలేని కాంగ్రెస్ నిజస్వరూపం బట్టబయలు..

**- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**



గోదావరిఖని, మార్చి 20, (జనంసాక్షి) :
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా 420 హామీలను నెరవేర్చక నిజస్వరూపాన్ని బట్టబయలు చేసిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు.గోదావరిఖని చౌరస్తాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చందర్ మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీకి హామీలు ఇవ్వడం తప్పా..అమలు చేయడం తెలియదని ప్రజలు తెలుసుకుంటున్నారని, హామీలను అమలు చేయడం చేతగాక బీఆర్ఎస్ పార్టీ పథకాలనే కొనసాగిస్తూ వస్తుందని అన్నారు.వృద్దులకు 4 వేల పింఛన్, వికలాంగులకు 6వేల పింఛన్, కల్యాణలక్ష్మి తులం బంగారం మాటలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు 2500 రూపాయలు వేసే గ్యారంటీని అటకెక్కించి కొత్తగా మహిళలను మోసం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయించుకోవడానికి ఋణాలంటూ, ఇన్సూరెన్స్ అంటూ కొత్తనాటకం మొదలు పెట్టిందని అన్నారు.ఏప్రిల్ 1వ తేదీ నుండి వడ్లు కొనడం ప్రారంభిస్తామని తెలిపిందని, ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటప్రకారం 500 బోనస్‌తో ఇవ్వాలని కోరారు.పాల ఉత్పత్తిపై 5 రూపాయల ప్రోత్సహకం ప్రకటించాలని, 2680 రూపాయలతో వడ్లను కొంటామని మాట ఇచ్చిన ప్రకారం వడ్ల కొనుగోలు చేయాలని కోరుకంటి చందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రామగుండం నగర డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు మాట్లాడుతూ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారికి సర్వీస్ రోడ్డు మధ్యలో షాపులను ఏర్పరచుకోవడానికి గతంలో అవకాశం కల్పించామని, ఇప్పటి ఎమ్మెల్యే షాపులను కూల్చడం జరుగుతుందని, షాపులను కోల్పోతున్న వారికీ వ్యాపారం జరిగే స్థలంలో షాపులకు స్థలం ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ విలేఖరుల సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని ఋణాలు..

- వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలి..
- బీమా సౌకర్యం, నిధుల విడుదల..
- సభ్యులకు రూ. 10 లక్షల ప్రమాద బీమ, రుణ బీమా కల్పించడం శుభపరిణామం..
- రామగుండం నగర పాలక సంస్థలో
- స్త్రినిధి ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరం..
- మహిళల అభ్యున్నతి కొరకు ఇప్పటికైనా నగర పాలక సంస్థలో స్త్రినిధి ఏర్పాటు చేయాలి..
- ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్..




**గోదావరిఖని, మార్చి 20, (జనంసాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం ఏమో మహిళల అభ్యున్నతి కోసం అన్ని రకాలుగా పథకాలను ప్రవేశపెడుతూ మరియు మహిళ స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తూ ముందుకు పోతున్న తరుణంలో రామగుండం నగర పాలక సంస్థలో మాత్రం దాదాపు పది ఏళ్లుగా మహిళల అభ్యున్నతి కోసం, ముఖ్యంగా పెద మహిళల కోసం స్త్రీనిధి ఏర్పాటు చేయాలని మా పక్షాన పోరాడుతున్నమని కొంతమంది అవగాహన లేనివారు కవల్సుకొని స్త్రీనిధిని రాకుండా అడ్డుకోవడం నిజంగా దురదృష్టకరమని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ పేర్కొన్నారు.అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 14వ తేదీన విడుదల చేసిన జీవో నెంబర్ 217, 218 ద్వారా రాష్ట్ర ప్రభుత్వంచే మహిళా సంఘాలలో ఉన్న వారికి ఉచితంగా ప్రమాద బీమా 10 లక్షల రూపాయల వరకు కల్పించడం జరిగిందని, ఏదైనా కారణం చేత పూర్తిగా అంగ వైకల్యం కలిగిన పూర్తి బీమా వర్తిస్తుందని పాక్షికంగా అంగవైకల్యం కలిగితే ఐదు లక్షల రూపాయల వరకు బీమా వర్తిస్తుందని,బ్యాంకు ద్వారా మహిళా సంఘం బ్యాంకు లింకేజ్ రుణం తీసుకున్న సభ్యురాలు సాధారణ మరణం చెందిన రెండు లక్షల రూపాయలు లేదా సభ్యురాలు చనిపోయే నాటికి బ్యాంకులో ఉన్న రుణ మొత్తం ఏది తక్కువగా ఉంటే ఆ మొత్తానికి ఇన్సూరెన్స్ వర్తిస్తుందని పేర్కొన్నారు.స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్న సభ్యురాలికి వారు తీసుకున్న రుణం మొత్తానికి సురక్ష బీమా ఉంటుందన్నారు.ముందుగా చెప్పిన పది లక్షల రూపాయలు, రెండు లక్షల రూపాయలకు ఇన్సూరెన్స్ ప్రీమియంను ప్రభుత్వమే స్త్రీ నిధి సంస్థకు చెల్లిస్తుందన్నారు. సభ్యురాలు ఎలాంటి రుసుము చెల్లించనక్కర్లేదు పేర్కొన్నారు.మూడు రకాల ఇన్సూరెన్స్ స్కీములు అన్నీ కూడా స్త్రీ నిధి సంస్థ ద్వారా అమలు చేయబడుచున్నావన్నరు.
కావున గ్రూపులో మహిళలందరికీ తెలియజేసి అవగాహన కల్పించగలన్నారు.సీఎం నిర్ణయం మేరకు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 10 లక్షల ప్రమాద బీమ, రుణ బీమా కల్పిస్తూ ప్రభుత్వం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. మహిళలు తీసుకునే రుణాలకు ఇన్సూరెన్స్ (రిస్క్ కవరేజ్) కోసం స్త్రీ నిధి సమాఖ్యకు రూ.50.41 కోట్ల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయడం శుభపరిణామం అన్నారు.
ఇప్పటికైనా రామగుండం నగరపాలక సంస్థలో మహిళల అభ్యున్నతి కోసం వారి ఎదుగుదల కోసం అధికార యంత్రాంగం స్పందించి స్త్రీనిధిని తక్షణమే ఏర్పాటు చేయాలని దినేష్ అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.



## గోడ ప్రతుల ఆవిష్కరణ..

**రామగుండం, మార్చి 20, (జనం సాక్షి):**
సిపిఐ (ఎం ఎల్ ) న్యూ డెమోక్రసి పార్టీ అనుబంధ సంగం. పివైఎల్. పీడీఎస్ యు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా. రామగుండం పట్టణంలోని అంబేద్కర్ చవ్రస్తలో గోడ ప్రతులను ఆ సంగం నాయకులు ఆవిష్కరించారు. కామ్రేడ్ షాహిద్ భగత్ సింగ్. రాజగురు. సుఖ్ దేవ్ ల 93వ. వర్ధంతి సందర్భంగా ఈ నెల 15 నుండి 30వ తేదీ వరకు నిర్వహించే సభలను అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు బొంతు ఆనంద్. పైడిలపెల్లి రమేష్. మేరుగు చంద్రయ్య. మల్లేష్. రమేష్. తిరుపతి. మహేందర్. బాబు. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత ప్లాస్టిక్ సామాగ్రి స్వాధీనం..



**గోదావరిఖని, మార్చి 20,(జనంసాక్షి):**
రామగుండం నగర పాలక సంస్థ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్ అద్వర్యంలో బేకరీలు,పచ్చళ్ళ దుకాణాలలో తనిఖీలు నిర్వహి0చి నిషేధిత ప్లాస్టిక్ సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు.

## స్కిల్ డెవలప్ మెంట్ నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు..



**గోదావరిఖని, మార్చి 20, (జనంసాక్షి):**
ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ఆర్జీ-1 జియం చింతల శ్రీనివాస్ తెలిపారు. నైపుణ్యాభి వృద్ధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు సంస్థ ఇచ్చిన గడువు ఈ నెల 15తో ముగిసింది. సింగరేణి పరిసర ప్రాంత యువత విజ్ఞప్తి మేరకు ఈ నెలాఖరు వరకు పెంచి నట్లు వారు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మొత్తం 38 రకాల వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో కాస్మోటాలజీ, బ్యూటిషియన్, టైలరింగ్ (మహిళలకు మాత్రమే), డ్రోన్, సోలార్, సెల్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన 18-42 ఏళ్ల మధ్య వయసు నిరుద్యోగులు అర్హులని చెప్పారు. కాస్మోటాలజీ కోర్సుకు విద్యార్హత అవసరం లేదని, ఇతర కోర్సు లకు డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఒక్కో బ్యాచ్ 20 మంది చొప్పున శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తులను సమీపంలోని ఆర్జీ.1 జీవీటీసీ కార్యాలయంలో నేరుగా అందించాలని తెలిపారు.

## పోరాట శక్తి, ఉద్యమ స్ఫూర్తి ఈటెల..

**- ప్రజల మధ్య జన్మదిన వేడుకలు.. - కందుల సంధ్యారాణి..**




**గోదావరిఖని, మార్చి 20, (జనంసాక్షి):**
తెలంగాణ జాతి గర్వించే పేరు "ఈటల రాజేందర్" అని కొనియాడారు బిజెపి రామగుండం నియోజకవర్గ ఇంచార్జి కందుల సంధ్యారాణి. ఈ మేరకు బుధవారం ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలలో సంధ్యారాణి పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్రంలో పోరాట శక్తి, ఉద్యమ స్ఫూర్తిగా నిలుస్తున్న ఈటెల రాజేందర్ విశిష్ట ప్రత్యేకత కలిగిన నాయకులు అని అభివర్ణించారు. అన్నా అని పిలిస్తే ఆదుకునే చేతులు సల్లంగుండాలి అని అన్నారు. ప్రజల మధ్య జన్మదిన వేడుకలు నిండు నూరేళ్లు జరుపుకోవాలి అని అయోధ్య రామయ్య ఆశీస్సులు ఈటలపై ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నారు. తనకోసం కాకుండా తన ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సమస్యలపై నిరంతరం శ్రమిస్తున్న ఈటల ప్రతి తెలంగాణ పౌరుడి హృదయ స్పందన అని అన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

**అంతర్గం ఎస్ఐ వెంకటస్వామి**

**రామగుండం, మార్చి 20, (జనంసాక్షి) :**
అంతర్గం మండల పరిధిలో స్థానిక గోదావరి నది నుండి. అక్రమంగ ఇసుక రవాణా చేసినా . అక్రమ ఇసుక నిలువలు చేసినా కఠిన చర్యలు తప్పవని అంతర్గం ఎస్ఐ బీ.వెంకటస్వామి హెచ్చరించారు. మండల పరిధిలో అక్రమ ఇసుక నిలువ చేసారని సమాచారం రావటంతో బుదవారం రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి సంయుక్తంగా దాడి చేసి. స్థానిక ట్రాక్టర్ యజమానులు అక్రమంగా నిలువ చేసిన దాదాపు 140 ట్రాక్టర్ల ఇసుక.420 క్యూబిక్ మీటర్ల ఇసుకను స్వాదినం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.మండల పరిధిలో అక్రమంగా ఇసుక నిలువలుంటే పోలీసులకు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచుతామణి ఆయన తెలిపారు.



సినిమా

# నిజాయితీని చాటిన మట్టి మనుషుల సినిమా

భారతీయ అలంకారశాస్త్రం కావ్యనాయకుడికి నాలుగు లక్షణాలు ఉండాలని పేర్కొన్నది. ధీరోదాత్తుడు, ధీరోద్ధతుడు, ధీరలలితుడు, ధీర శాంతుడు అయినటువాడే హీరో అని నిర్ధారించింది. అంటే ఒక కావ్యానికి హీరోకు ఈ లక్షణాలు ఉండాలని తెలిపింది. మరి ఈ నియమాన్ని బ్రేక్ చేయాలంటే దమ్ముండాలి. తెలుగులో వస్తున్న భారీ సినిమాలు తొంభై తొమ్మిది శాతం మంది హీరోలు ఇట్లా బలవంతుల్లే ఉంటారు. వారికోసం అల్లుకునే కథలు కూడా భారీ సెట్టింగుల మధ్య రూపుదిద్దుకుంటాయి. ఇక్కడే సినిమాకు, ప్రేక్షకునికి నడుమ గ్యాప్ కొన్ని వేలకిలోమీటర్లు పెరిగింది. సినిమా అంటే అది నాది కాదు. అందులో నేనెందుకు ఉంటాను? అనే మైండ్‌సెట్‌ను పెంచే సినిమాలే ఎక్కువగా వెలువడ్డాయి. దీనిని గత కొంతకాలంగా బ్రేక్ చేసే ప్రయత్నాలు చేశాయి చిన్న సినిమాలు. సామాన్యుణ్ణే కథానాయకుణ్ణి చేసిన మెచ్చుకోదగిన సినిమే "షరతులు వర్తిస్తాయి".








నిజాయితీతో సామాన్యుల జీవితాన్ని తెరకు ఎక్కించే ప్రయత్నం చేశాడు దర్శకుడు అక్షర కుమార్. ఇది తనకు మొదటి సినిమానే అయినా సరే, చేయి తిరిగిన డైరక్టర్‌లా తన పనితనాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. కథను ఎంపిక చేసుకోవడంలోనే ఈ దర్శకుని ప్రతిభ కనిపిస్తది. నూటికి ఎనభై శాతంగా ఉన్న పేద, మధ్య తరగతి జీవుల కథ ఇది. అందుకే ఈ సినిమా చూసే వారందరికీ తమను, తమ రోజు వారి జీవితాన్ని తెర మీద చూస్తున్నట్టు అనిపిస్తుంది. మధ్యతరగతి బతుకుల్లో అనుకోకుండా వచ్చిపడే కష్టాలకు ఎట్లా కుదేలవుతడో అత్యంత సహజంగా చూపించాడు. గట్టి కష్టమొస్తే ఈ మిడిల్ క్లాస్ జీవితాలు ఖచ్చితంగా చేరుకునే చోటు హాస్పిటలే. మళ్లీ అక్కడ కూడా కష్టాలే. లక్షలకు లక్షలు ఫీజులు కట్టాలంటే అప్పటిదాకా కూడబెట్టుకున్న పైసా పైసా ప్రవేట్ హాస్పిటల్‌కు సమర్పించుకోవాల్సిందే. అలాంటి ఒక కుటుంబ కథా చిత్రమే ఈ షరతులు వర్తిస్తాయి.

ఒక్కడి కష్టం మీద బతికే కుటుంబం, అదనంగా పడే ఏ చిన్న భారాన్ని కూడా భరించలేదు. ఇక ఇలాంటి కుటుంబాలను ముంచడానికి ఏ గుంటనక్కలో స్కెచ్ వేస్తే, ఎందరి బతుకులు రోడ్డున పడతాయో మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. చిట్టీలు వేసి నిండా ముంచి పరారైన యజమానుల వార్తలు. మరి అలాంటి ఒక కథాంశాన్ని ఎన్నుకొని పాత్రలను తీర్చిదిద్దడంలో ఎంతో నైపుణ్యతను ప్రదర్శించాడు డైరక్టర్ అక్షర. ఒక్కో పాత్ర స్పందించే తీరు, వారి స్వభావాలు అన్నీ కళ్లముందుకు తెచ్చాడు. నూనె ప్యాకెట్ అయిపోతే చాలు గుండెల్లో రాయిపడ్డట్టుగా విలవిలాడే తీరు మనం ఏ తమిళ సినిమాలో మాత్రమే చూడగలం. అట్టడుగు స్థాయిలో ప్రజల బతుకు ఎట్లా ఉందో చూపే ప్రయత్నాలు తెలుగు కంటే తమిళ, మళయాల సినిమాల్లోనే ఎక్కువ. మరి అలాంటి ప్రయోగాన్ని తెలుగులో సక్సెస్‌ఫుల్‌గా చేయగలిగాడు ఈ దర్శకుడు. అనేక పరిమితులకు గిరిగీసుకుని బతికే బడుగు జీవుల వ్యథల నాడీని పట్టుకున్నాడు దర్శకుడు. అందుకే సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు ఎక్కడ కూడా డీవియేట్ అయ్యి పక్కకు చూడరు. తమ జీవితమే తెర మీదికి ఎక్కిందనే భావనలోకి వస్తారు. అట్లా ఆకాశంలో ఉన్న సినిమా పల్స్‌ను నేల మీదికి దించాడు అక్షర. సగటు సామాన్యుల జీవితమే ఇతివృత్తంగా దీనిని తెర మీదికి ఎక్కించాడు. మెప్పించాడు.

ఈ సినిమా బలాబలాల గురించి మాట్లాడుకుంటే కథే ఈ సినిమాకు మొదటి ప్రాణం. అభివృద్ధి చెందుతున్న దేశంగా చెప్పబడుతున్న మన దేశంలో ఏ ఊరికి వెళ్లినా ఇలాంటి కథలే కనిపిస్తాయి. ఉపాధిలేని, ఉద్యోగం లేని జీవితాల్లో నిత్య పెనుగులాటలు ఉంటాయి. వాటిని అనుభవిస్తే తప్ప ఇలాంటి కథ రాసుకోవడం సాధ్యంకాదు. ఇక్కడే దర్శకుని నిజాయితీ కనిపిస్తుంది. అబద్దాలు చెప్పడం, లేనివి ఉన్నట్టుగా మాయచేయడం ఈ దర్శకునికి తెలియదు. తను ప్రేమించిన మట్టి జీవితాన్ని సజీవంగా తెరకు ఎక్కించి ఒక మంచి సినిమా చేయాలనుకున్న తపన అడుగడుగునా కనిపిస్తుంది. మధ్యతరగతి కుటుంబ సభ్యుల మధ్య ఉండే అనుబంధాలే కాదు,అలజడులు కూడా అంతే నేచురల్‌గా చూపిస్తాడు. చాలా కుటుంబాల్లో ఆడపిల్లలు ఇవాళ కుటుంబ భారాన్ని మోస్తున్నారు. అలాంటి వారి దృక్పథాన్ని కూడా ఈ సినిమా కథానాయకి పాత్రలో చక్కగా చూపించాడు. అంతేకాదు ఎంతమారినా మారని కులజాఢ్యపు తీరు, అలాగే మారుతున్న ఈ తరపు పోకడను ఏకకాలంలో ఒకే సీన్‌లో అద్భుతంగా చూపించాడు. అమ్మాయివాళ్లు మన కులం కాదుకదా అని తల్లి అడిగిన ప్రశ్నకు చిన్నకొడుకు, బిడ్డా గట్టిగనే సమాధానం చెప్తారు. ఎవరు మనోళ్లు నీకు రోగమొస్తే చూసే డాక్టరు మనోడా, మాకు సదువుచెప్పిన టీచర్ మనోడా అంతెందుకు నువ్వు చూస్తున్న సీరియల్‌లో నటీనటులు మనోళ్లా..?! అయినా నువ్వు చూస్తలేవా అని నిలదీసే సాహసం చేశాడు దర్శకుడు. అంతేకాదు కథానాయకుడి యిల్లు సావిత్రిభాయి నగర్‌లో ఉంటది. ఇక తన ఇంటికి కాంపౌండ్‌గోడకు పూలేదంపతుల నిలయం అని నేమ్ ప్లేట్ ఉంటది. ఇది దర్శకుని నిశిత దృష్టికి నిదర్శనం. ఇవాళ మన సమాజంలో 52శాతంగా ఉన్న బీసీలలో రావాల్సిన చైతన్యాన్ని ఇది ఆకాంక్షిస్తున్నది. అంతేకాదు కొందరి చేతిలోనే అధికారం ఉండి, మిగిలిన వారిని ఐదేళ్లకోసారి పావుల్లా వాడుకునే అగ్రవర్ణనీతిని సైతం ఈ సినిమా దునుమాడిరది.

అంతేకాదు బీసీ కుటుంబాల్లో వేడినీళ్లకు చన్నీళ్లలా తలా ఒక పని చేసి ఇల్లును పోషించుకోవాలనే దృక్పథం ఉంటుంది. అందుకే ఈ సినిమాలో పెళ్లయిన హీరో తన భార్యకు ఒక స్టేషనరీ షాపు పెట్టిస్తానంటాడు. పెద్దపెద్ద ఆశలు లేకపోవడం. ఎచ్చులకుపోయి ఎల్లెలుకల పడకపోవడం అనే పరిమిత ప్రశాంత జీవితాన్ని మధ్యతరగతి జీవులు ఎట్లా సాధన చేస్తారో చూపించాడు. పక్షి ఒక్కో గడ్డి పరక తెచ్చి గూడల్లుకున్నట్టు బడుగుల జీవితాల్లో ఒక్కో వస్తువును సమకూర్చుకునేసరికే సగం జీవితం అయిపోతుంది. ఉన్నొక్క టీవీ రిమోట్ కోసం కొట్టుకునే అత్తాకోడళ్ల పంచాయితీలు ఎప్పటి నుండో ఉన్నాయి. కాకుంటే ఈ చిన్న గొడవను కూడా వాట్సప్ స్టేటస్‌లో పెట్టుకునే కొత్త కోడళ్ల తెలివి సరికొత్త పరిణామం. ఇలాంటి సందర్భాల్లో కట్టె ఇరుగకుండా, పాము చావకుండా సంసారాల్ని నిలబెట్టుకునే నేర్పరితనం కొడుకులో ఉండడం ఈ సినిమాలో అత్యద్భుతంగా చూపించాడు దర్శకుడు. ఇలాంటి నేర్పరితనం లేని సంసారాలెన్నో చిన్ని విషయాలకే మన సమాజంలో రోడ్డున పడుతున్నాయి.

ఇక ఈ సినిమాకు మాటలు మరింత బలాన్ని పెంచాయి. రచయిత పెద్దింటి అశోక్ కుమార్ గారు. వారు ప్రసిద్ధ రచయిత. అనేక కథా సంపుటాలు, నవలలు వెలువరించి, వెండి తెర మీద కూడా తన మార్క్ సంతకం చేస్తున్నారు. ఈ సినిమాలో తెలంగాణ యాసను, భాషను ఎంతో సుందరంగా పలికించారు. వ్యక్తిగతంగా అశోక్ కుమార్‌గారు పరిచయం ఉన్న వాళ్లకు అయితే ప్రతీ డైలాగ్ అశోక్‌గారి నోటి నుండి వెలువడ్డట్టే ఉంటుంది. యాసే భాషకు ప్రాణమన్న సూత్రాన్ని ఈ సినిమాలో డైలాగ్‌లకు అవకాశమున్న అన్ని సందర్భాల్లో మాటలతో ప్రాణం పోశారు. చాలా సహజంగా కరీంనగర్ మాండలికాన్ని సినిమాలోకి పట్టుకొచ్చారు. గతంలో కంచె, మల్లేశం, వేదం వంటి సినిమాలకు పనిచేసిన ఈ రచయిత మాటలు సినిమాకు మరింత జవజీవాలను ఇచ్చాయని చెప్పొచ్చు.


నటీనటులు చైతన్యరావు, భూమి శెట్టి, నందకిషోర్, సంతోష్, దేవరాజ్, వెంకీ, శివకళ్యాణ్, మల్లేష్ బల్లాష్ట్ తదితరులు వారివారి పాత్రలకు న్యాయం చేశారు. ప్రాణం పెట్టి పాత్రల్లో ఒదిగిపోయారు. సినిమా చూస్తున్నంత సేపు ఈ నటీనటులు మన రోజువారి జీవితంలో కలిసే మిత్రుల్లాగే, ఈ సినిమాలోని కుటుంబ సభ్యులు మన ఫ్యామిలీ మెంబర్స్‌లాగే అనిపిస్తారు. అంతలా మెప్పించారు. అలాగే సంగీతం అరుణ్ చిలువేరు, సురేష్ బొబ్బిలి తమ బాణీలతో,బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో అలరించారు. ఈ సినిమాలో సాహిత్యకారుల్కెన గోరటి వెంకన్న, పెద్దింటి అశోక్ కుమార్‌లతో పాటు నారాయణస్వామి వెంకటయోగి, పింగళి చైతన్య, మల్లెగోడ గంగాప్రసాద్ తదితరులు మంచిపాటలు అందించారు. చిన్న సినిమాల పరంపరలో ఇట్లా షరతులు వర్తిస్తాయి తనదైన ముద్రను వేయగలిగింది. ముఖ్యంగా తన తొలి సినిమాతోనే ప్రశంసలు అందుకున్న ఈ దర్శకుడు తెలంగాణ నుండి ఒక మంచి దర్శకుణ్ణి రేపటికి ప్రామిస్ చేస్తున్నాడు. మరెన్నో మంచి సినిమాలు తన డైరక్షన్ నుండి గ్యారెంటీగా వస్తాయి అనిపిస్తున్నది.



ఇంతమంచి సినిమాను ఓటీటీలోకి వచ్చేదాకా ఎదురు చూడకుండా సకుటుంబ సపరివార సమేతంగా చూసి ఆదరించడమే ఇప్పుడు ప్రేక్షకులు చేయాల్సిన పని.

-డా.పసునూరి రవీందర్,
సీనియర్ జర్నలిస్టు.

## సుమారు గంట పాటు ఐపీఎల్ వేడుకలు



సాయంత్రం 6.30 గంటలకు ఐపీఎల్ ప్రారంభోత్సవం ప్రారంభం కానుంది. సుమారు గంట పాటు ఈ వేడుక జరగనుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఐపీఎల్ ప్రారంభ వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. అలాగే ఐపీఎల్ మ్యాచ్‌లు జియో యాప్‌లో ఉచితంగా స్ట్రీమింగ్ కానున్నాయి. బాలీవుడ్ ప్రముఖ నటులు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్లు ఏఆర్ రెహమాన్, సోనూ నిగమ్ తదితరులు ఈసారి ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొననున్నారని సమాచారం. చెన్నై, బెంగళూరు మధ్య రాత్రి 8 గంటలకు తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఓపెనింగ్ మ్యాచ్ మినహా అన్ని నైట్ మ్యాచ్‌లు రాత్రి 7.30 గంటలకు ప్రారంభమవుతాయి. ఐపీఎల్ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ తొలి మ్యాచ్ ఆడడం ఇది తొమ్మిదోసారి. మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్సీలో, సీఎస్కే గతంలో 2009, 2011, 2012, 2018, 2019, 2022 మరియు 2023 సీజన్లలో ఓపెనింగ్ మ్యాచ్ ఆడింది. సార్వత్రిక ఎన్నికల కారణంగా బీసీసీఐ ఈ ఏడాది ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం, మొదటి దశలో 17 రోజుల్లో 2 డబుల్ హెడర్‌లతో సహా మొత్తం 21 మ్యాచ్‌లు జరుగుతాయి. మిగతా షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

మార్చి 22 నుంచి ఐపీఎల్ 17వ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ఎడిషన్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ చెన్నైలోని ఎం చిదంబరం మైదానంలో జరుగుతుండగా, ఈ మ్యాచ్‌కు ముందు ప్రారంభోత్సవ వేడుకను కూడా ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిసారీ మాదిరిగానే ఈసారి కూడా అట్టహాసంగా ప్రారంభోత్సవం నిర్వహించేందుకు బీసీసీఐ అన్ని సన్నాహాలు చేస్తోంది. ప్రారంభ మ్యాచ్ జరిగే చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ఈ వేడుకను నిర్వహించనున్నారు. శుక్రవారం

## రింకూ ధనాధన్ ఇన్నింగ్స్



ఐపీఎల్ 2024 ప్రారంభానికి ఇంకా రెండు రోజులు మిగిలి ఉన్నాయి . అన్ని జట్లు కష్టపడి సిద్ధమవుతున్నాయి. మరోవైపు ఈ మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. మార్చి 22న చెన్నై, ఆర్‌సీబీ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కంటే ముందే టీమిండియా యంగ్ ప్లేయర్ రింకూ సింగ్ సంచలనం సృష్టించించాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్లేయరైన (24.75 కోట్లు) మిచెల్ స్టార్క్ బౌలింగ్ లో కళ్లు చెదిరే సిక్స్ కొట్టాడు. ప్రాక్టీస్ మ్యాచ్ లో ఇది జరగ్గా, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. ఐపీఎల్ సన్నాహకాల్లో భాగంగా.. కేకేఆర్ టీమ్ పర్పుల్, టీమ్ గోల్డ్‌గా విడిపోయి ప్రాక్టీస్ చేశాయి. కేకేఆర్ ఈడెన్ గార్డెన్స్ మైదానంలో జరిగిన ఈ ప్రాక్టీస్ మ్యాచ్ లో పర్పుల్‌కు స్టార్క్ సారథ్యం వహించగా.. టీమ్ గోల్డ్‌లో ఉన్న రింకూ సింగ్ అతడికి పట్ట పగలే చుక్కలు చూపించాడు. ముఖ్యంగా స్టార్క్ వేసిన ఓ ఫుల్ టాస్ బంతిని భారీ సిక్సర్ బాదాడు రింకూ.

రింకూ ధాటికి బంతి నేరుగా స్క్వేర్ లెగ్ దిశలో స్టేడియంలోకి వెళ్లి పడింది. ఈ మ్యాచ్ లో రింకూ సింగ్ 16 బంతుల్లోనే 37 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు స్టార్క్ 4 ఓవర్లు వేసి ఏకంగా 40 పరుగులు సమర్పించుకున్నాడు. కేవలం ఒక వికెట్ మాత్రమే తీయగలిగాడు. కాగా ఐపీఎల్‌లో రింకూ ధర కేవలం రూ. 55 లక్షలు మాత్రమే. వన్డే వరల్డ్‌కప్-2023లో సత్తాచాటిన మిచెల్ స్టార్క్ కోసం కనీవినీ ఎరుగని రీతిలో ఏకంగా రూ. 24.75 కోట్లు ఖర్చు పెట్టింది కోల్ కతా నైట్ రైడర్స్. అతను దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఐపీఎల్‌లో పునరాగమనం చేయనున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ మార్చి 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది.


**కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్:** నితీష్ రాణా, రింకూ సింగ్, రహ్మానుల్లా గుర్బాజ్, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), జాసన్ రాయ్, సునీల్ నరైన్, సుయేష్ శర్మ, అనుకుల్ రాయ్, ఆండ్రీ రస్సెల్, వెంకటేష్ అయ్యర్, హర్షిత్ రాణా, వైభవ్ చరోరతి, వైభవ్ చరోరతి భరత్, చేతన్ సకారియా, మిచెల్ స్టార్క్, అంగ్రిక్ష్ రఘువంశీ, రమణదీప్ సింగ్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్, మనీష్ పాండే, ముజీబ్ ఉర్ రెహమాన్, గుస్ అట్కిన్సన్, సాకిబ్ హుస్సేన్.

## అదరగొడుతున్న ఎస్‌ఆర్‌హెచ్ కొత్త సాంగ్

ఐపీఎల్ 2024 సీజన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ కొత్త పాటను రిలీజ్ చేసింది. క్యాచీ ట్యూన్ కలిగిన ఈ పాట 'సన్‌రైజర్స్ మేము బ్రో పక్కా ఇంకో రేంజ్ బ్రో..' అంటూ స్టార్ట్ అవుతుంది.. ఈ పాటలో సన్‌రైజర్స్ కొత్త సారథి పాట్ కమిన్స్, ఎయిడెన్ మార్క్రమ్, హెన్రిచ్ క్లాసెన్, ట్రవిస్ హెడ్, టీమిండియా ప్లేయర్లు భువనేశ్వర్ కుమార్, వాషింగ్టన్ సుందర్, మయాంక్ అగర్వాల్, జయదేవ్ ఉనద్కత్ తదితర ఆటగాళ్లు కొత్త జెర్సీలు ధరించి బీట్‌కు తగ్గట్టుగా డ్యాన్స్ చేశారు. సన్‌రైజర్స్ టీమ్ అభిమానుల్లో జోష్ నింపుతున్న ఈ సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. కాగా, ఐపీఎల్ 17వ ఎడిషన్ ఎల్లుండి (మార్చి 22) నుంచి ప్రారంభం కానుంది. చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా జరిగే సీజన్ తొలి మ్యాచ్‌లో ఆర్సీబీతో డిఫెండింగ్ ఛాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్ తలపడుతుంది. ఇక, కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో సన్‌రైజర్స్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 23న కేకేఆర్‌తో ఆడబోతుంది.



## కేఎల్ రాహుల్ ప్రత్యేక పూజలు!



ఐపీఎల్ 2024కు సమయం ఆసన్నమైంది. మార్చి 22న 17వ సీజన్ ఆరంభం కానుంది. టోర్నీ మొదటి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. మార్చి 24న రాజస్తాన్ రాయల్స్‌తో లక్నో సూపర్ జెయింట్స్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ ద్వారా టీమిండియా స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ తిరిగి మైదానంలో అడుగుపెట్టనున్నాడు. గాయం నుంచి కోలుకున్న రాహుల్.. లక్నో కెప్టెన్ హోదాలో బరిలోకి దిగనున్నాడు. ఐపీఎల్ 2024లో బరిలోకి దిగే ముందు రాహుల్ ప్రత్యేక పూజలు చేశాడు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయాన్ని ఈరోజు కేఎల్ రాహుల్ దర్శించుకున్నాడు. తల్లిదండ్రులతో కలిసి ఉదయాన్నే గుడికి వెళ్లిన రాహుల్.. భస్మా హారతి తీసుకున్నాడు. అనంతరం మహాదేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. పండితుల ఆశీర్వచనాలు పొందాడు. మహాకాళేశ్వరుడిని దర్శించుకున్న రాహుల్.. ఐపీఎల్‌లో దిగేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు సంబందించిన ఫొటోస్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గతంలో విరాట్ కోహ్లీ కూడా ఉజ్జయిని మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నాడు. గతేడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ సందర్భంగా కేఎల్ రాహుల్ గాయపడ్డాడు. దాంతో ఐపీఎల్ 2023లో కీలక మ్యాచ్‌లకు దూరమయ్యాడు. రాహుల్ స్థానంలో లక్నో పగ్గాలు చేపట్టిన కృనాల్ పాండ్యా జట్టును ప్లే ఆఫ్స్‌కు చేర్చాడు. అయితే నాకౌట్ మ్యాచ్‌లో చేతులెత్తేసిన లక్నో.. ఇంటిదారి పట్టింది. తొడ కండరాల గాయానికి శస్త్ర చికిత్స చేసుకున్న రాహుల్.. వన్డే ప్రపంచకప్ 2023లో కీపర్‌గానూ రాణించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో ముగిసిన టెస్టు సిరీస్‌లో అతడికి మళ్లీ గాయం తిరగబెట్టింది. దాంతో లండన్ వెళ్లి వైద్య నిపుణులను సంప్రదించాడు. అనంతరం ఎన్‌సీఏలో పునరావాసం పొందిన రాహుల్.. తాజాగా ఫిట్‌నెస్ సాధించాడు.

## బాలికపై అమానుషం

- గర్భం దాల్చిన బాలిక
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**సుజాతనగర్, మార్చి 20 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్ మండలంలో ఓ మైనర్ బాలిక గర్భం దాల్చిన ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది సుజాతనగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక గర్భం దాల్చడంతో చర్చనీయాంశమైంది. ఈనెల 18వ తేదీన పదవ తరగతి పరీక్ష రాయడానికి వచ్చిన బాలిక వాంతులు కావడంతో కళ్ళు తిరిగి కిందపడిపోవడంతో పాఠశాల యజమాన్యం సహాయంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు తరలించారు అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి పంపించారు అంతకుముందు గా ఈ నెల 15వ వ తేదీన తీవ్ర కడుపునొప్పి రావడంతో ప్రాథమిక హాస్పటల్ కి వెళ్ళగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం వైద్యశాలకు వెళ్లాలని వైద్యులు సూచించారు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులకు బాలికను గట్టిగా మందలించగా అసలు విషయం బయటపడింది తనతో పాటు చదువుకుంటున్న ఓ గ్రామానికి చెందిన పదోవ తరగతి విద్యార్థి వల్ల జరిగిందని అసలు విషయం బయటకు తెలిసింది విషయం బయటకు పొక్కకుండా కొంతమంది పెద్ద మనుషులు బాలిక తల్లిదండ్రులకు నచ్చజెప్పి పంచాయతీ చేసినట్లు సుజాతనగర్ మండలంలో చర్చ నడుస్తోంది. ఇద్దరూ మైనర్ విద్యార్థిని విద్యార్థులు కావడంతో పాఠశాల దశలోనే ఇలాంటి సంఘటనలు జరగడంతో ఆ నోటా ఈ నోటా విషయం తెలిసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థి విద్యార్థులలో ఇలాంటి సంఘటనలు చూడటం దురదృష్టకరమని దీనిపై విద్యాశాఖ ఇలాంటి లైంగిక విషయాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని పలు రాజకీయ విశ్లేషకులు కోరుతున్నారు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆ మైనర్ బాలికకు జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు విషయం తెలుసుకున్న సిడిపిఓ సలోమి ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి డి సి పి ఓ హరి కుమారి సోషల్ వర్కర్ భారతి తమ సిబ్బందితో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్ వచ్చి బాధితుల తల్లిదండ్రులకు మైనర్ విద్యార్థినికి కౌన్సిలింగ్ ఇచ్చారు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్కే జుబేదా బేగం యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
గురువారం 21.03.2024



కడుపులో కష్టం దాగున్నా మోముపై చెరగని చిరు నవ్వు ఆయనకే సొంతం.. ఎదుటి వ్యక్తి మొఖంలోకి చూసి కష్టాన్ని పసిగట్టగల నేర్పరితనం.. "నేనున్నా" అంటూ ముందడుగు వేసే ఒక గొప్ప భరోసా.. కుట్రలు పన్ని కుర్చీ లేకుండా చేసినా కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకున్న మనసున్న మారాజు.. మొక్కవోని ధైర్యంతో ముఖ్యమంత్రినే ఢీకొట్టిన ధీశాలి.. సవాల్ విసిరి శిఖరంపై కూర్చున్న చిరుతపులి.. ఆయనే పొంగులేటి శీనన్న..! పట్టుదల, కార్యదీక్షకు నిలువెత్తు నిదర్శనం ఆయన.. రాజకీయ సమాధి చేయా లని కుతంత్రాలు పన్నితే గోడకు కొట్టిన బంతిలా ఎగసిపడిన కురుక్షేత్ర వీరుడు పొంగులేటి.. వెరసి ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో ఆయన తిరుగులేని నాయకుడు. రాజకీయ అరంగేట్రం చేసిన పదేళ్ల వ్యవధిలోనే రాష్ట్ర కేబినెట్‌లో కిరీటం అందుకున్న మేటి దిగ్గజం. రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖామాత్యునిగా బాధ్యతలు మోస్తూ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ మజిలీపై 'జనంసాక్షి' ప్రత్యేక కథనం..!



# అతడే ఓ సైన్యం.. సమూహం



## శీనన్న చేరిక మలుపు.. కాంగ్రెస్ గెలుపు

## ఉ'ప్పొంగిన' ఉత్సాహం.. ప్రతీ కార్యకర్తకు ఉత్తేజం

### ప్రతి గుండెకూ ఆయనే అండ.. ఇంటింటికీ భరోసా

### తెలంగాణ రాజకీయాల్లో చక్రంతిప్పిన మహా ఘటికుడు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ మజిలీపై

### జనంసాక్షి ప్రత్యేక కథనం

కూరాకుల గోపి
(ఉమ్మడి ఖమ్మం జిల్లా కరస్పాండెంట్)

"ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో పోటీ చేసే ఏ ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థిని అసెంబ్లీ గేటు తాకనివ్వను. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో పదికి పది స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది. బీఆర్ఎస్‌ను జిల్లాలో గల్లంతు చేయకపోతే నా పేరు పొంగులేటి శ్రీనివాసరెడ్డే కాదు" తెలంగాణ తాజా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఖమ్మం మాజీ ఎంపీ, ప్రస్తుత పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర కేబినేట్‌లో కీలక మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన చాలెంజ్ ఇది. బీఆర్ఎస్ పార్టీని వీడి బయటకి వచ్చిన ఆయన కాంగ్రెస్‌లో చేరి నాటి ముఖ్యమంత్రికే ధీటైన సవాల్ విసిరారు. పొంగులేటి ఎంతో ఆవేశంగా నాటి సీఎంతో చేసిన సవాల్ మేరకు ఆయన తన పంతాన్ని నెగ్గించుకున్నారు కూడా. జిల్లాలోనే కాదు.. రాష్ట్రంలోనే గులాబీ పార్టీని చిత్తుచిత్తుగా చేసిన ఘనతను అందిపుచ్చుకున్నారు. అతి తక్కువ కాలంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల మనసు దోచుకున్న ఆప్యాయ నేతగా పొంగులేటి ఎదిగారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన పది నెలల్లోనే పార్లమెంటులో కాలు మోపారు. ఆ తర్వాత రాజకీయ కుట్రలతో బలి చేద్దామని చూసినా నిత్యం జనంలోనే ఉండి తనదైన రాజకీయాన్ని నెరిపారు. తననే నమ్ముకున్న కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు. వ్యాపారపరంగా, రాజకీయంగా ఎన్నో ఇబ్బందులు పెట్టినా కార్యకర్తల దగ్గర తన కష్టాన్ని ఏనాడూ చెప్పుకోలేదు. "కష్టాన్ని ఎప్పటికప్పుడు దిగమింగుకుంటూ ఒంటరిగా ఉన్నప్పుడు ఏడ్చేవాడిని.." అంటూ ఇటీవల ఓ సమావేశంలో పొంగులేటి ప్రస్తావించడం వెనుక ఆయనను బీఆర్ఎస్ పెద్దలు పెట్టిన ఇబ్బంది ప్రస్ఫుటమవుతోంది.

## సహనశీలి ప్రస్థానం..

నిత్య పోరాటంకాంట్రాక్టర్‌గా మాత్రమే కొందరికి పరిచయం ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2014 ఎన్నికలకు ఏడాది ముందు రాజకీయ అరంగేట్రం చేశారు. 2014 ఎన్నికల్లో వైయస్సార్‌సిపి తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. తెలంగాణ ఉద్యమం తర్వాత కొత్తగా ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రంలోనూ వైఎస్ఆర్‌సీపీ తరపున ఆయన ఎంపీగా గెలుపొందడం విశేషంగా చెప్పుకోవచ్చు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నాటి రాజకీయ సమీకరణాల రీత్యా పొంగులేటి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఒక ఎంపీగా ఆ సమయంలో జిల్లాకు ఏం చేయాలో అది చేశారు. అన్నింటికీ మించి అనతికాలంలోనే ఉమ్మడి జిల్లా ప్రజల మనసు దోచుకున్న నేతగా ఆకాశమంత ఎత్తుకు ఎదిగారు. అనంతరం 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఖమ్మం ఎంపీ టికెట్‌ను పొంగులేటికి ఇవ్వకుండా నామ నాగేశ్వరరావుకు ఇచ్చారు. దీంతో ఆ ఐదేళ్లపాటు సహనం వహించారు. పదవి లేకపోయినా జనంలో మెదిలారు. కుర్చీలేని మహారాజుగా ప్రజలకు మరింతగా చేరువై వెలకట్టలేని సానుభూతిని కూడగట్టుకున్నారు. ఆ సమయంలో శ్రీనన్నకు జనంలో ఆదరణ చూసి సొంత పార్టీయే ఆయనపై కుట్రలు చేసింది. వ్యాపారపరంగా దెబ్బతీయాలని గులాబీ పెద్దలు ఎత్తులు వేశారు. రాజకీయంగా సమాధి చేయాలని కుతంత్రాలు పన్నారు. అయినా అన్నింటినీ ఆయన పంటి బిగువన భరించారు. పొంగులేటి ఆ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పొంగులేటిపై కేసీఆర్ మరింత దాష్టీకం చూపించారు. ఫలితంగా చావో రేవో తేల్చుకోవాలని భావించిన శ్రీనివాస్ రెడ్డి ముందు గులాబీ పార్టీ నుంచి బయటికి వచ్చారు. తొలుత భారతీయ జనతా పార్టీలోకి వెళ్లాలని ప్రయత్నాలు చేసిన పొంగులేటి తన అభిమానుల అభ్యర్థన మేరకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ సమయంలో జిల్లావ్యాపితంగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి అభిమానుల అభ్యర్థన మేరకే చివరికి 'హస్తం' అందుకున్నారు.

## కాంగ్రెస్ విజయానికి 'పొంగులేటి' బాటలు

అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మలుపులు చోటుచేసుకోవడం, కొందరు నేతలు ఉన్నఫళంగా పార్టీలు మారడం ఆసక్తి రేకెత్తించింది. ఈ తరుణంలో పొంగులేటి, జూపల్లికి బీజేపీ గాలం వేసినప్పటికీ మెరుగైన రాజకీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌వైపే మొగ్గుచూపడం ఆయనలోని చాణక్యతను చాటింది. ఆ సందర్భంలో పొంగులేటి చేరిన పార్టీకి భారీగా కలిసొస్తుందనే చర్చ కూడా సర్వత్రా వినిపించడం విశేషం. ఖమ్మంలో భారీ బహిరంగ సభను ఏర్పాటుచేసి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సైతం రప్పించి ఆయన సమక్షంలోనే 'హస్తం' గూటికి చేరారు. ఈ సన్నివేశమే కాంగ్రెస్ విజయానికి బాటలు వేసిందనడంలో అతిశయోక్తి లేదు. రాష్ట్రంలో ఎన్నో నియోజకవర్గాలను ప్రభావితం చేసిన ఆయన రాక కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజం తీసుకొచ్చింది. ఉప్పొంగిన ఉత్సాహంతో ప్రతి కార్యకర్తా ముందుకు కదిలాడు. పొంగులేటి చేరికతో యువతలో కూడా జోష్ సంతరించుకుంది. అందుకే కాంగ్రెస్ పార్టీ సైతం ఆయనకు సముచిత ప్రాధాన్యతన్విడం ముదావహం.



## రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పటిష్టతకు అడుగులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పదికి పది స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి తీరతానని శపథం చేసిన శ్రీనివాసరెడ్డి ఆ మేరకు తీవ్ర స్థాయిలో శ్రమించారు. ఎన్నికల వేళ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను చుట్టి వస్తూ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారు. ఒకదశలో ఆయన పోటీ చేసిన పాలేరు నియోజకవర్గం లో ఎక్కువ సమయం ప్రచారం చేయలేనంతగా జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో ప్రచారం హోరెత్తించారు. రాష్ట్రవ్యాప్త రాజకీయాల్లో సైతం కీలక భూమిక పోషించారు. ఆయన తర్వాత పార్టీలో చేరిన సీనియర్ నేత తుమ్మల నాగేశ్వరరావును కలుపుకొని వెళ్తూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సహకారంతో అన్ని నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టానికి ప్రయత్నాలు చేశారు. ఈ ఫలితంగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో 9 స్థానాలను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కైవసం చేసుకోగలిగారు. కాగా భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు విజయం సాధించగలిగారు. ఈ ఒక్క స్థానం మినహా మిగిలిన 9 స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయడంతో పొంగులేటి తన పంతం నెగ్గించుకున్నట్టయింది.



## కేబినెట్‌లో కీలక భూమిక

ఒక ముఖ్యమంత్రికి సవాల్ విసిరి నెగ్గిన పొంగులేటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో ఆకర్షణీయ నేతగా మారారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద అత్యంత చొరవ కలిగిన నాయకుడయ్యారు. ఆ చొరవతోనే గృహ నిర్మాణ శాఖా మంత్రిగా ఉన్న ఆయన సొంత జిల్లాలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని సీఎం చేత ప్రారంభింపజేశారు. ముఖ్యమంత్రి వద్ద పొంగులేటికి ఎంతటి ప్రాధాన్యత ఉందో భద్రాచలంలో జరిగిన ఆ సమావేశంలోనే స్పష్టమయ్యింది.మొత్తంమీద పదేళ్ల అతి తక్కువ సమయంలోనే రాష్ట్ర కేబినెట్‌లో అమాత్యుడైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి పట్టుదల, కార్యదీక్షకు ప్రతిరూపంగా నిలిచారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో "ఒక్కడే ఒంటరిగా" అన్నట్టు డైనమిక్ లీడర్ అయ్యారు. పార్టీ శ్రేణులతో పాటు తనని నమ్మిన ప్రజల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకునే 'పొంగులేటి'పై అభిమాన, అనుచర గణం ఎన్నో ఆశలు పెట్టుకుందనేది అక్షరసత్యం..!!





Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370